

# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు

**అభివృద్ధికి ఆర్థిక గణాంకాలే నిదర్శనం**

- విధ్వంసం నుంచి వికాసం వైపు ఏపీ ఆర్థిక వ్యవస్థ
- స్వర్ణాంధ్రకు బాటలు వేస్తున్న సీఎం చంద్రబాబు
- పీ-4 ఫౌండేషన్ వైస్ చైర్మన్ సి.కుటుంబరావు

9



## రెవెన్యూ సేవలు మరింత సులభతరం

- రియల్‌టైమ్‌లో పట్టాదారు పాస్ పుస్తకాల ఆటో మ్యుటేషన్
- 2027 డిసెంబర్‌నాటికి భూముల రీసర్వే పూర్తి కావాలి
- రెవెన్యూ శాఖ సమీక్షలో సీఎం చంద్రబాబు ఆదేశం

3

## ఒక్క స్వర్ణ చతుర్భుజి.. దేశం దశ మార్చేసింది!

- 'అటల్ సందేశ్.. మోదీ సుపరిపాలన' యాత్రలో కూటమి నేతలు పాల్గొనండి: సీఎం చంద్రబాబు

2

## వృద్ధిరేటు పెంపునకు సరికొత్త ప్రణాళిక!

నేడు సచివాలయంలో ఉన్నతస్థాయి సమావేశం దిశానిర్దేశం చేయనున్న సీఎం చంద్రబాబు

2

# పూర్వోదయ.. ఏపీకి ఉషోదయం!



- మూడు ప్రాంత్రాల సమగ్రాభివృద్ధికి కార్యాచరణ
- సీమలో 20 లక్షల ఎకరాల్లో ఉద్యాన సాగు లక్ష్యం
- సాగునీరు, మౌలిక వసతుల ప్రాజెక్టులకూ నిధుల వినియోగం
- పూర్వోదయ పథకం ప్రతిపాదనలపై సమీక్షలో సీఎం చంద్రబాబు

2

# అపరిశుభ్రతే అసలు జబ్బు

**ఆరోగ్యం పట్ల ప్రజల్లో చైతన్యం పెంచాలి**

- స్క్రబ్ టైఫస్‌పై అధ్యయనానికి వైద్యనిపుణులతో టాస్క్‌ఫోర్స్
- ప్రభుత్వ చర్యలతో 48 శాతం తగ్గిన అంటువ్యాధులు
- డెంగ్యూ 56 శాతం, మలేరియా 11 శాతం, చికున్ గున్యా 46 శాతం తగ్గుదల
- సీజనల్ వ్యాధులను పూర్తిగా కట్టడి చేయాలి
- వైద్య ఆరోగ్య శాఖపై సమీక్షలో సీఎం చంద్రబాబు

2



# ఏపీలో పెట్టుబడులు పెట్టండి

**- అమెరికాలో ప్రముఖ కంపెనీలకు మంత్రి లోకేష్ వినతి**

**- సీఈవోలు, ప్రతినిధులతో వరుస భేటీలు**



అమెరికా పర్యటనలో మూడోరోజు రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ బిజీబిజీగా గడిపారు. రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించడమే లక్ష్యంగా ప్రముఖ కంపెనీల సీఈవోలు, ప్రతినిధులతో శాన్‌ఫ్రాన్సిస్కో నగరంలో మంత్రి లోకేష్ వరుసగా భేటీ అయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో సెలెస్టా క్యాపిటల్ డీప్‌టెక్ ఇన్నొవేషన్ హబ్ ఏర్పాటు చేయాలని అంతర్జాతీయ స్థాయి వెంచర్ క్యాపిటల్ సంస్థ సెలెస్టా విసి (జవశ్రీవర్ఘు ఎజ) మేనేజింగ్ పార్టనర్ అరుణ్ కుమార్‌ను మంత్రి లోకేష్ కోరారు. ఓప్స్ ర్యాంప్ సీఈవో కూనపనేని వర్మతో సమావేశమై ఏపీలో ఐటీ మౌలిక సదుపాయాలకు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అమరావతిలో డిజైన్, ఇన్నోవేషన్ అకాడమీ ఏర్పాటు చేయాలని ఎంటర్‌టైన్‌మెంట్ సాఫ్ట్‌వేర్, 3 డీ డిజైన్, ఇంజనీరింగ్ రంగాల్లో పేరెన్నికగన్న ఆటో డెస్క్ సంస్థ చీఫ్ టెక్నాలజిస్ట్ దేవ్ పటేల్‌ను కోరారు. శాన్‌ఫ్రాన్సిస్కోలో కాన్సులేట్ జనరల్ ఆఫ్ ఇండియా శ్రీకర్ రెడ్డితో సమావేశమై ఏపీలో యూఎస్ పెట్టుబడులకు సహకారం అందించాలన్నారు. ఏపీలో డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలని జడ్ స్కాలర్ సీఈవో జే చౌదరిని కోరారు. సేల్స్ ఫోర్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ రమేష్‌తో సమావేశమై.. ఏపీలో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎలక్ట్రోలైజర్, ఇంటిగ్రేటెడ్ గ్రీన్ హైడ్రోజన్ కాంట్రాక్ట్ సేవలు, గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తికి అవసరమైన ఎలక్ట్రోలైజర్‌లను తయారుచేసే అంతర్జాతీయ సంస్థ ఓమియం (హ్రశ్రవఎఱబవ) చీఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆఫీసర్ (సీఎస్‌టీఓ) చొక్కలింగం కరుప్పయ్యతో సమావేశమై ఏపీలో ఎలక్ట్రోలైజర్ తయారీ కర్మాగారం ఏర్పాటు చేయాలని కోరారు. ఏపీ రాజధాని అమరావతి క్రియేటర్ ల్యాండ్ ప్రాజెక్టులో శిక్షణ, నైపుణ్యాల అభివృద్ధికి కలిసి పనిచేయాలని ప్రఖ్యాత కాన్వా సంస్థ సీసీఎస్ఓ రోబ్ గిగిలియోతో జరిపిన భేటీలో విజ్ఞప్తి చేశారు. ఏపీలో అసెంబ్లింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలని ఏఎండీ సంస్థ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ వంశీతో జరిపిన భేటీలో మంత్రి లోకేష్ కోరారు.



## అత్యాధునిక ట్రాన్స్‌మీడియా నగరంగా అమరావతి

- తీర్చిదిద్దటం మా లక్ష్యం
- క్రియేటివ్ ల్యాండ్ ప్రాజెక్టును సాధ్యమైనంత త్వరగా ప్రారంభించండి
- క్రియేటివ్ ల్యాండ్ ఆసియా సంస్థ వ్యవస్థాపకుడు సజన్ రాజ్ కురుప్‌కు మంత్రి లోకేష్ వినతి

4



5

## అమరావతిలో క్వాంటమ్ కంప్యూటింగ్ రీసెర్చ్ వింగ్

- ఏర్పాటు చేయండి.. కలిసి పనిచేద్దాం
- రిగెట్టి కంప్యూటింగ్ సీటీఓ డేవిడ్ రివాస్‌తో మంత్రి లోకేష్

## ఏఐ యూనివర్సిటీ ఏర్పాటుకు కలిసి పనిచేద్దాం



3

ఓపెన్ ఏఐ సీటీవో శ్రీనివాస నారాయణన్‌తో భేటీలో మంత్రి లోకేష్

# పూర్వోదయ.. ఏపీకి ఉషోదయం!

- మూడు ప్రాంతాల సమగ్రాభివృద్ధికి కార్యాచరణ
- సీమలో 20 లక్షల ఎకరాల్లో ఉద్యాన సాగు లక్ష్యం
- సాగునీరు, మౌలిక వసతుల ప్రాజెక్టులకూ నిధుల వినియోగం
- పూర్వోదయ పథకం ప్రతిపాదనలపై సమీక్షలో సీఎం చంద్రబాబు



అమరావతి (చైతన్య రథం): పూర్వోదయ పథకం కింద రాష్ట్రానికి వచ్చే నిధులతో మూడు ప్రాంతాల అభివృద్ధికి సత్వరం ప్రతిపాదనలు రూపొందించాలని ముఖ్యమంత్రినారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఈ నిధులు సాగునీటి ప్రాజెక్టులు, ఉద్యానపంటల విస్తరణ, గ్రామీణ రహదారులు వంటి మౌలిక వసతుల కల్పనకు వినియోగించేలా ప్రణాళికలు ఉండాలని సీఎం సూచించారు. సచివాలయంలో పూర్వోదయ, సాగునీటి ప్రాజెక్టులపై అధికారుల తో మంగళవారం సీఎం సమీక్షించారు. ప్రకాశం సహా రాయలసీమలోని 82 క్లస్టర్లలో ఉద్యాన పంటల కేంద్రంగా అభివృద్ధి... 20 లక్షల ఎకరాల్లో ఉద్యానవన పంటలను విస్తరించేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. పూర్వోదయ స్కీమ్‌లో భాగంగా రూ.40వేల కోట్లు వివిధ ప్రాజెక్టులను చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ఇందులో రూ.20 వేల కోట్లు సాగునీటి ప్రాజెక్టులకు, మిగిలిన రూ.20 వేలకోట్లతో మౌలిక వసతుల ప్రాజెక్టులు చేపట్టాల్సి ఉందని... అందుకు అనుగుణంగా కార్యాచరణ ఉండాలన్నారు. ఇందులో రూ.5 వేల కోట్లతో ప్రత్యేకం గ్రామీణరహదారులు నిర్మించి... జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులతో అనుసంధానం చేయాలని సీఎం సూచించారు. అలాగే, ప్రకాశం, రాయలసీమ పరిధిలో మొత్తం 23 మేజర్,మీడియం సాగునీటిప్రాజెక్టులు,1,021 చెరువులను పూర్తిచేయటం ద్వారా ఉద్యాన పంట లకు నీరందించేలా కార్యాచరణ చేపట్టాలన్నారు.

### త్వరలో పోలవరం-నల్లమల సాగర్ పనులు

రూ.58,700 కోట్లతో పోలవరం - నల్లమలసాగర్ ప్రాజెక్టుల అనుసంధానంపైనా చర్చించారు. దీంతో నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో కొత్తగా 7 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే అవకాశం ఉంటుందని అధికారులు అన్నారు. మరో 6 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ, 60 లక్షలమందికి తాగునీరు అందుతుందని వివరించారు. అలాగే పారిశ్రామిక అవసరాల కోసం 20 టీఎంసీ నీటిని కేటాయించే వీలుందన్నారు. ఇందుకు సంబంధించి త్వరలోనే పనులు మొదలు పెట్టాలని సీఎం ఆదేశించారు. పోలవరం ప్రాజెక్టు నుంచి 200 టీఎంసీల గోదావరి వరద జలాలను బొల్లాపల్లి, నల్లమల సాగర్‌లకు... అలాగే, నాగార్జున సాగర్ నుంచి 50 టీఎంసీల కృష్ణా వరద జలాలను బొల్లాపల్లికి తరలించే యోచన చేయాలని ముఖ్యమంత్రి అధికారులతో అన్నారు.

### ఉత్తరాంధ్రలోనూ ఉద్యాన పంటలు

ఉత్తరాంధ్రలో సాగు నీటి ప్రాజెక్టుల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని చెప్పిన ముఖ్యమంత్రి... ఇందుకోసం రూ.5 వేల కోట్లతో వివిధ ప్రాజెక్టుల పూర్తికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాలు ఆయిల్ పామ్‌కు, ఇతర ఉద్యాన పంటలకు అనుకూలమని.... ఉత్తరాంధ్రలోని ఏజెన్సీ జిల్లాల్లో నేచురల్, ఆర్గానిక్ ఫార్మింగ్‌ను ప్రోత్సహించాలని సీఎం సూచించారు. రూ.169 కోట్లతో వంశధార-నాగావళి, చంపావతి నదుల అనుసంధానం చేపట్టేలా కార్యాచరణ చేపట్టాలన్నారు. హిరమండలం రిజర్వాయర్, నారాయణపురం ఆనకట్టను అనుసంధానించటం ద్వారా 5 వేల ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరిచ్చేందుకు వీలుంటుంది. సమీక్షకు ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# అపరిశుభ్రతే అసలు జబ్బు

- ...ఆరోగ్యం పట్ల ప్రజల్లో చైతన్యం పెంచాలి
- స్క్రబ్ టైఫస్‌పై అధ్యయనానికి వైద్యనిపుణులతో టాస్క్‌ఫోర్స్
- ప్రభుత్వ చర్యలతో 48 శాతం తగ్గిన అంటువ్యాధులు
- డెంగ్యూ 56 శాతం, మలేరియా 11 శాతం, చికున్ గున్యా 46 శాతం తగ్గుదల
- సీజనల్ వ్యాధులను పూర్తిగా కట్టడి చేయాలి
- వైద్య ఆరోగ్య శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు



అమరావతి (చైతన్య రథం): స్క్రబ్ టైఫస్‌పై అధ్యయనం చేసేందుకు, భవిష్యత్‌లో దీన్ని పూర్తిగా నివారించేందుకు జాతీయస్థాయి వైద్య నిపుణులతో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అదేశించారు. సచివాలయంలో వైద్యారోగ్య శాఖపై సీఎం చంద్రబాబు సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో స్క్రబ్ టైఫస్ తీవ్రత, దాని బారిన పడినవారికి అందుతోన్న వైద్య సాయంపై సమీక్ష చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం 1,592 మంది స్క్రబ్ టైఫస్ బారిన పడ్డారని సీఎంకు అధికారులు వివ రించారు. అత్యధికంగా చిత్తూరు జిల్లాలో 420 కేసులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. అయితే ఈ వ్యాధి కారణంగానే ప్రాణాలు పోతున్నట్లు ఇప్పటి వరకు నిర్ధారణ కాలేదని చెప్పారు. చని పోయిన 9కేసుల్లోనూ కాజ్ ఆఫ్ డెత్‌పై పరిశీలన జరిపామని... స్క్రబ్ టైఫస్ వల్లనే చనిపోయారని ఎక్కడా నిర్ధారణ కాలేదని అధికారులు వివరించా రు. ఇతర ఆరోగ్య సమస్యలు, మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్ కారణంగా ఆ 9 మంది చనిపోయి నట్లు అధికారులు సీఎంకు తెలియజేశారు. ప్రజలు స్క్రబ్ టైఫస్ భారిన పడకుండా తీసుకోవాల్సిన చర్యలపై విస్తృతంగా ప్రచారం చేస్తున్నామని... వ్యాధి ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య బృందాలతో పరీక్షలు నిర్వహిస్తున్నామని అధికారులు తెలిపారు. దేశంలో అన్ని రాష్ట్రాల్లో స్క్రబ్ టైఫస్ ప్రభావం ఉందని... ఈ వ్యాధికి సంబంధించిన కేసుల్లో ఏపీ 8వ స్థానంలో ఉందని తెలిపారు. తమిళనాడు, ఒడిస్సాలలో 7 వేలు చొప్పున కేసులు ఉన్నాయని వివరించారు.దీనిపై ముఖ్యమంత్రి మాట్లాడుతూ... స్క్రబ్ టైఫస్‌ను నివారించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఇదే సమయంలో జాతీయ, అంతర్జాతీయ నిపుణులతో ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. ఈ టాస్క్ ఫోర్స్ క్షేత్రస్థాయిలో పర్యటన ద్వారా ఇచ్చే నివేదిక ను అమలు చేయడంతో వ్యాధిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

### 48 శాతం తగ్గిన సీజనల్ వ్యాధులు

రాష్ట్రంలో సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకుంటున్న చర్యలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా గత ఏడాది కాలంగా తీసుకున్న ముందస్తు చర్యలతో సీజనల్ వ్యాధులు 48శాతం మేర తగ్గినట్లు తెలిపారు. 2024 సంవత్సరంలో 5,555 డెంగ్యూ కేసులు రాగా... ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 2,452 కేసులు మాత్రమే వచ్చాయ న్నారు. ఈ మేరకు డెంగ్యూ కేసులు 56శాతం తగ్గాయని తెలిపారు. గత ఏడాది 7,871 మంది మలేరియా బారినపడగా... ఈ ఏడాది 7,010కి మలేరియా సోకిందన్నారు. మలేరియా కేసుల్లో 11శాతం తగ్గుదల కనిపించదని వివరించారు. చికున్ గున్యా గత ఏడాది 266 కేసులు రాగా...ఈ ఏడాది 142 వచ్చాయని, చికున్ గున్యా కేసులు 46.5శాతం తగ్గినట్లు అధికారులు వివరించారు. జపనీస్ ఎన్సెఫాలిటిస్ (JE) కేసులు 11 నుంచి 2కు తగ్గినట్లు తెలిపారు. పరిశుభ్రత పెంపు, సీజనల్ వ్యాధులపై నిరంతర ప్రచారం, విస్తృతస్థాయిలో పరీక్షలు నిర్వహించడం, ముందు జాగ్రత్తలు కారణంగా సీజనల్ వ్యాధులు 48శాతం మేరకు తగ్గినట్లు అధికారులు సీఎంకు వివరించారు.

### అపరిశుభ్రతే అసలు జబ్బు... ప్రజల్లో చైతన్యం పెంచాలి

అనంతరం సీఎం చంద్రబాబు మాట్లాడుతూ... అన్ని శాఖల సమన్వయంతో సీజనల్ వ్యాధులను సున్నా స్థాయికి తీసుకురావాలన్నారు. అంతా కలిసి పనిచేస్తే ఈ లక్ష్యాన్ని చేరుకోవచ్చని సీఎం తెలిపారు. సమాజంలో అతిపెద్ద జబ్బు అపరిశు భ్రతే అని... దీన్ని మార్చగలిగితే అనేక వ్యాధులను దూరం చేయవచ్చని సీఎం అన్నారు. అనేక వ్యాధులకు కారణమైన అపరిశుభ్రతను దూరం చేయాలని, ప్రజల్లో నిరంతరం చైతన్యం నింపాల న్నారు. మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా వంటి వ్యాధుల నివారణకు మరింత పకడ్బందీగా చర్యలు చేపట్టాలని అధికారులను సీఎం ఆదేశించారు. సమీక్షలో వైద్యారోగ్య శాఖ సెక్రటరీ సౌరబ్ గౌర్, వైద్యారోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండ్యన్, ఎన్టీఆర్ వైద్యసేవ సీఈవో దినేష్ కుమార్, ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్ గిరీశా పాల్గొన్నారు.

## ఒక్క స్వర్ణ చతుర్భుజి..
# దేశం దశ మార్చేసింది!

**‘అటల్ సందేశ్.. మోదీ సుపరిపాలన’ యాత్రలో కూటమి నేతలు పాల్గొనండి: సీఎం చంద్రబాబు**

అమరావతి (చైతన్య రథం): వాజపేయి హయాంలో వచ్చిన స్వర్ణ చతుర్భుజి హైవే ప్రాజెక్టు దేశం దశ-దిశ మార్చిందని సీఎం చంద్రబాబు నాయుడు గుర్తుచేశారు. వాజపేయి స్ఫూర్తిని యువతలో నింపేలా ‘అటల్ సందేశ్... మోదీ సుపరిపాలన’ యాత్ర తలపెట్టిన భాజపా కార్యవర్గానికి అభినందనలు తెలిపారు. మంత్రులు, కూటమి ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో చంద్రబాబు మంగళవారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ నెల 11నుంచి 25 వరకు చేపట్టే అటల్ సందేశ్ -మోదీ సుపరిపాలన’ యాత్రలో మూడు పార్టీల నేతలూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. దేశంలో సుపరిపాలనకు వాజపేయి నాంది పలికారని, ఆయన తీసుకొచ్చిన పాలసీలు దేశాభివృద్ధికి మంచి పునాది వేశాయని గుర్తుచేశారు. అజాత శత్రువు, ప్రతి భారతీయుడు గర్వపడే నాయకత్వాన్ని దేశానికి ఇచ్చారని కొనియాడారు. ఒక సాధారణ కుటుంబలో జన్మించిన ఆయన స్వశక్తితో ఎదిగి దేశానికి నాయకత్వం వహించారన్నారు. 9సార్లు లోక్‌సభకు, రెండుసార్లు రాజ్యసభకు ఎన్నికయ్యారంటేనే ఆయన గొప్పతనం తెలుస్తోందన్నారు. పద్దెనిమిదేళ్ల వయసలో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారని, 1998లో పోఖ్రాన్-2 అణు పరీక్షలు జరిపి భారతదేశ శక్తి చాటారన్నారు. కార్గిల్ యుద్ధంలో శత్రువులకు తిరుగులేని సమాధానం ఇచ్చారని గుర్తు చేశారు. వాజపేయితో వ్యక్తిగతంలో తనకు మంచి అనుబంధం ఉందని, రాష్ట్రాభివృద్ధికి ఆనాడు ఎంతో సహాయ సహకారాలు అందించారని గుర్తు చేసుకున్నారు. నాడు అణు పరీక్షలైనా, నేడు సింధూర్ అయినా, నాడు చతుర్భుజి అయినా నేడు సాగరమాల అయినా.. అవి ఎన్డీయే పాలనలో విజయవంతమైన కార్యక్రమాలని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ కూడా దేశాన్ని 2047నాటికి నంబర్ వన్ చేసేందుకు పని చేస్తున్నారన్నారు. యువతరానికి మోదీ స్ఫూర్తినిస్తున్నారన్నారు. వాజపేయి శతజయంతి కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొనాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరారు.

# వృద్ధిరేటు పెంపునకు సరికొత్త ప్రణాళిక!


**నేడు సచివాలయంలో ఉన్నతస్థాయి సమావేశం**
**దిశానిర్దేశం చేయనున్న సీఎం చంద్రబాబు**

అమరావతి (చైతన్య రథం): వృద్ధిరేటు పెంపునకు రానున్న నాలుగు నెలల్లో తీసుకోవాల్సిన అంశాలు, అమలు చేయాల్సిన ప్రణాళికలపై కూటమి ప్రభుత్వం సుదీర్ఘంగా చర్చించనుంది. బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకూ సచివాలయంలోని ఐదో బ్లాకులో మంత్రులు, కార్యదర్శులు, హెచ్‌వోడీలతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమావేశం కానున్నారు. జీఎస్డీపీ, కేపీఐ, పబ్లిక్ పాజిటివ్ పర్సెప్షన్, డేటా డ్రివెన్ గవర్నెన్స్ అంశాలపై ముఖ్యమంత్రి అధ్యక్షతన సుదీర్ఘ చర్చ జరగనుంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో మొదటి రెండు త్రైమాసికాల్లో సాధించిన ఆర్థిక ఫలితాలపై సమావేశంలో చర్చిస్తారు. మూడు, నాలుగు త్రైమాసికఃల్లో సాధించాల్సిన లక్ష్యాలపై అధికారులకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేస్తారు. సూపర్ సిక్స్ పథకాల అమలు, ప్రభుత్వం అందించే పౌరసేవలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజల్లో సంతృప్తస్థాయిపై చర్చ జరగనుంది. అలాగే, ఫైళ్ల క్లియరెన్స్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక, అవేర్, డేటా లేక్, ఐటీ అప్లికేషన్లపై సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌తో అధికారులకు దిశానిర్దేశం చేయనున్నారు. ప్రజలనుంచి వచ్చే అర్జీలు, ఫిర్యాదులు, వాటి పరిష్కారంపై విభాగాధిపతులకు సీఎం చంద్రబాబు సూచనలు చేయనున్నారు. కేంద్ర ప్రాయోజిత పథకాలు, రాష్ట్రంలో అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, వాటి ఫలితాలపై సమావేశంలో చర్చించే అవకాశం ఉంది. గత ప్రభుత్వ హయాంలో తీసుకున్న రుణాలు, వాటి రీస్ట్రక్చరింగ్ అంశాలపై శాఖలవారీగా సీఎం చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించనున్నారు.

చైతన్యరథం

# రెవెన్యూ సేవలు మరింత సులభతరం





- రియల్‌టైమ్‌లో పట్టాదారు పాస్ పుస్తకాల ఆటో మ్యుటేషన్
- 2027 డిసెంబర్‌నాటికి భూముల రీసర్వే పూర్తి కావాలి
- రెవెన్యూ శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం

అమరావతి (చైతన్య రథం): రాష్ట్రంలో రెవెన్యూ సేవలు మరింత సులభతరం కావాలని, చిక్కుముడులు లేకుండా చూడాలని అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. పట్టాదారు పాస్ పుస్తకాలు సహా అన్నింటా రియల్ టైమ్‌లో ఆటో మ్యుటేషన్ విధానాన్ని తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు. రిజిస్ట్రేషన్ అయిన వెంటనే ఆటో మ్యూటేషన్ జరిగేలా వ్యవస్థను తీర్చిదిద్దాలన్నారు. పట్టాదారు పాస్ పుస్తకం కోసం భూయజమానులు పదేపదే కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదని, రెవెన్యూ శాఖలో ఏడాదిలోగా పూర్తి ప్రక్షాళన జరగాలని స్పష్టం చేశారు. దీనిపై ప్రతీనెలా సమీక్షిస్తానని ముఖ్యమంత్రి వెల్లడించారు. సచివాలయంలో రెవెన్యూ శాఖపై ముఖ్యమంత్రి మంగళవారం నిర్వహించిన సమీక్షా సమావేశానికి రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, సీసీఎల్ఏ అధికారులు హాజరయ్యారు. పీజీఆర్ఎస్‌లో మ్యుటేషన్, పట్టాదారు పాస్ పుస్తకాలకు సంబంధించి 1,97,915 ఫిర్యాదులు వచ్చాయని సమావేశంలో అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ల్యాండ్ నేచర్, క్లాసిఫికేషన్ సంబంధిత వివాదాల దరఖాస్తులు 1,00,835, రీసర్వే అనంతరం భూమి తగ్గిందని వచ్చిన పీజీఆర్ఎస్ దరఖాస్తులు 1,00,295, జాయింట్ ఎల్‌పీఎంలపై 2,40,479 ఫిర్యాదులు నమోదైనట్టు వివరించారు.

## రీసర్వే పురోగతిపై ప్రతీ నెలా నివేదిక

ప్రస్తుతం 6,693 గ్రామాల్లో రీసర్వే పూర్తి కాగా, ఇంకా 10,123 గ్రామాల్లో చేయాల్సి ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. అయితే 2027 డిసెంబరుకు రీసర్వే ప్రక్రియ పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. ప్రతీ నెలా రీసర్వే పురోగతిపై నివేదిక ఇవ్వాలని నిర్దేశించారు. జాయింట్ లాండ్ పార్సెల్ మ్యాప్స్ వివాదాలను త్వరితగతిన పరిష్కరించాలని, భూమి వివరాలు డేటా బేస్ ఆన్‌లైన్‌లో ఉంటే ఈసీ జారీ చేయడం సులభమవుతుందని సీఎం అన్నారు. అలాగే 22ఏ జాబితానుంచి తొలగించాలని వచ్చిన దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలని సీఎం సూచించారు. 22ఏ ఫ్రీ హోల్డ్ భూముల విషయంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. డాక్యుమెంట్ల వివరాలను ట్యాంపర్ చేయకుండా బ్లాక్ చెయిన్‌లాంటి పటిష్ట వ్యవస్థను తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. భూముల వివరాలన్నీ పారదర్శకంగా ఆన్‌లైన్‌లో ఉంచితే వివాదాలు తలెత్తవని సూచించారు. డిస్ప్యూటెడ్ ల్యాండ్స్‌గా పరిగణించడం, వాటిని తొలగించడంవంటి అధికారం ఇన్నాళ్లూ జాయింట్ కలెక్టర్‌కు ఉండగా... ఇకపై డిస్ప్యూటెడ్ ల్యాండ్స్ పరిష్కరించే అధికారం ఆర్డీవోలకు ఇవ్వాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. చుక్కల భూములను 22ఏ జాబితానుంచి తొలిగించే ప్రక్రియను వేగవంతం చేయాలని చెప్పారు. 1999 వరకూ ప్రాథమిక సహకార సంఘాలవద్ద తాకట్టు పెట్టిన అసైన్డ్ భూములు కూడా 22ఏ జాబితానుంచి తొలిగించాలన్నారు. బంజరు భూములు 1954 కంటే ముందు సేల్ డీడ్స్ రిజిస్టర్ ఆఫ్ హోల్డింగ్స్‌ను 22ఏ నుంచి తొలగించాలని చెప్పారు.

## రిజిస్ట్రేషన్ల శాఖలో రూ.10,169 కోట్ల రెవెన్యూ లక్ష్యం

'మున్సిపల్ పరిధిలో ఉన్న అసైన్డ్ భూములు మంత్రుల కమిటీ సిఫార్సు మేరకు 250 చదరపు గజాలలోపు స్థలాల్ని 50 శాతం బేస్ వాల్యూతో రెగ్యులరైజ్ చేయండి. అలాగే ఆక్వా కల్చర్ చేస్తున్న అసైన్డ్ భూముల్ని సబ్ రిజిస్ట్రార్ విలువ ప్రకారం రెగ్యులరైజ్ చేయాలి. అలాగే... 10వ తరగతి పూర్తిచేసిన విద్యార్థులకు కుల ధృవీకరణ పత్రం వెంటనే పొందేలా కార్యాచరణ రూపొందించాలి. ఆర్టీజీఎస్‌తో అనుసంధానించిన సమాచారం ద్వారా ఆదాయ ధృవపత్రం ఇవ్వాలి. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో రూ.10,169 కోట్ల రెవెన్యూ లక్ష్యంగా పెట్టుకున్నాం. మార్కెట్ విలువలతో భూమి విలువలు అప్ గ్రేడ్ చేయండి' అని ముఖ్యమంత్రి అధికారులకు స్పష్టం చేశారు.

## రెవెన్యూ శాఖలో 86శాతం వివాదాలు పరిష్కారం

గత ఏడాది జూన్ 15నుంచి ఈ ఏడాది డిసెంబర్ 1వరకు రెవెన్యూ శాఖకు 5,28,217 గ్రీవెన్సులు రాగా, వాటిలో 4,55,189 అంటే 86 శాతం గ్రీవెన్సులు పరిష్కారమయ్యాయని అధికారులు తెలిపారు. పరిశీలనలో మరో 73 వేల వరకు గ్రీవెన్సులు ఉన్నాయని, ఎవరైనా అర్జీల పరిష్కారంపై అసంతృప్తి వ్యక్తం చేస్తే... ఆ ఫిర్యాదులను తిరిగి ఓపెన్ చేస్తున్నట్టు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. అలాగే జూన్ 2024నుంచి ఇప్పటివరకు 22ఏ జాబితానుంచి తమ భూముల వివరాలు తప్పించాలని కోరుతూ 6,846 దరఖాస్తులు దాఖలు కాగా... ఎక్స్ సర్వీస్‌మెన్, రాజకీయ బాధితులు, స్వాతంత్ర్య సమరయోధులు, 1954 కంటే ముందు అసైన్డ్ భూములు కలిగిన వాళ్ల భూములు మాత్రం 22ఏ నుంచి తొలిగించనున్నట్టు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు.

# ఏఐ యూనివర్సిటీ ఏర్పాటుకు కలిసి పనిచేద్దాం

- ఓపెన్ ఏఐ సీటీవో శ్రీనివాస నారాయణన్‌తో భేటీలో మంత్రి లోకేష్ వినతి




శాన్‌ఫ్రాన్సిస్కో/యూఎస్ఏ (చైతన్యరథం): ఏపీలో ఏఐ యూనివర్శిటీ ఏర్పాటుకు కలిసి పనిచేద్దామని ప్రఖ్యాత ఓపెన్ ఏఐ సంస్థను రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ కోరారు. ఆమెరికా పర్యటనలో ఉన్న మంత్రి లోకేష్ శాన్‌ఫ్రాన్సిస్కోలో ఓపెన్ ఏఐ చీఫ్ టెక్నా లజీ ఆఫీసర్ శ్రీనివాస్ నారాయణన్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... ఒక కుటుంబంలో ఒక ఏఐ ఆధారిత సభ్యుడు..అనే లక్ష్యాన్ని సాధించాలన్నది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సంకల్పమన్నారు. ఇందుకు అవసరమైన నైపుణ్యాభివృద్ధి కోసం మాతో కలిసి పని చేయండి. తొలిదశలో ఏపీలోని అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు, పాఠశాల విద్యా ర్థులకు ఉచిత చాట్ జీపీటీ అందించాలని భావిస్తున్నాం.ఏపీలో ఏఐ విశ్వవిద్యాలయా న్ని ఏర్పాటు చేసేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో కలిసిపనిచేయండి. డేటా సెంటర్‌హబ్‌గా మారుతున్న ఏపీని ఓపెన్ ఏఐ డేటా సెంటర్ కార్యకలాపాలకు ఎం పిక చేసుకోవాలని మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు.దీనిపై ఓపెన్ ఏఐ సీటీవో శ్రీని వాస నారాయణన్ మాట్లాడుతూ...ఎంటర్ ప్రైజ్ ఏఐ ఇంటిగ్రేషన్ కోసం ఇన్ఫోసిస్, టీసీఎస్ వంటి టెక్ దిగ్గజాలతో కలిసి పనిచేస్తున్నట్లు చెప్పారు. శాన్‌ఫ్రాన్సి స్కో ప్రధానకేంద్రంగా పనిచేస్తున్న తమ సంస్థ 180కిపైగా దేశాల్లో వినియోగదారులు, సంస్థలకు సేవలు అంది స్తోందని చెప్పారు. ఏపీప్రభుత్వ ప్రతిపాదనల పై ఉన్నతస్థాయి ప్రతినిధి బృందంతో చర్చిస్తామన్నారు. (90 బిలియన్ డాలర్ల మార్కెట్ విలువ కలిగిన చాట్ జీపీటీ సంస్థ గత ఏడాది చాట్ జీపీటీ ప్లస్,ఏపీఐ సర్వీసెస్, ఎంటర్ ప్రైజ్ సొల్యూషన్స్ సేవల ద్వారా 3.5 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని ఆర్జించింది.)

# ఏపీలో ఏఎండీ అసెంబ్లింగ్ యూనిట్

- ఏర్పాటు చేయాలని సంస్థ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ వంశీకి మంత్రి లోకేష్ వినతి




శాన్‌ఫ్రాన్సిస్కో/యూఎస్ఏ (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలని ఏఎండీ సంస్థను రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ కోరారు. ఆమెరికా పర్యటనలో ఉన్న మంత్రి లోకేష్ శాన్‌ఫ్రాన్సిస్కోలో ఏఎండీ (Amd) సంస్థ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ విభాగం) వంశీ బొప్పనతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... విజనరీ లీడర్ చంద్రబాబు నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రానిక్స్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్‌గా తయారవుతోందన్నారు. ఏపీలో ఎలక్ట్రానిక్స్ రంగ పరిశ్రమలను ప్రోత్సహించేందుకు ఎలక్ట్రానిక్స్ అండ్ సెమీ కండక్టర్ పాలసీని ప్రకటించారు. ఏపీలోని ఎలక్ట్రానిక్స్ మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్లలో (శ్రీసిటీ, కొప్పర్తి,) ఏఎండీ ఉత్పత్తుల అసెంబ్లింగ్, టెస్టింగ్, ప్యాకేజింగ్ యూనిట్ ఏర్పాటు చేసి, సప్లయ్ చెయిన్‌లో భాగస్వామ్యం వహించాలని కోరారు. దీనిపై ఏఎండీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ వంశీ బొప్పన మాట్లాడుతూ... యూఎస్ వెలుపల ఏఎండీ అతి పెద్ద ఆర్ అండ్ హబ్ భారత్ లోనే నిర్వహిస్తున్నామన్నారు. బెంగళూరు, హైదరాబాద్, ఢిల్లీ క్యాంపస్‌ల్లో సిలికాన్ డిజైన్, సాఫ్ట్‌వేర్, ఏఐ ఆవిష్కరణలకు ప్రాధాన్యత ఇస్తున్నాం. అధునాతన చిప్ ఉత్పత్తి కోసం టిఎస్ఎంసి, గ్లోబల్ ఫౌండ్రీస్, ప్యాకేజింగ్ భాగస్వామ్యాలతో కలిసి పనిచేస్తున్నాం. ఏఐ ఆధారిత డేటా సెంటర్ ట్రాన్స్‌ఫర్మేషన్, అధిక పనితీరు గల కంప్యూటింగ్, నెక్స్‌ట్ జెన్ గేమింగ్‌లో కీలకపాత్ర పోషిస్తున్నాం. భారతీయ టెక్ దిగ్గజాలు, స్టార్టప్‌లు, ప్రభుత్వ విభాగాలతో కలిసి సూపర్ కంప్యూటింగ్, క్లౌడ్ అడాప్షన్ వంటి డిజిటల్ మౌలిక సదుపాయాల అభివృద్ధిపై దృష్టి సారించామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిపాదనలపై సంస్థ సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. (ఏఎండీ సంస్థ గత ఏడాది అధిక పనితీరుగల సీపీయూ, జీపీయూ, అడాప్టివ్ ఎస్ఓసిలు, డేటా సెంటర్ సొల్యూషన్స్ అమ్మకాల ద్వారా గత ఏడాది సుమారు 27 బిలియన్ డాలర్ల వార్షికాదాయం సాధించింది.)

# ఏపీలో డీప్‌టెక్ ఇన్నోవేషన్ హబ్




- ఏర్పాటు చేయాలని సెలెస్టా విసి సంస్థ ప్రతినిధులకు మంత్రి లోకేష్ వినతి
- సంస్థ మేనేజింగ్ పార్టనర్ అరుణ్ కుమార్‌తో మంత్రి భేటీ

శాన్‌ఫ్రాన్సిస్కో/యూఎస్‌ఏ (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌లో సెలెస్టా క్యాపిటల్ డీప్ టెక్ ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేయాలని అంతర్జాతీయస్థాయి వెంచర్ క్యాపిటల్ సంస్థ సెలెస్టా విసి (Celesta VC) మేనేజింగ్ పార్టనర్ అరుణ్ కుమార్‌ను రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ కోరారు. అమెరికా పర్యటనలో ఉన్న మంత్రి లోకేష్ శాన్‌ఫ్రాన్సిస్కోలో అరుణ్ కుమార్‌తో భేటీ అయ్యారు.

ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం పెట్టుబడులకు పూర్తి అనుకూల వాతావరణం నెలకొని ఉందన్నారు. విశాఖనగరం ఐటీ, డేటా హబ్‌గా శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో సెలెస్టా క్యాపిటల్ డీప్ టెక్ ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేయండి. సెమీ కండక్టర్, ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్ రంగాల్లో పెట్టుబడులు పెట్టండి. కంపెనీలకు ఏపీ ప్రభుత్వం దేశంలోనే అత్యుత్తమైన సమగ్ర ప్రోత్సాహకాలను అందిస్తోంది. పరిశ్రమలకు నిర్ణీత సమయంలో నేరుగా ప్రోత్సాహకాలను అందించేందుకు దేశంలోనే తొలిసారిగా ఎస్క్రో ఖాతా విధానాన్ని ప్రారంభించనున్నట్లు చెప్పారు.

మంత్రి లోకేష్ వినతిపై సెలెస్టా విసి మేనేజింగ్ పార్టనర్ అరుణ్‌కుమార్ స్పందిస్తూ... తాము ప్రధానంగా యూఎస్, ఇండియా, ఇజ్రాయెల్, ఆగ్నేయాసియా దేశాలపై దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. సెమీకండక్టర్లు, AI/ML, రోబోటిక్స్, క్వాంటం కంప్యూటింగ్ వంటి డీప్ టెక్ రంగాలు, సాస్, సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లాంటి ఎంటర్‌ప్రైజింగ్ సాఫ్ట్ వేర్, గ్లోబల్ మార్కెట్‌లను అనుసంధానించే స్టార్టప్‌ల్లో పెట్టుబడులకు ప్రస్తుతం తాము ప్రాధాన్యతనిస్తున్నట్లు చెప్పారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని అరుణ్ కుమార్ చెప్పారు.

# ఐటీ మౌలిక సదుపాయాలకు మద్దతు ఇవ్వండి

**- ఓప్స్ ర్యాంప్ సీఈవో వర్మకు మంత్రి లోకేష్ వినతి**




శాన్‌ఫ్రాన్సిస్కో/యూఎస్‌ఏ (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌లో ఐటీ మౌలిక సదుపాయాల అభివృద్ధికి మద్దతు ఇవ్వాలని ఓప్స్ ర్యాంప్ (ops ramp) సీఈవో వర్మ కూనపునేనికి రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ విజ్ఞప్తి చేశారు. అమెరికా పర్యటనలో ఉన్న మంత్రి లోకేష్ శాన్‌ఫ్రాన్సిస్కోలో వర్మ కూనపునేనితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... ఏపీలో స్మార్ట్ సిటీలు, డిజిటల్ గవర్నెన్స్, ఎలక్ట్రానిక్స్ తయారీ క్లస్టర్ల కోసం ఐటీ మౌలిక సదుపాయాల ఆధునీకరణకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఏఐ ఓప్స్ శిక్షణ, ఇంటర్న్ షిప్‌లు, ఆర్ అండ్ డి సహకారం కోసం ఏపీ టెక్ అకడమియాతో భాగస్వామ్యం వహించండి. స్కేలబుల్ SaaS మోడల్స్ ద్వారా ఐటీ కార్యకలాపాల నిర్వహణతోపాటు ఏపీలో SME\T, స్టార్టప్‌లను ప్రారంభించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. దీనిపై ఓప్స్ ర్యాంప్ సీఈవో వర్మ మాట్లాడుతూ... ప్రపంచవ్యాప్తంగా తమ సంస్థకు 500కు పైగా సంస్థలు కస్టమర్లుగా ఉన్నాయన్నారు. వీటిలో ఫైనాన్స్, హెల్త్‌కేర్, రిటైల్, టెక్నాలజీలో పాటు ఫార్చ్యూన్ 500కంపెనీలు ఉన్నాయి. భారతదేశంలోని బెంగళూరు, హైదరాబాద్‌లో ప్రధాన కేంద్రాల ద్వారా ఏఐ ఓప్స్, క్లౌడ్ నేటివ్ మానిటరింగ్‌లో ఆవిష్కరణలను ముందుకు తెస్తున్నామని తెలిపారు. ఏపీ ప్రతిపాదనలను పరిశీలిస్తామని వర్మ పేర్కొన్నారు.

# అత్యాధునిక ట్రాన్స్‌మీడియా నగరంగా అమరావతి

- తీర్చిదిద్దటం మా లక్ష్యం
- క్రియేటివ్ ల్యాండ్ ప్రాజెక్టును సాధ్యమైనంత త్వరగా ప్రారంభించండి
- సంస్థ వ్యవస్థాపకుడు సజన్ రాజ్ కురుప్‌తో భేటీలో మంత్రి లోకేష్ వినతి




శాన్‌ఫ్రాన్సిస్కో/యూఎస్‌ఏ (చైతన్యరథం): గతంలో కుదుర్చుకున్న ఎంఓయూ మేరకు ఏపీ రాజధాని అమరావతిలో క్రియేటర్ ల్యాండ్ ప్రాజెక్ట్‌ను వీలయినంత త్వరగా ప్రారంభించాలని క్రియేటివ్ ల్యాండ్ వ్యవస్థాపకుడు సజన్ రాజ్ కురుప్‌ను రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ కోరారు. అమెరికా పర్యటనలో ఉన్న మంత్రి లోకేష్ శాన్‌ఫ్రాన్సిస్కోలో క్రియేటివ్ ల్యాండ్ ఆసియా (creative land asia) ఫౌండర్ సజన్ రాజ్ కురుప్, సీనియర్ పార్టనర్ ఇయాంగ్ కాపింగ్, ప్రముఖ అమెరికన్ ఫిల్మ్ డైరక్టర్ అండ్ స్క్రీన్ రైటర్ చిక్ రసెల్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్‌ను క్రియేటివ్ ఎకానమీ, టూరిజం, డిజిటల్ ఇన్నొవేషన్స్‌లో గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దాలన్నది తమ లక్ష్యమన్నారు. ఇందులో భాగంగా అమరావతిలో ఏఐ-ఆధారిత వర్చువల్ స్టూడియోలు, లీనమయ్యే AR/VR థీమ్ పార్కులు, ప్రపంచ సహ-ఉత్పత్తి సౌకర్యాలను ఏర్పాటుచేసి అత్యాధునిక ట్రాన్స్‌మీడియా నగరంగా తీర్చిదిద్దాలని భావిస్తున్నాం. గతంలో చేసుకున్న ఒప్పందం మేరకు క్రియేటర్ ల్యాండ్ ప్రాజెక్ట్-అమరావతిని సాధ్యమైనంత త్వరగా ప్రారంభించి, తమ లక్ష్యసాధనకు మీ వంతు సహకారం అందించాలని కోరారు. దీనిపై క్రియేటివ్ ల్యాండ్ వ్యవస్థాపకుడు సజన్ రాజ్ కురుప్ స్పందిస్తూ... క్రియేటివ్ ల్యాండ్ సంస్థ ఏఐ ఆధారిత కళ, వర్చువల్ రియాలిటీ (విఆర్), ఆగ్మెంటెడ్ రియాలిటీ (ఎఆర్), సృజనాత్మక సాంకేతికతల కోసం బ్లాక్ చెయిన్ ఏర్పాటు చేస్తుందన్నారు. VFX, AI, గేమింగ్, యానిమేషన్ వంటి అధిక డిమాండ్ ఉన్న రంగాల్లో స్థానిక యువతకు శిక్షణ ఇవ్వడానికి అంకితమైన సంస్థ క్రియేటర్ ల్యాండ్ అకాడమీ అనితెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో క్రియేటర్ ల్యాండ్ ప్రాజెక్టు ఏర్పాటుకు గత ఏడాది ఏపీ ప్రభుత్వంతో ఎంవోయూ కుదుర్చుకున్నాం. ఆ ఎంవోయూ మేరకు 24 నెలల్లో ప్రాజెక్టు నిర్మాణ పనులు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నాం. అది పూర్తయితే రూ.10వేల కోట్ల వరకు పెట్టుబడులను ఆకర్షించడమేగాక, యువతకు 1.5 లక్షల ఉద్యోగాలు కల్పించే అవకాశం లభిస్తుందని చెప్పారు. భారతదేశంలో తొలి ట్రాన్స్ మీడియా ఎంటర్‌టైన్‌మెంట్ సిటీ క్రియేటర్ ల్యాండ్‌ను అమరావతిలో ఏర్పాటు చేయడానికి గత ఏడాది మే 4న క్రియేటివ్ ల్యాండ్ ఆసియా సంస్థ ఎంవోయూ కుదుర్చుకుంది.

# విశాఖలో జీసీసీ ఏర్పాటు చేయండి

**- సేల్స్ ఫోర్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ రమేష్‌కు మంత్రి లోకేష్ వినతి**




శాన్‌ఫ్రాన్సిస్కో/యూఎస్‌ఏ (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌లో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జీసీసీ) ఏర్పాటు చేయాలని సేల్స్ ఫోర్స్ (sales force)ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ రమేష్ రాగినేనితో భేటీలో రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ కోరారు. అమెరికా పర్యటనలో ఉన్న మంత్రి లోకేష్ శాన్‌ఫ్రాన్సిస్కోలో రమేష్ రాగినేనితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ విజనరీ సీఎం చంద్రబాబు నేతృత్వంలో విశాఖ మహానగరం డేటా సిటీగా అవతరిస్తోందన్నారు. ఇప్పటికే గూగుల్, రిలయన్స్, సిఫీ వంటి సంస్థలు డేటా సెంటర్లపై పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చాయి. విశాఖలో పెట్టుబడులకు ఇదే మంచి సమయం. విశాఖలో సేల్స్ ఫోర్స్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జీసీసీ), ఆర్ అండ్ డి సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై సేల్స్ ఫోర్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ రమేష్ రాగినేని మాట్లాడుతూ... న్యూయార్క్, లండన్, టోక్యో, సిడ్నీ, హైదరాబాద్, బెంగుళూరుల్లో సేల్స్ ఫోర్స్ ప్రధాన కార్యాలయాలు పనిచేస్తున్నాయన్నారు. ప్రపంచవ్యాప్తంగా 70వేలకు పైగా గ్లోబల్ వర్క్ ఫోర్స్, ఫార్చ్యూన్ 500 కంపెనీలతో సహా 1.5లక్షలకు పైగా సంస్థలకు కస్టమర్ బేస్ సేవలను అందిస్తున్నాం. గ్లోబల్ ప్రాడక్ట్ డెవలప్‌మెంట్‌కు సంబంధించి బెంగళూరు, హైదరాబాద్‌ల్లో ఇన్నోవేషన్ అండ్ ఇంజనీరింగ్ సెంటర్లను నిర్వహిస్తున్నాం. భారతీయ ఐటీ జెయింట్స్, జీఎస్‌ఐలతో కలిసి స్థానిక స్టార్టప్ ఎకో సిస్టమ్‌ను సేల్స్ ఫోర్స్ అభివృద్ధి చేస్తోంది. బ్యాంకింగ్, రిటైల్, ఐటీ, భారత్‌లోని ప్రముఖ ప్రభుత్వరంగ సంస్థలు డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ కోసం మా సంస్థను ఎంపిక చేసుకున్నాయి. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలపై సంస్థ ఉన్నతస్థాయి బృందంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని రమేష్ రాగినేని చెప్పారు. ( క్లౌడ్ ఆధారిత సీఆర్ఎం, డేటా, ఏఐ సబ్‌స్క్రిప్షన్ సేవల ద్వారా 34.5 బిలియన్ డాలర్ల వార్షికాదాయం సాధించిన సేల్స్ ఫోర్స్ సంస్థ.. ప్రస్తుతం 250 బిలియన్ డాలర్ల మార్కెట్ క్యాపిటలైజేషన్ కలిగి ఉంది).

# ఏపీలో డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటు చేయండి

**- జడ్ స్కాలర్ సీఈవో జే చౌదరికి మంత్రి లోకేష్ వినతి**




శాన్‌ఫ్రాన్సిస్కో/యూఎస్‌ఏ (చైతన్యరథం): క్లౌడ్ సెక్యూరిటీ సేవల్లో పేరెన్నికగన్న జడ్ స్కాలర్ (Zscaler) సీఈవో జే చౌదరితో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కోలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ డేటా సిటీగా అవతరిస్తున్న విశాఖపట్నానికి ప్రపంచవ్యాప్తంగా పెద్ద క్లయింట్లు వస్తున్నారన్నారు. వారంతా ఏఐ క్లౌడ్ డేటా సెంటర్ మౌలిక సదుపాయాలను ఉపయోగిస్తారు. విశాఖపట్నంలో సైబర్ సెక్యూరిటీ కోసం జడ్ స్కాలర్ ఆధ్వర్యాన ఆర్ అండ్ డి సెంటర్, డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటుచేయాలని మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు. దీనిపై జడ్ స్కాలర్ సీఈవో జే చౌదరి మాట్లాడుతూ... తమ సంస్థ బెంగుళూరులో మేజర్ ఇంజనీరింగ్ అండ్ ఇన్నోవేషన్ సెంటర్, కోర్ ప్లాట్ ఫాం డెవలప్‌మెంట్ సెంటర్ నిర్వహిస్తోందన్నారు. భారతీయ గ్లోబల్ సిస్టమ్ ఇంటిగ్రేటర్లు (GSI\T), టెలికం ప్రొవైడర్లతో కలిసి భాగస్వామ్యాలను విస్తరిస్తున్నాం. సురక్షితమైన డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ కోసం అగ్రశ్రేణి భారతీయ బ్యాంకులు, ఐటీ సంస్థలు, ప్రభుత్వ సంస్థలకు సేవలు అందిస్తున్నామని చెప్పారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలపై సంస్థ సహచర బృందంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

చైతన్యరథం

# అమరావతిలో డిజైన్, ఇన్నోవేషన్ అకాడమీ ఏర్పాటు చేయండి

**- ఆటో డెస్క్ చీఫ్ టెక్నాలజిస్ట్ దేవ్ పటేల్‌కు మంత్రి లోకేష్ వినతి**




శాన్‌ఫ్రాన్సిస్కో/యూఎస్ఏ (చైతన్యరథం): ఎంటర్‌టైన్‌మెంట్ సాఫ్ట్ వేర్, 3 డీ డిజైన్, ఇంజనీరింగ్ రంగాల్లో పేరెన్నికగన్న ఆటో డెస్క్ సంస్థ చీఫ్ టెక్నాలజిస్ట్ దేవ్ పటేల్, సీనియర్ డైరెక్టర్ అల్లిసన్ రోస్‌తో రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కోలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... విజనరీ లీడర్ చంద్రబాబు నేతృత్వంలో ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శరవేగంగా అభివృద్ధి సాధిస్తోందన్నారు. రాజధాని అమరావతిలో సుమారు రూ.65 వేల కోట్లకు పైగా వ్యయంతో నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. అమరావతిలో ప్రతిష్ఠాత్మకంగా ఎంటర్‌టైన్‌మెంట్ సిటీ ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించాం. అక్కడ ఆటో డెస్క్ సంస్థ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జీసీసీ) ఏర్పాటు చేయాలి. ప్రపంచంలోనే మొట్టమొదటగా బీఐఎం సాంకేతికతతో రూపుదిద్దుకుంటున్న రాజధాని నగరం అమరావతి. ఆటోడెస్క్ ఇన్‌ఫ్రావర్క్స్, బీఐఎం 360ని ఉపయోగించి అమరావతిలో డిజిటల్ ట్విన్ ఏర్పాటుకు సహకరించండి. అమరావతిలో ఆటో డెస్క్ డిజైన్ అండ్ ఇన్నోవేషన్ అకాడమీని ఏర్పాటు చేయండి. దీనిద్వారా డిజిటల్ ఫ్యాబ్రికేషన్, సస్టయినబుల్ డిజైన్‌లో సర్టిఫైడ్ శిక్షణ, ఫ్యాకల్టీ అభివృద్ధి, పరిశోధనలకు అవకాశం ఏర్పడుతుంది. ఆంధ్రప్రదేశ్‌లోని తీర ప్రాంతంలో తుపానులను తట్టుకుని నిలబడేలా భవనాల నిర్మాణానికి అవసరమైన మాస్టర్ ప్లాన్ల రూపకల్పన కోసం ఆటోడెస్క్ సీఎఫ్‌డీ (కంప్యుటేషనల్ ఫ్లూయిడ్ డైనమిక్స్) సాంకేతిక సహకారాన్ని అందించాల్సిందిగా మంత్రి లోకేష్ కోరారు.

ఆటో డెస్క్ చీఫ్ టెక్నాలజిస్ట్ దేవ్ పటేల్ మాట్లాడుతూ...ప్రపంచవ్యాప్తంగా 35కి పైగా దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న తమ సంస్థకు 15 మిలియన్లకు పైగా వినియోగదారులు ఉన్నట్లుచెప్పారు. ప్రధానంగా సబ్‌స్క్రిప్షన్ ఆధారిత సాఫ్ట్‌వేర్, క్లౌడ్ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. యూఎస్, కెనడా, భారత్ యూరప్‌ల్లో తమ సంస్థ ఆర్ అండ్ డీ కేంద్రాలు ఉన్నాయని అన్నారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలపై సంస్థ ఉన్నతస్థాయి బృందంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఈ ఏడాది నవంబర్ నాటికి ఆటో డెస్క్ సంస్థ 50 బిలియన్ డాలర్ల మార్కెట్ క్యాపిటలైజేషన్ కలిగి, 5.9 బిలియన్ డాలర్ల ఆదాయం సాధించిందన్నారు.




## అమరావతిలో క్వాంటమ్ కంప్యూటింగ్ రీసెర్చ్ వింగ్

**- ఏర్పాటుచేస్తే కలిసి పనిచేద్దాం**

**- రిగెట్టి కంప్యూటింగ్ సిటిఓ డేవిడ్ రివాస్‌కు మంత్రి లోకేష్ వినతి**

శాన్‌ఫ్రాన్సిస్కో/యూఎస్ఏ (చైతన్యరథం): రిగెట్టి కంప్యూటింగ్ (Rigetti Computing) చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ డేవిడ్ రివాస్‌తో అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కోలో రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... ఏపీ రాజధాని అమరావతిలో ప్రతిష్ఠాత్మకమైన క్వాంటమ్ వ్యాలీ త్వరలోనే ఆవిష్కృతం కాబోతోందన్నారు. అక్కడ క్వాంటమ్ కంప్యూటింగ్ పరిశోధనా విభాగాన్ని ఏర్పాటుచేసి భాగస్వామ్యం వహించండి. ఏపీ ప్రభుత్వ డిజిటల్ మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల్లో రిగెట్టి క్లౌడ్ క్వాంటమ్ వ్యవస్థలను అనుసంధానించడం ద్వారా ఏపీని భారత్‌లో మొట్టమొదటి క్వాంటమ్ రెడీ స్టేట్‌గా నిలిపేందుకు సహకారం అందించండి. ఎఆర్/ వీఆర్ కంటెంట్ క్రియేషన్, ఏఐ ఆధారిత మీడియా ప్రాసెసింగ్ కోసం క్రియేటర్ ల్యాండ్‌కు సహకారం అందించండి. ఆంధ్రప్రదేశ్‌ను గేట్ వేగా చేసుకుని భారతదేశం, గ్లోబల్ సౌత్ మార్కెట్లకు క్వాంటం-యాజ్-ఏ సర్వీస్ (QaaS)ను అందించాలని కోరారు. దీనిపై రిగెట్టి కంప్యూటింగ్ సీటీఓ డేవిడ్ రివాస్ మాట్లాడుతూ... కాలిఫోర్నియాలోని బర్క్ లీ ప్రధానకేంద్రంగా పనిచేస్తున్న తమ సంస్థ ఫ్రీమాంట్‌లో క్వాంటమ్ హార్డ్ వేర్ ఫ్యాబ్రికేషన్, ఆర్ అండ్ డి సెంటర్ నిర్వహిస్తోందన్నారు. రీసెర్చ్ ఇనిస్టిట్యూషన్స్, ప్రభుత్వ ఏజన్సీలకు ఎంటర్‌ప్రైజింగ్ పార్టనర్లతో కలిసి క్వాంటమ్ సేవలు అందిస్తున్నాం. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామన్నారు.

## క్రియేటివ్ ల్యాండ్ ప్రాజెక్టులో భాగస్వామ్యం వహించండి

**- కాన్వా సీసీఎస్ఓ రోబ్ గిగిలియోతో మంత్రి లోకేష్ భేటీ**




శాన్‌ఫ్రాన్సిస్కో/యూఎస్ఏ (చైతన్యరథం): కాన్వా (Canva) చీఫ్ కస్టమర్ సక్సెస్ ఆఫీసర్ (సీసీఎస్ఓ) రోబ్ గిగిలియో, ఎడ్యుకేషన్ అండ్ పబ్లిక్ సెక్టార్ విభాగాధిపతి జాసన్ విల్ మాట్‌లతో అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కోలో రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... ప్రపంచస్థాయి ప్రమాణాలతో రూ.65 వేల కోట్ల వ్యయంతో ఏపీ రాజధాని అమరావతి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయన్నారు. ఇందులో భాగంగా ఎంటర్‌టైన్‌మెంట్ సిటీని కూడా అభివృద్ధి చేయబోతున్నాం. అమరావతి క్రియేటర్ ల్యాండ్ ప్రాజెక్టులో శిక్షణ, నైపుణ్యాల అభివృద్ధికి క్రియేటివ్ ల్యాండ్ ఆసియాతో కలిసి పనిచేయాలని కోరారు. దీనిపై కాన్వా సీసీఎస్ఓ రాబ్ గిగిలియో మాట్లాడుతూ... ఆస్ట్రేలియాలోని సిడ్నీ ప్రధాన కేంద్రంగా పనిచేస్తున్న తమ సంస్థ ప్రపంచవ్యాప్తంగా 190 దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బీజింగ్, మనీలా, ఆస్టిన్ నగరాల్లో ప్రధాన కార్యాలయాలు కలిగి విస్తృతమైన రిమోట్ వర్క్‌ఫోర్స్‌తో పనిచేస్తున్నట్లు తెలిపారు. ప్రెజెంటేషన్లు, సోషల్ మీడియా (గ్రాఫిక్స్), డాక్యుమెంట్లు, పోస్టర్లు, వీడియోల తయారీకి సరళీకృతమైన, క్లౌడ్-ఆధారిత డిజైన్ ప్లాట్‌ఫామ్‌లను కాన్వా అందిస్తుందన్నారు. తమ సంస్థ సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లతో చర్చించి ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. (కాన్వా సంస్థ 40 బిలియన్ డాలర్ల మార్కెట్ క్యాపిటలైజేషన్‌తో గత ఏడాది 2.5బిలియన్ డాలర్ల వార్షికాదాయం సాధించింది).

## ఏపీలో యూఎస్ పెట్టుబడులకు సహకరించండి

**- శాన్‌ఫ్రాన్సిస్కో సీజిఐ శ్రీకర్ రెడ్డికి మంత్రి లోకేష్ వినతి**



శాన్‌ఫ్రాన్సిస్కో/యూఎస్ఏ (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌లో అమెరికా సంస్థల పెట్టుబడులకు సహకరించాలని శాన్‌ఫ్రాన్సిస్కో కాన్సులేట్ జనరల్ ఆఫ్ఇండియా(CGI) శ్రీకర్‌రెడ్డికి రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ విజ్ఞప్తిచేశారు. అమెరికా పర్యటనలో ఉన్న మంత్రి లోకేష్ శాన్‌ఫ్రాన్సిస్కోలో సీజిఐ శ్రీకర్‌రెడ్డితో మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వేగ వంతంగా అభివృద్ధి సాధిస్తోందన్నారు. ఏపీలో అమలుచేస్తున్న ఇన్వెస్టర్స్ ఫ్రెండ్లీ విధానాలు, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, అత్యుత్తమ ప్రోత్సాహకాల వల్ల గత 18నెలల్లోనే రూ.20 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయి. దేశంలోనే తొలిసారిగా ఎంవోయూల తర్వాత నిర్ణీత సమయంలో పరిశ్రమలను గ్రౌండింగ్ చేసే సంస్థలకు ఎస్క్రో ఎకౌంట్ ద్వారా నేరుగా ప్రోత్సాహకాలను జమచేసే విధానాన్ని తీసుకురాబోతున్నాం. ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్, షిప్ బిల్డింగ్, పోర్ట్ కార్యకలాపాలు, పారిశ్రామిక పార్కులు, వాణిజ్య రియల్ ఎస్టేట్, డేటా సెంటర్లు,రోబోటిక్స్, యంత్రాల తయారీ, హార్డ్‌వేర్, రైలు విడిభాగాల తయారీ, ఫార్మాస్యూటికల్స్, వైద్యం,పరిశోధన రంగాల్లో పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్‌లో విస్తృత అవకాశాలు ఉన్నాయి. అంతర్జాతీయంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి ప్రపంచస్థాయి సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉంది. ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి అధునాతన సాంకేతికతల్లో యువతకు ప్రత్యేక శిక్షణ అందిస్తున్నాం. అమరావతిలో అతి త్వరలోనే క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటుచేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. గూగుల్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల రాకతో విశాఖపట్నం డేటా హబ్‌గా రూపుదిద్దుకుంటోంది. ప్రపంచ వ్యాప్తంగా విస్తరించి ఉన్న తెలుగు డయాస్పోరా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి దోహదపడుతోంది. ఏపీలో పారిశ్రామికాభివృద్ధికి మీ వంతు సహాయ, సహకారాలు అందించాల్సిందిగా శ్రీకర్‌రెడ్డిని మంత్రి లోకేష్ కోరారు.

## ఏపీలో ఎలక్ట్రోలైజర్ తయారీ కర్మాగారం

- **ఏర్పాటు చేయాలని ఓమియం సంస్థకు మంత్రి లోకేష్ వినతి**
- **సంస్థ సీఎస్‌టీఓ చొక్కలింగంతో భేటీ**



శాన్‌ఫ్రాన్సిస్కో/యూఎస్ఏ (చైతన్యరథం): ఎలక్ట్రోలైజర్, ఇంటిగ్రేటెడ్ గ్రీన్ హైడ్రోజన్ కాంట్రాక్ట్ సేవలు, గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తికి అవసరమైన ఎలక్ట్రోలైజర్‌లను తయారుచేసే అంతర్జాతీయ సంస్థ ఓమియం (Ohmium) చీఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆఫీసర్ (సీఎస్‌టీఓ) చొక్కలింగం కరుప్పయ్యతో అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కోలో రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ...ఆంధ్రప్రదేశ్‌లోని ఇండస్ట్రియల్ జోన్‌ల్లో (కృష్ణపట్నం లాంటి) ఎలక్ట్రోలైజర్ తయారీ కర్మాగారాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఏపీలో సౌర/పవన సామర్థ్యంతో నడిచే పైలట్ గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్లను సహ-అభివృద్ధి చేయడంతోపాటు సరఫరా పరిశ్రమలు, రవాణా, అమ్మోనియా ఉత్పత్తి రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని కోరారు. దీనిపై ఓమియం సీఎస్‌టీఓ చొక్కలింగం మాట్లాడుతూ... తమ సంస్థ బెంగళూరులో ప్రపంచంలోనే అతిపెద్ద గిగావాట్ ఎలక్ట్రోలైజర్ ఫ్యాక్టరీని నిర్వహిస్తోందని చెప్పారు. నార్త్ అమెరికా, యూరోప్, ఇండియా, మిడిల్ ఈస్ట్ దేశాల్లో ఇండస్ట్రియల్, ఎనర్జీ, యుటిలిటీ సెక్టార్లలో సేవలందిస్తున్నామని చెప్పారు. భారత్, యుఎస్ కేంద్రాల నుండి ప్రోటాన్-ఎక్స్ఛేంజ్ మెంబ్రేన్ (PEM) సాంకేతికత, ఎఫిషియన్సీ ఆప్టిమైజేషన్, ఇంటిగ్రేటెడ్ గ్రీన్ హైడ్రోజన్ సొల్యూషన్స్‌లో ఆవిష్కరణలపై తాము దృష్టిసారించినట్లు చెప్పారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని చొక్కలింగం చెప్పారు.

### ఎన్టీఆర్ ఆశయాలు, చంద్రబాబు ప్రోత్సాహంతో రాజకీయాల్లోకి..

# బీసీలంటే చంద్రబాబుకు ప్రత్యేక ప్రేమ!



నూకసాని బాలాజీ
ఏపీ టూరిజం కార్పొరేషన్ చైర్మన్



*(చైతన్యరథం ప్రతినిధి - అమరావతి)*

ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలం బింగినపల్లిలో సాధారణ మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన నూకసానీ బాలాజీ... తెలుగుదేశం ఆవిర్భావం తర్వాత ప్రతిపేద వాడికి కూడు, గూడు, గుడ్డ కల్పించాలన్న మహోన్నత లక్ష్యంతో అన్న ఎన్టీఆర్ తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాలకు ఆకర్షితుడై రాజకీయాల్లోకి వచ్చారు. చంద్రబాబు గారి ప్రోత్సాహంతో అంచెలంచెలుగా రాష్ట్రస్థాయి నాయకుడిగా ఎదిగారు. ఎస్వీ యూనివర్సిటీలో ఎంఎ పిహెచ్ డి చేసిన బాలాజీ... అదే యూనివర్సిటీలో కొంతకాలం లెక్చరర్‌గా పనిచేశారు. విద్యార్థిగా ఉన్న సమయంలో లెఫ్ట్ పార్టీ అనుబంధ సంఘాల్లో పనిచేశారు. బలహీన వర్గాలకు పుట్టినిల్లు లాంటి టిడిపిలో బిసిలకు పెద్దపీట వేస్తూ సామాజిక న్యాయాన్ని అమలుచేస్తూ బిసి నాయకత్వాన్ని ప్రోత్సహిస్తుండటంతో బాలాజీ రాజకీయాల్లోకి వచ్చారు. ఎపి టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ అంతరంగం ఆయన మాటల్లోనే...!

## చంద్రబాబు - జగన్ మధ్య వ్యత్యాసం ఏంటి?

చంద్రబాబు నాయుడు గారు రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా పనిచేసే విజనరీ లీడర్.కార్యకర్తల గౌరవం,సంక్షేమం విషయంలో ప్రత్యేకశ్రద్ధ వహిస్తారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం అహర్నిశలు కష్టపడే నిత్య కృషీ వలుడు ఆయన. ఇక జగన్ డిక్షనరీలో అభివృద్ధి అనేపదమే ఉండదు. అధికార దుర్వినియోగం, అహంకారం, వ్యక్తిగత ప్రతీకారమే అజెండా గా అయిదేళ్లు అరాచకపాలన సాగించారు. వెనుకబడిన వర్గాలకు చెందిన మాజీ IAS అధికారి పి.కృష్ణయ్యని 'వాడు, వీడు' అని సంబోధించడం ఆయన దురహంకారానికి నిదర్శనం. చంద్రబాబుగారు కులమతాలకు అతీతంగా, చిన్న,పెద్ద తేడాలేకుండా అందరిపట్ల గౌరవంగా వ్యవహరిస్తారు.ఇదే ఇద్దరి మధ్య ఉన్న ప్రధాన వ్యత్యాసం. కూటమి ప్రభుత్వంలో ఎనిమిది మంది బీసీ నేతలకు అత్యంత కీలక శాఖలను కేటాయించి, బీసీలపై తనకున్న ప్రత్యేకమైన ప్రేమను చాటుకున్నారు. నామినేటెడ్ పోస్టుల్లో కూడా బీసీలకు అధికప్రాధాన్యత ఇచ్చారు. పాలసీ నిర్ణయాల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ నాయకుల మనోభావాలను గౌరవిస్తూ సామాజిక న్యాయాన్ని చేతల్లో చూపుతున్న నాయకుడు సిబిఎన్ గారు.



## వైసిపి పాలనలో బిసిల పరిస్థితి ఏమిటి?

గతంలో ఎన్నడూ లేనివిధంగా జగన్ జమానాలో బిసిలపై ఉక్కుపాదం మోపారు. పల్నాడులో తోట చంద్రయ్య గొంతుపై కత్తిపెట్టి 'జై జగన్ అనమంటే ఆయన జై చంద్రబాబు' అని అన్నందుకు అత్యంత కిరాతకంగా హతమార్చారు. నాటి ప్రతిపక్ష నేత చంద్రబాబుగారు స్వయంగా చంద్రయ్య అంత్యక్రియలకు వెళ్లి ఆయన పాడెమోశారు. కరోనా సమయంలో ఇంట్లో ఉన్న అచ్చెన్నాయుడు గారిపై అక్రమ కేసులు బనాయించి, జైలులో పెట్టారు. కొల్లు






రవింద్రగారిని అన్యాయంగా అరెస్టు చేశారు. టిడిపికి వెన్నుదన్నుగా ఉన్న బిసినేతలను అణచివేయాలని కుట్రపూరితంగా వ్యవహరించారు. వైసిపి పాలనలో 74 మంది బీసీలు హతమయ్యారు. 5వేలమందిపై అక్రమ కేసులు పెట్టారు. రూ.75వేల కోట్లకు పైగా బీసీ సబ్‌ప్లాన్ నిధులు దారి మళ్లించారు. బిసి సంక్షేమ పథకాలను రద్దు చేశారు. స్థానిక సంస్థల్లో బిసి రిజర్వేషన్లను 34% నుంచి 24%కు తగ్గించే ప్రయత్నం చేశారు. బలహీనవర్గాలను అణగదొక్కాలని చూసిన జగన్ & కోకు ఎన్నికల్లో బిసిలు తగినవిధంగా బుద్ధిచెప్పారు.

## కూటమి ప్రభుత్వం వచ్చాక ఎలా ఉంది?

గత ప్రభుత్వంలో బిసిలు పడిన ఇబ్బందులు భవిష్యత్తులో పడకూడదన్న ఉద్దేశంతో బిసి రక్షణ చట్టం తెచ్చేందుకు మంత్రుల కమిటీ వేశారు. చట్టం విధివిధానాల రూపకల్పనకు ప్రస్తుతం ఆ కమిటీ కసరత్తు చేస్తోంది. తోట చంద్రయ్య, నందం సుబ్బయ్య, అమర్నాథ్ వంటి బిసి బిడ్డలు బలి కాకుండా బీసీల రక్షణ చట్టం కవచం ఉంటుంది. బీసీలు తలెత్తుకుని తిరిగే పరిస్థితి వస్తుంది. 2019-24 మధ్య వివిధ ఎన్నికల్లో రాయలసీమలో ఓటు వేయడానికే స్వేచ్ఛలేని స్థితిని వైసీపీ పాలకులు కల్పించారు. అంతకుముందు చంద్రబాబు గారి హయాంలో ప్రత్యేకించి యాదవులకు ప్రాధాన్యత కల్పించారు. నాకు మొట్టమొదటిసారిగా యాదవ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇచ్చారు. తర్వాత జిల్లాపరిషత్ చైర్మన్‌గా అవకాశం కల్పించారు. నేడు అత్యంత కీలకమైన టూరిజం కార్పొరేషన్ ఛైర్మన్ బాధ్యతను అప్పగించారు. మంత్రివర్గంలో పార్థసారధి, సత్యకుమార్ యాదవ్ గార్లకు స్థానం కల్పించారు. బిసిలు అందరికీ సమన్యాయం చేస్తూ మా హృదయాల్లో చంద్రబాబు గారు చెరగని ముద్ర వేశారు.

## సూపర్ -6 బిసిలకు ఉపయోగపడుతోందా?

సూపర్ -6 లో భాగంగా కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు బిసిలకు ఆర్థిక వెసలుబాటు కల్పిస్తున్నాయి. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఉచిత గ్యాస్ వంటి పథకాల ద్వారా లబ్ధి పొందుతున్న వారిలో 50% మంది బీసీలే. ప్రతి పథకంలో బీసీ లకు సింహభాగం ప్రయోజనం చేకూరుతోంది.సూపర్ సిక్స్ పథకాలు బీసీ కుటుంబాల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. చంద్రబాబుగారు ప్రత్యేకశ్రద్ధ వహిస్తూ అన్ని రంగాల్లో బీసీలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వడం ఆనందంగా ఉంది.

## లోకేష్ 20లక్షల ఉద్యోగాల హామీ సాధ్యమేనా?

యువగళం పాదయాత్ర సందర్భంగా యువత కష్టాలను కళ్లారా చూసి చలించిన లోకేష్... అధికారంలోకి వచ్చాక 20లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీని నెరవేర్చేందుకు గత 18నెలలుగా అహర్నిశలు కష్టపడుతున్నారు. చంద్రబాబు గారి బ్రాండ్ ఇమేజ్, మంత్రి లోకేష్ అవిశ్రాంత కృషితో ఇప్పటికే 23లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు రాష్ట్రానికి చ్చాయి. ఒక్క సిఐఐ పార్టనర్ షిప్ సమ్మిట్ లోనే 13.25 లక్షల కోట్ల విలువైన ఎంఓయులు కుదుర్చుకున్నారు. వైసిపి పాలనలో ఒక్క టీచర్ పోస్టు భర్తీచేయకపోగా, మంత్రి లోకేష్ సారధ్యంలో విజయవంతంగా మెగా డిఎస్సీ నిర్వహించి 16,347మంది నిరుద్యోగ టీచర్లకు ఉద్యోగాలిచ్చారు. వైసిపి నేతలు కోర్టుల్లో 150కిపైగా కేసులు వేసి అడ్డుకోవాలని చూసినా డిఎస్సీని పక్కాగా నిర్వహించడం అతిపెద్ద విజయం. యువత ఉద్యోగాల కోసం పొరుగు రాష్ట్రాలు, విదేశాలకు వెళ్లకూడదన్న లక్ష్యంతో యువమంత్రి లోకేష్ పనిచేస్తున్నారు. ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు అనే సంస్కరణలు చేపట్టారు. ఇది యువత, విద్యార్థుల పట్ల ఆయనకు ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనం.

## టూరిజం చైర్మన్‌గా ఏం సాధించారు?

ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అత్యుత్తమ పర్యాటక కేంద్రంగా తీర్చి దిద్దేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వరల్డ్ టూరిజం డే సందర్భంగా కొత్త పర్యాటక విధానాన్ని ప్రకటించారు. ఈ విధానం పెట్టుబడిదారులకు అనేక రకాల రాయితీలను అందిస్తూ పర్యాటక రంగంపై విశ్వాసాన్ని పెంచింది.దీనివల్ల CII సమ్మిట్‌లో రూ.19,000 కోట్లకుపైగా పెట్టుబడులకు ఒప్పందాలు కుదిరాయి. నేను చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత హెూటళ్లు, బీచ్ రిసార్టులు, రెస్టారెంట్ల అభివృద్ధిపై ప్రత్యేకదృష్టి పెట్టా.వైసీపీ పాలనలో నిర్లక్ష్యంవల్ల దెబ్బతిన్న కొన్ని బీచ్ రిసార్టులను పునరుద్ధరించాం. ముఖ్యమంత్రి చంద్రబాబు గారి కృషితో ప్రసాద్, స్వదేశ్ దర్శన్ వంటి పథకాల ద్వారా ఏపీకి రూ.450 కోట్ల కేంద్ర నిధులు వచ్చాయి. గండికోటకు రూ.100 కోట్లు, సూర్యలంకకు రూ.100 కోట్లు, సింహాచలం, బొర్రా గుహలకు సుమారు ఇలా పర్యాటక కేంద్రాల అభివృద్ధికి రూ.450కోట్లు కేటాయింపులు జరిగి, వేగఆంగా పనులు కొనసాగుతున్నాయి. టెంపుల్ టూరిజం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాం. శ్రీశైలం, సింహాచలం వంటి ప్రధాన దేవాలయాల్లో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. టూరిజం కార్పొరేషన్ ఆధ్వర్యాన నిర్వహించే హెూటళ్లను ప్రైవేటుకు ధీటుగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నాం.



చైతన్యరథం

## దిత్వా బాధిత రైతులకు

# 80 శాతం సబ్సిడీపై వరి విత్తనాలు

**- ఎమ్మెల్యే సోమిరెడ్డి వినతికి మంత్రి అచ్చెన్నాయుడు సానుకూల స్పందన**

అమరావతి (చైతన్యరథం): నెల్లూరు జిల్లాలో దిత్వా తుపాను కారణంగా తీవ్రంగా నష్టపోయిన వరి రైతులకు ఉపశమనం కలిగించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తుపానుతో నష్టపోయిన రైతులకు 80 శాతం సబ్సిడీపై వరి విత్తనాల పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి వినతికి వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు సానుకూలంగా స్పందించారు. మంత్రి ఆదేశాల మేరకు తక్షణమే రైతులకు విత్తనాల పంపిణీకి ఏర్పాట్లు చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారులకు నెల్లూరు కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశాలు జారీ చేశారు. దిత్వా తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాల కారణంగా వేలాది నారుమడులు, వరినాట్లు దెబ్బతిని నష్టపోయిన రైతులకు దీంతో ఊరట లభించనుంది. సర్వేపల్లి, కోవూరు, నెల్లూరు రూరల్, కావలితో పాటు మిగిలిన నియోజకవర్గాల్లోని రైతులకు సబ్సిడీపై విత్తనాల సరఫరా చేయనున్నారు.

కాగా రైతులను ఆదుకోవాలని లేఖ రాయడంతో పాటు ఫోన్‌లో కోరిన వెంటనే సానుకూలంగా స్పందించి సబ్సిడీపై విత్తనాల సరఫరా చేసేందుకు నిర్ణయం తీసుకున్న వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడితో పాటు సీఎం నారా చంద్రబాబు నాయుడికి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ధన్యవాదాలు తెలియజేశారు. నష్టపోయిన ప్రతి రైతుకూ సబ్సిడీపై విత్తనాలు అందజేసేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులకు సోమిరెడ్డి సూచించారు.



# ప్రతి జిల్లాలో మాక్ అసెంబ్లీకి చర్యలు

- **ప్రభుత్వంతో చర్చించి నిర్ణయం తీసుకుంటాం**
- **బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత**
- **విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొంచాలి**
- **బాలోత్సవంలో పర్యాటక మంత్రి కందుల దుర్గేష్**

విజయవాడ(చైతన్యరథం): ప్రభుత్వంతో చర్చించి రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో ఒక మాక్ అసెంబ్లీ జరిగేలా చర్యలు తీసుకుంటామ ని పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. మంగళవారం విజయవాడ సిద్ధార్థ కళాశాలలో జరిగిన అమరావతి బాలోత్సవం లో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులకు నిర్వహిస్తున్న వ్యాస రచన, వక్తృత్వ, నృత్య, నాట్య, డ్రాయింగ్ పోటీలను స్వయంగా పరిశీలించారు. కాంతార, భరతమాత, రాణి రుద్రమ దేవి, రైతు వేషంలోని చిన్నారులను ప్రత్యేకంగా అభినందించారు. బాలోత్సవ కార్యక్రమాలకు ప్రభుత్వం తరపున ప్రోత్సాహం అందించేందుకు వారధిగా పనిచేస్తానని తెలిపారు. “మంచి గాలి కోసం, మంచి జీవితం కోసం పర్యావరణాన్ని పరిరక్షిద్దాం”అనే నినాదంతో ఈ ఏడాది అమరావతి బాలోత్సవం.. 8వ పిల్లల పండుగ నిర్వహించ డం శుభ పరిణామమన్నారు. డిసెంబరు 9 నుంచి 11వ తేదీ వరకు మూడురోజుల పాటు నిర్వహిస్తున్న ఈ అమరావతి బాలో త్సవం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. పిల్లల ఆకాంక్ష లకు ఆంక్షలు విధిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో చిన్నారుల్లో సృజనా త్మకత, వ్యక్తిత్వ



వికాసానికి, విద్యా ప్రగతికి, విద్యార్థుల్లో ప్రతిభా పాఠవాలను వెలికితీసేందుకు, నైతికత పెంపొందించేందుకు బాలోత్సవాలు దోహదపడుతాయని తెలిపారు. అకడమిక్, కల్చరల్ అంశాల్లో పాల్గొన్న విద్యార్థులకు అభినందనలు తెలిపారు. చదువే కాదు ఆటపాటల్లో సైతం విద్యార్థులు పాల్గొనాలని, పిల్లల అభిరుచులు తెలుసుకుని ఉపాధ్యాయులు సైతం తమ బోధనా శైలిని మార్చుకోవాల్సిన అవసరం ఉందని సూచించా రు. పిల్లల్లోని ఆసక్తిని తల్లిదండ్రులు గుర్తించి ప్రోత్సహించాలని కోరారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా ప్రైవేట్, ప్రభుత్వ విద్యా ర్థులను ఒకచోట చేర్చి వారి మధ్య ఆట పాటలు నిర్వహించడం, బృంద చర్చలు నిర్వహించడం వల్ల వారిలో స్నేహభావం, ఐకమత్యం, సమానత్వ విలువలు మెరుగుపడుతాయన్నారు. పిల్లల్లో ఉన్న నైపుణ్యాలను వెలికి తీసినప్పుడే సమగ్ర వ్యక్తిత్వ వికాసం బయట పడుతుందని తెలిపారు.

**విద్యారంగంలో దేశంలోనే ఆదర్శంగా రాష్ట్రం**

విద్యార్థుల సమగ్రాభివృద్ధే ధ్యేయంగా, విలువలతో కూడిన విద్యే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని, ఈ క్రమం లో విద్యాశాఖ వినూత్న ఆలోచనలు, విప్లవాత్మక మార్పులతో ముందుకు వెళుతుందని వివరించారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అద్భుత ఆలోచనల నుంచి పుట్టిన మాక్ అసెంబ్లీ ఎలా జరిగిందో అందరం చూశాం. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించేలా రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మాక్ అసెంబ్లీ నిర్వహించి విజయం సాధించడం గొప్ప విషయమ న్నారు. చాగంటి కోటేశ్వరావు లాంటి మహానుభావుడితో నైతిక విలువలపై పాఠ్యాంశాలు నేర్పిస్తుండటం గర్వించే అంశమన్నా రు. దేశంలోనే రాష్ట్ర విద్యా రంగాన్ని నెంబర్‌వన్‌గా చేయాలన్న సత్సంకల్పంతో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పనిచేస్తున్నారని తెలిపా రు. ఏ రంగంలోనైనా నాయకత్వ లక్షణాలు అంది పుచ్చుకునే లా విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. ఆట పాటలు, ప్రయోగాలతో కూడిన విద్యా విధానంతో విద్యార్థుల్లో సృజనాత్మకత బయటపడుతుందని తెలిపారు.

# గోదావరి డెల్టాకు పూర్వవైభవం

- **ఉభయ గోదావరి జిల్లాల్లో ముంపు నివారణకు లైడార్ సర్వే**
- **జగన్ హయాంలో గోదారి డెల్టాకు తీవ్ర నష్టం**
- **సత్వరం ఆధునీకరణ చర్యలు**
- **జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు**



అమరావతి (చైతన్యరథం): గోదావరి డెల్టా ముంపు సమస్య పరిష్కరించడంతో పాటు, ఇరిగేషన్ సమస్యలను పరిష్కరించేలా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని, దీని కోసం డెల్టా ప్రాంతంలో లైడార్ సర్వే కోసం రూ.13.4 కోట్ల రూపాయలు మంజూరు చేశామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. మంగళవారం అమరావతి సచివాలయంలో గోదావరి డెల్టా ఆధునీకరణ పనులపై సంబంధిత ఇరిగేషన్ అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ డిసెంబర్‌కు గోదావరి జిల్లాల్లో ముంపు సమస్య, లాకులు, గేట్ల మరమ్మత్తులకు సమగ్ర డీపీఆర్ తయారు చేయాలని ఏజెన్సీని ఆదేశించారు.

**సైంధవుడిలా అడ్డుపడిన జగన్**

5ఏళ్ళ వైసీపీ పాలనలో గోదావరి డెల్టా ఆధునీకరణకు నిధులు ఉన్నా పనులు చేయకపోవడమే కాకుండా సగంలో ఉన్న పనులను ప్రీ క్లోజర్ చేసి, 150 ఏళ్ళలో గోదావరి డెల్టాకు ఎవరూ చేయలేనంత ద్రోహం చేసి, డెల్టా అభివృద్ధికి, ఆధునీకరణ పనులకు సైంధవుడిలా జగన్ అడ్డుపడ్డారని మంత్రి నిమ్మల దుయ్యబట్టారు. ఆధునీకరణ పనులు మధ్యలోనే నిలిపేయడంతో ఉభయ ఉమ్మడి గోదావరి జిల్లాల్లో ముంపు సమస్య తలెత్తడంతో పాటు లాకులు, గేట్ల మరమ్మత్తుల పనులు, డ్రైన్ల లో పూడిక తీత పనులు, ఏటిగట్లను బలోపేతం చేసే పనులు నిలిచిపోయి, పంటలు నాశనమైపోయిన పరిస్థితి వచ్చిందన్నారు. దీని కారణంగా ఒకప్పుడు ఆంధ్రప్రదేశ్‌కు ధాన్యాగారంగా ఉన్న గోదావరి డెల్టా లో ఇప్పుడు మొదటి పంట వేయలేని పరిస్థితి వచ్చిందని, రెండో పంట మాత్రమే వేయాల్సి వస్తోందన్నారు. ఇలా డెల్టా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, గోదావరి డెల్టాకు పూర్వవైభవం తీసుకొచ్చేలా వెంటనే లైడార్ సర్వే పూర్తి చేసి, డెల్టా ఆధునీకరణ పనులు మొదలుపెట్టేలా చర్యలు చేపట్టాలని అధికారులను మంత్రి నిమ్మల ఆదేశించారు.

గత ప్రభుత్వంలో నిధులు ఉన్నా కూడా కాలువలు, డ్రైన్లలో మట్టితీయకపోగా, లాకులు షట్టర్లకు కనీసం గ్రీజు పెట్టడానికి ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని, మంత్రి నిమ్మల ధ్వజమెత్తారు. ఇప్పటికే ధవళేశ్వరం బ్యారేజికి కొత్త గేట్లను ఏర్పాటు చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రూ.150 కోట్లను మంజూరు చేశారని ఈ సందర్భంగా గుర్తుచేశారు.

ఈ సమావేశంలో ఇరిగేషన్ అడ్వైజర్ ఎం. వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహామూర్తి, గోదావరి డెల్టా సిస్టమ్ సీఈ, ఎస్ఈ, ఈఈలు, ఏజెన్సీ ప్రతినిధులు, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## గోదావరి పుష్కరాల ఏర్పాట్లకు ప్రణాళికలు

**- అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి**

**- దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి**

**- ఉన్నతస్థాయి సమావేశంలో అధికారులకు సూచనలు**



అమరావతి (చైతన్యరథం): రాబోయే గోదావరి పుష్కరాలు-2027ను పురస్కరించుకుని సచివాలయంలో దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధ్యక్షతన కీలక సమీక్ష సమా వేశం జరిగింది. గోదావరి నది పరివాహక ప్రాంతాల్లో జరుగనున్న పుష్కర సన్నాహక పనులు, ఆలయాల అభివృద్ధి, శాఖల మధ్య సమన్వయం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ పుష్కరాల సమయంలో కోట్లాది భక్తులు రాష్ట్ర నలుమూలల నుంచి పుష్కర ఘాట్లకు పుణ్యస్నానాలు ఆచరించేందుకు చేరుకుంటారని వారిని దృష్టిలో ఉంచుకుని, ప్రతి ఘాట్‌లో భద్రత-సౌకర్యాల బలోపేతం, శానిటేషన్ చర్యలు, మహిళలకు ప్రత్యేక డ్రెస్సింగ్ రూమ్‌లు, తాగునీటి సదుపాయాలు, వైద్యశిబిరాలు, అగ్నిమాపక, పోలీసు, ఎస్‌డీఆర్‌ఎఫ్ వంటి అత్యవసర సేవల విభాగాలతో సమన్వయం అత్యంత కీలకమని మంత్రి ఆనం పేర్కొన్నారు. అలాగే దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో గోదావరి తీరం వద్ద ప్రత్యేక ఆధ్యాత్మిక-సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రత్యేక హారతులు, ఘాట్‌ల వద్ద శాశ్వత-తాత్కాలిక సదుపాయాల విస్తరణ, యాత్రికుల రద్దీ నియంత్రణకు ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ వ్యవస్థ, టూరిజం శాఖతో కలిసి ప్రత్యేక దర్శనం-యాత్ర ప్యాకేజీలు, పుష్కరాలపై రాష్ట్రవ్యాప్తంగా పబ్లిసిటీ, అవగాహన కార్యక్రమాలు చేపట్టేలా తక్షణమే ప్రణాళిక లు రూపొందించి అమలు జరపాలని ఆదేశించారు. ముఖ్యంగా “పుష్కరాలు అంటే భక్తి, సంస్కృతి, ఆధ్యాత్మికతల సమ్మేళనం. రాష్ట్ర ప్రతిష్టకు సంబంధించిన ఈ మహోత్సవాన్ని అత్యున్నత ప్రమాణాలతో నిర్వహించే దిశగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో దేవాదాయ శాఖ సెక్రటరీ హరి జవహర్‌లాల్, కమిషనర్ కే.రామచంద్రమోహన్, చీఫ్ ఇంజనీర్ శేఖర్, స్థపతి బి.పరమేశ్వరప్ప, దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# టీడీపీ క్యాడర్‌కు కొనసాగుతున్న శిక్షణ తరగతులు

## పాల్గొన్న మంత్రులు పయ్యావుల కేశవ్, ఆనం

మంగళగిరి(చైతన్యరథం): టీడీపీ కేంద్ర కార్యాలయంలో మండల స్థాయి క్యాడర్‌కు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులకు మంగ ళవారం పలువురు ముఖ్య నాయకులు హాజరయ్యారు. రెవెన్యూ శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యేలు ఎం.ఎస్.రాజు, బి.జయనాగేశ్వ రరెడ్డి పాల్గొని పార్టీ యొక్క సిద్ధాంతాలు, నైతిక విలువలు, నాయకుల పాత్రలు–బాధ్యతలు, అలాగే ప్రాంతీయ పార్టీల ఆవి ర్భావం–పరిణామం వంటి అంశాలపై లోతైన అవగాహన కల్పిం చారు. వీటితో పాటు, ప్రభుత్వం అమలు చేస్తున్న 'సూపర్‌సిక్స్' సంక్షేమ కార్యక్రమాలు, పెన్షన్ల అమలు తీరు, సోషల్ మీడియా వ్యూహాలు, నిజ నిర్ధారణ (ఫ్యాక్ట్ చెక్), ఎన్నికల నిర్వహణ వంటి కీలక అంశాలపై తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ సంద ర్భంగా మంత్రులు మాట్లాడుతూ కార్యకర్తలకు అత్యంత గౌరవం ఇచ్చేది తెలుగుదేశం పార్టీ మాత్రమేనని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కార్యదక్షతను, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పోరాట పటిమను కార్యకర్తలు స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. పార్టీ సభ్యత్వం కోటి దాటిందంటే అది నారా లోకేష్ చేస్తున్న నిరంతర కృషికి, ఆయన పట్టుదలకు నిదర్శనమని కొనియాడారు. ప్రభుత్వ విప్, టీడీపీ మానవ వనరు ల విభాగం చైర్మన్ వేపాడ చిరంజీవిరావు పర్యవేక్షణలో ఈ శిక్షణ తరగతులు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఒక్కో బ్యాచ్‌లో దాదాపు 30 మంది చొప్పున నాలుగు గ్రూపులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా చిరంజీవిరావు మాట్లాడుతూ గత రెండు గ్రూపు ల్లో 200 మందికి పైగా మండల స్థాయి క్యాడర్ శిక్షణలో పాల్గొ న్నారని వారికి అభినందనలు తెలిపారు. శిక్షణ ఇచ్చేందుకు వచ్చిన ముఖ్య నేతలకు జ్ఞాపికలు అందజేశారు.



# పాడేరు వైద్యకళాశాలకు 100 ఎంబీబీఎస్ సీట్లు

- పిడుగురాళ్ల, మరో నాలుగింటిలో ప్రవేశాలకు చర్యలు
- వైద్యుల నిర్లక్ష్య దోరణులను ఉపేక్షించేది లేదు
- ప్రజారోగ్య రంగంలో సేవలు మరింత మెరుగుపడాలి
- వైద్యఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశం
- జవాబుదారీతనాన్ని పెంచడం విభాగాధిపతుల బాధ్యత
- 18 నెలల్లో వైద్యశాఖలో పురోగతిపై సుదీర్ఘ సమీక్ష



మంగళగిరి (చైతన్యరథం): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి 18 నెలలు పూర్తయిన సందర్భంగా వైద్యారోగ్య శాఖ పనితీరు, ఫలితాలను మంత్రి సత్యకుమార్ యాదవ్ సుదీ ర్ఘంగా 3 గంటల పాటు సమీక్షించారు. 10 మంది విభాగాధిపతు లు, ఇతర ఉన్నతాధికారులు ఈ సమీక్షలో పాల్గొన్నారు. మంగళ గిరి ఏపీఐఐసీ టవర్స్‌లో ఈ సమీక్ష జరిగింది. ప్రజారోగ్య రంగంలో గత ఏడాదిన్నర కాలంలో కొంత మేరకు మార్పు తీసుకురాగలిగామని, చేయాల్సింది ఇంకా చాలా ఉందని మంత్రి వ్యాఖ్యానించారు. లక్ష మందికి పైగా ఉన్న వైద్యులు, ఇతర సిబ్బం దిలో బాధ్యతతో కూడిన విధుల నిర్వహణ, జవాబుదారీతనాలను పెంచి ప్రజలకు నాణ్యమైన సేవలందించాలని, దీనికి విభాగాధిప తులే బాధ్యత వహించాలని మంత్రి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షల మేరకు ఇంకా సాధించాల్సింది చాలా ఉం దని అన్నారు. ఈ లక్ష్య సాధనకు వివిధ స్థాయిల్లో అధికారులు, వైద్యులు, ఇతర సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించా రు. కొందరు ప్రభుత్వ వైద్యుల నిర్లక్ష్య ధోరణులపై ఆందోళన వ్యక్తం చేశారు. ఆపరేషన్లు చేసి బ్లేడులను రోగుల దేహాల్లో వదలి వేయడం, ఒంటికి పడని ఇంజక్షన్లను అందించడం, గంటల తరబడి రోగులను పట్టించుకోకపోవడం, రోగుల పట్ల దురుసుగా ప్రవర్తించడం వంటి ధోరణులను ఎంత మాత్రం ప్రభుత్వం ఉపేక్షించదని హెచ్చరించారు. అటువంటివి పునరావృతం కాకూడ దని స్పష్టం చేశారు.

### పాడేరు వైద్యకళాశాలకు 100 ఎంబీబీఎస్ సీట్లు మంజూరు

పాడేరు ప్రభుత్వ వైద్య కళాశాలలో వచ్చే విద్యా సంవత్సరానికి (2026–27) పూర్తి స్థాయిలో 100 ఎంబీబీఎస్ సీట్లలో ప్రవేశా లకు ముందస్తుగానే జాతీయ వైద్య మండలి(ఎన్ఎంసీ) అనుమతిం చిందని వెల్లడించారు. అధికారుల్లో సమన్వయలోపం కారణంగా ప్రస్తుత విద్యా సంవత్సరానికి 50 సీట్లు కోల్పోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పిడుగురాళ్లలో కేంద్ర ప్రాయోజిత పథకం (సీఎస్ ఎస్) కింద చేపట్టిన వైద్య కళాశాలల్లో 2026–27లో ఎంబీబీఎస్ ప్రవేశాలు కల్పించేందుకు తగు చర్యలు చేపట్టాలని డీఎంఈని ఆదేశించారు. ఆ మేరకు అవసరమైన సిబ్బంది నియామకం, మౌలిక సదుపాయాల కల్పనను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని మంత్రి సూచించారు. ఈ కళాశాల నిర్మాణంపై గత ప్రభుత్వ నిర్ల క్ష్యంపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. వైద్యకళాశాల భవన నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేసి నర్సింగ్ కాలేజీ భవనాన్ని నిర్మించినట్లు అధికారులు వెల్లడించడంతో మంత్రి విస్తుపోయారు. ప్రభుత్వం పీపీపీ పద్ధతిలో చేపడుతున్న ఆదోని, మార్కాపురం, మదనపల్లి, పులివెందుల వైద్య కళాశాలల్లో 2026–27లో ఎంబీబీఎస్ ప్రవేశాలకు అవసరమైన చర్యలు ప్రణాళికా బద్ధంగా చేపట్టాలని మంత్రి ఆదేశించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి 6 నెలల కాలంలో కూటమి ప్రభుత్వం సాధించిన ఫలితాలపై తానడిగిన సమాచారాన్ని సమ గ్రంగా ఇవ్వలేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రాథమిక, సెకండరీ, బోధానాసుపత్రుల సూపరింటెండెంట్ల పనితీరు కూడా బాగా మెరుగుపడాలని, వీరి పనితీరును ఆయా విభాగాధిపతులు నిరంతరం సమీక్షించి ప్రణాళికా బద్ధంగా సమస్యలు ఎప్పటికప్పు డు పరిష్కరిస్తూ ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలందించాలని మంత్రి స్పష్టం చేశారు. జీజీహెచ్‌ల సూపరింటెండెంట్లు, అడ్మిని స్ట్రేటర్ల మధ్య సమన్వయ లోపం ఉండకూడదన్నారు

### స్క్రబ్ టైఫస్‌పై చర్చ

వివిధ జిల్లాల్లో బయటపడుతున్న స్క్రబ్ టైఫస్ గురించి మంత్రి ఆరా తీశారు. ఈ విషయంలో ఎటువంటి ప్రయత్న లోపం ఉండ కూడదని, ఈ సమస్య గురించి ప్రజల్లో నివారణ, చికిత్సా మార్గాల పట్ల సమగ్ర అవగాహన కల్పించాలని ఆదేశించారు. నిపుణులతో సమగ్రంగా చర్చించి తగు ప్రతిపాదనలను ప్రభుత్వ పరిశీలన కోసం అందజేయాలని మంత్రి సూచించారు. అయితే, 12 ఏళ్ల లోపు వారికి ఈ మందు వాడరాదని డీఎంఈ తెలిపారు. సమావే శంలో ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్, ఏపీఎంఎస్ఐడీసీ ఎండీ గిరీషా, డీఎస్‌హెచ్ చక్రధర్‌బాబు, డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ సీఈవో దినేష్ కుమార్, ఏపీ శాక్స్ పీడీ నీలకంఠారెడ్డి, డీఎంఈ రఘునందన్, డీహెచ్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

# భక్తుల మనోభావాలతో జగన్‌రెడ్డి చెలగాటం

- పరకామణి కేసులో కప్పిపుచ్చుకునే ప్రయత్నం
- గరుడ వారధి కాంట్రాక్టర్ల దగ్గర డబ్బు తీసుకోలేదా?
- స్వామి వారి ఎదుట ప్రమాణం చేయగలరా?
- టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్
- జగన్, భూమన, వైవీలకు బహిరంగ సవాల్



మంగళగిరి (చైతన్యరథం): ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన తిరుమల వెంకటేశ్వర స్వామి క్షేత్రాన్ని జగన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో అవినీతి కేంద్రంగా మార్చేశారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ మండిపడ్డారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. గత ప్రభుత్వంలో తిరుమల తిరుపతిని కేవలం ఆదాయ వనరుగా మాత్రమే చూశారు. గత ఐదేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి పవిత్ర క్షేత్రంపై "అదేదో కొండ, అదేదో లడ్డు" అంటూ మాట్లా డటం కోట్లాది మంది హిందూ భక్తుల మనోభావాలను దెబ్బతీయ డమేనని తీవ్రంగా ఖండించారు. రవికుమార్ చేసింది చిన్న చోరీనే అని చెప్పడం సిగ్గుచేటని మండిపడ్డారు. రవికుమార్ డాలర్లు దొంగతనం చేస్తూ పట్టుబడిన తర్వాత అతన్ని చట్టపరంగా శిక్షించ కుండా, ముఖ్యమంత్రి కార్యాలయం జోక్యం చేసుకుని రాజీ (సెటి ల్‌మెంట్) చేయించిందని ప్రధానంగా ఆరోపించారు. రవికుమార్ రాజీగా రూ.14 కోట్లు టీటీడీకి గిఫ్ట్ రూపంలో రాసిస్తే, దాన్ని గిఫ్ట్ అనాలా లేక స్వామి వారి దగ్గర కొట్టేసిన డబ్బును తిరిగి ఇవ్వడం అనాలా అని ప్రశ్నించారు. ఇది దోపిడీని కప్పిపుచ్చుకునే ప్రయ త్నంగా అభివర్ణించారు. దాదాపు రూ.240 కోట్ల ఆస్తిని కొట్టేసి, రూ.14 కోట్లు మాత్రమే గిఫ్ట్‌గా ఇచ్చి, మిగతా వందల కోట్లను వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డి, ధర్మారెడ్డి పంచుకున్నా రని ఆరోపించారు. ఈ సెటిల్‌మెంట్ వెనుక ప్రేమ కాకుండా.. దందానే ప్రతిఫలంగా ఉందని దుయ్యబట్టారు. ఈ విషయంలో గిఫ్ట్ డీడ్‌ను అప్పటి చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ఒక్కరే సంతకం చేయ డంపై హైకోర్టు కూడా ప్రశ్నిం చిందనే అంశాన్ని ప్రస్తావించారు. తిరుమల కల్తీ నెయ్యి కుంభకోణంపై మాట్లాడుతూ ఇది రాజకీయ కక్ష సాధింపు కాదని, సాక్షాత్తు సుప్రీంకోర్టు జోక్యం చేసుకొని సిట్ ఏర్పాటు చేసి విచారణ జరుపుతోందని గుర్తుచేశారు. ఈ కేసులో జగన్ సొంత బాబాయి వైవీ సుబ్బారెడ్డి ప్రధాన నిందితుడుగా ఉన్నారని ఆరోపించారు. ఈ కుంభకోణానికి జగన్ ఇచ్చిన వివరణ ను..ఆవు నాసిరకమైన దాణా తింటే పాలు నాసిరకంగా వస్తాయని ఎగతాళి చేశారన్నారు. వైవీ సుబ్బారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, ధర్మారెడ్డిల ను కాపాడేందుకు 11–12 మంది చిన్న ఉద్యోగస్తులను భయపెట్టి రూ.5 వేల వెండి డాలర్, రూ.18 వేల నగదు వంటి చిన్న మొత్తాల కోసం లంచాలు తీసుకున్నట్లుగా నిందితులుగా ఇరికిం చారని ఆరోపించారు. లడ్డు తయారీలో వాడే యాలకులు, జీడిపప్పు, చక్కెర వంటి ప్రతీ వస్తువు కొనుగోలులోనూ, ఇంజనీ రింగ్ పనుల్లోనూ పెద్దఎత్తున అవినీతి జరిగిందని దుయ్యబట్టారు.

### గరుడ వారధిపై అప్పుడు విచారణ చేయించలేదే

తిరుపతిలో ఉన్న గరుడ వారధి నిర్మాణంలో అవినీతి జరిగిం దని జగన్ చేసిన విమర్శపై తీవ్రంగా ప్రతిస్పందించారు. ఈ వారధిని 2014–19 మధ్య చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే శంకుస్థాపన చేసి 70–80% పనులు పూర్తి చేశారని గుర్తు చేశారు. 2019–24 వరకు ముఖ్యమంత్రిగా ఉన్న జగన్ రెడ్డి ఆ రోజు విచారణ ఎందుకు చేయించలేదని ప్రశ్నించారు. వారధికి ఎగబడి రిబ్బన్ కటింగ్ చేసింది వైసీపీ నాయకులే కదా అని నిలదీశారు. కాంట్రాక్టర్లను బెదిరించి ఎలక్షన్ ఫండ్ కోసం డబ్బులు తీసుకోలేదని వెంకటేశ్వర స్వామి దగ్గర ప్రమాణం చేయ గలరా అని జగన్, కరుణాకర్‌రెడ్డి, సుబ్బారెడ్డిలకు బహిరంగంగా సవాల్ విసిరారు. వైసీపీ వెంటిలేటర్‌పై ఉందని, హిందూ భక్తుల మనోభావాలతో చెలగాటం మాడితే పార్టీ పతనం అవుతుందని హెచ్చరించారు. రవికుమార్ పశ్చాత్తాపం చెంది డబ్బులు రిటర్న్ ఇచ్చినట్టుగా..జగన్ కూడా దోచుకున్న లక్ష కోట్ల ప్రజాధనాన్ని రిటర్న్ ఇస్తే కొద్దో గొప్పో పుణ్యం దక్కుతుందని హితవుపలికారు.

# వైసీపీ ఎంపీటీసీ భూమి అక్రమించారు

- మాజీ ఎమ్మెల్యే బాలవర్ధన్‌రావు అండతో వేధింపులు
- లంచం తీసుకుని ఆశ వర్కర్ ఉద్యోగం ఇచ్చారు
- ప్రజావినతుల కార్యక్రమంలో బాధితుల ఫిర్యాదు
- అర్జీలు స్వీకరించిన ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

మంగళగిరి(చైతన్యరథం): టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ఏపీఈ డబ్ల్యూఐడీసీ ఛైర్మన్ కుప్పం రాజశేఖర్ అర్జీలు స్వీకరించారు. పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం రచ్చమల్లపాడు గ్రామానికి చెందిన ప్రమీల సమస్యను వివరిస్తూ తమ గ్రామంలో సర్వే నెం. 328-1బీలో య.0.04 సెంట్లు, 341-2బీ1లో 0.67 సెంట్లు మొత్తం య.0.71 సెంట్ల భూమి ఉంది. ఆన్‌లైన్‌లో వైసీపీ ఎంపీటీసీ గార్లపాటి శేషగిరిరావు తండ్రి వెంకటరామయ్య పేరుతో నమోదు అయింది. తహసీల్దార్‌కు విన్నవించిన న్యాయం జరగలే దు. వారిపై చర్యలు తీసుకుని భూమి సమస్యను పరిష్కరించాలని అభ్యర్థించారు.

**డబ్బులు పడకుండా అడ్డుకుంటున్నాడు**

కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం ఆముదాలపల్లి గ్రామానికి చెందిన సాంబశివరావు గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామంలో తమకు య.4.14 సెంట్ల భూమి ఉంది. ఇందులో 1.06 సెంట్లు తన భార్య బొబ్బా పద్మకుమారి పేరున రిజిస్టర్ కాగా 2023 రీ-సర్వేలో కూడా అదే పేరు ఉంది. అయితే తాజా గా తహసీల్దార్ కార్యాలయం తమ తల్లి బొడ్డా లక్ష్మి తులశమ్మ పేరున ఎక్కించారు. అదే సమయంలో తమ అన్న కొడుకు వెంకటకృష్ణ రాజశేఖర్ వీలునామా ఫోర్జరీ అంశంపై కేసు కోర్టులో ఉన్నప్పటికీ అతను అక్రమంగా వచ్చి పంట తీసుకుపోతున్నాడు. దీనిపై పోలీసులకు, తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదు. తమ పంటను రైతు సేవా కేంద్రాల ద్వారా మిల్లుకు పంపాం.



03-12-2025న ట్రాన్సాక్షన్స్ జరిగినట్లు ఐడీ వచ్చింది. కానీ మాజీ ఎమ్మెల్యే బాలవర్ధన్‌రావు అండదండలతో డబ్బులు పడకుండా అడ్డుకుంటున్నాడు. వారిపై చర్యలు తీసుకుని తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు.

**లంచం తీసుకుని ఉద్యోగం**

విశాఖపట్నం జిల్లా పద్మనాభం మండలం బీఆర్ లేళ్వవల్స గ్రామానికి చెందిన వెంకటరావు గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ..గత ప్రభుత్వంలో వాలంటీర్ గా పనిచేసిన వైసీపీ సర్పంచ్ మేనకోడలు రామలక్ష్మికి రూ.2 లక్షలు లంచం తీసుకుని ఆశ వర్కర్ ఉద్యోగం ఇచ్చారు. దీనిపై ఎంక్వైరీ చేయించి అర్హులైన వారికి ఉద్యోగం కల్పించాలని కోరాడు.

**భూమిని ఆక్రమించి వేధిస్తున్నారు**

అనకాపల్లి జిల్లా గవరపాలెం గ్రామానికి చెందిన శ్రీనివాస్ గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామంలో తమకు సర్వే నెం.1306/1లో 0.98 సెంట్లు భూమి వారసత్వంగా వచ్చింది. అయితే గ్రామంలోని కొంతమంది వ్యక్తులు ఆ భూమిని అక్ర మంగా ఆక్రమించి తమను వివిధ రకాలుగా బెదిరించి, వేధిం పులకు పాల్పడుతున్నారు. దారులను కూడా మూసేసి గుండాగిరి చేసి హింసిస్తున్నారు. స్థానిక అధికారులు కూడా వారి వద్ద డబ్బులు తీసుకుని వారికి మద్దతుగా వ్యవహరిస్తున్నారు. వారి వద్ద రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు లేకపోయినా వారికి అనుకూలంగా వ్యవహరిస్తూ తమను ఇబ్బందులు పెడుతున్నారు. వారిపై చర్యలు తీసుకోని తమ భూమి సమస్యను పరిష్కరించాలని కోరాడు.

**బతికుండగానే డెత్ సర్టిఫికెట్..భూమి స్వాధీనం**

పల్నాడు జిల్లా చిలకలూరిపేటకు చెందిన కోటేశ్వరమ్మ గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ..తాను బతికే ఉండగా చనిపోయినట్లు నకిలీ డెత్ సర్టిఫికెట్ తయారు చేసి తమ ఎకరం భూమిని అక్రమంగా స్వాధీనం చేసుకున్నారు. సాంబశివరావు అనే వ్యక్తి తమ ఇద్దరి కుమారుడితో నకిలీ పత్రాలు తయారు చేసి తమ పుట్టింటి వారు పెట్టిన భూమిని మోసపూరితంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. వారిపై చర్యలు తీసుకుని తమ భూమిని తమకు అప్పగించాలని కోరారు.

**గుడిసెలు వేసి భూమి ఆక్రమణ**

కర్నూలు జిల్లా దేవనకొండ మండలం కుంకనూరు గ్రామానికి చెందిన పురుషోత్తమయ్య గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామంలో తమకు య.3.80 సెంట్ల భూమి ఉంది. గ్రామా నికి పక్కనే ఉండటంతో ఈ భూమిలో కొంత మంది వ్యక్తులు అక్రమంగా ఆక్రమించి గుడిసెలు కట్టుకున్నారు. తమ భూమిలో గుడిసెలు ఖాళీ చేయమని అడిగితే తమను చంపేస్తామని బెదిరి స్తున్నారు. వారిపై చర్యలు తీసుకుని భూమి సమస్యను పరిష్కరిం చాలని కోరాడు.

# రాయలసీమ ద్రోహి జగన్‌రెడ్డి

- ఆ ప్రాంత అభివృద్ధికి చేసింది శూన్యం
- చంద్రబాబు విజన్‌తో ప్రాజెక్టులు, పెట్టుబడులు
- టీడీపీ పోలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి

మంగళగిరి(చైతన్యరథం): రాయలసీమ బిడ్డని అని చెప్పుకునే జగన్‌రెడ్డి రాయలసీమకు తీరని ద్రోహం చేశాడని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు రెడ్డప్పగారి శ్రీనివాసరెడ్డి విరుచుకుపడ్డారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. జగన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో రాష్ట్ర పాలన అధోగతిపాలైందని విమర్శించారు. రాయలసీమ బిడ్డగా జగన్‌రెడ్డి రాయలసీమ అభివృద్ధికి చేసింది శూన్యం. పరిశ్రమలు రాకుండా చేశాడు. కడప స్టీల్ ప్లాంట్‌కు మూడు సార్లు ముఖ్య మంత్రి హోదాలో శంకుస్థాపన చేసి మమ అనిపించేశాడు. నేడు కూటమి ప్రభుత్వంలో కడప స్టీల్ ప్లాంట్ పనులు మొదలవు తున్నాయి. సాగునీటి ప్రాజెక్టులను నిర్వీర్యం చేశాడు. ఐదేళ్ల పాటు రాష్ట్రాన్ని దోచుకుని పక్క రాష్ట్రాల్లో దాచుకునేందుకు కర్నాటక వెళ్తున్నారని ధ్వజమెత్తారు.

**చంద్రబాబు విజన్‌తో సీమకు లక్షల కోట్ల పెట్టుబడులు**

జగన్‌రెడ్డి రాయలసీమ బిడ్డ కాదు..కర్నాటక బిడ్డ. తండ్రి అధి కారంలోకి రాగానే రాష్ట్రానికి వచ్చాడు. ఏపీలో తండ్రి అధికారాన్ని అడ్డంపెట్టుకుని వేల కోట్లు అక్రమంగా సంపాదించి కర్నాటకలో పెట్టుబడులు పెట్టాడు. తాను అధికారంలోకి వచ్చిన సందర్భంలో కూడా వేల కోట్లు అక్రమంగా దోపిడీ చేశాడు. ఆ డబ్బంతా కర్నా టకలో పెట్టుబడులు పెట్టాడు. జగన్‌రెడ్డి హయాంలో పరిశ్రమలు పారిపోయాయి. నేడు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌లను చూసి దేశ విదేశాల నుంచి దిగ్గజ కంపెనీలు వస్తున్నాయి. పెట్టు బడులు వస్తుంటే దానిపై సాక్షి మీడియా ద్వారా విషం చిమ్ముతు న్నాడు. 17 నెలల్లో రూ.26 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. రాష్ట్రంలో ప్రశాంతమైన వాతావరణం ఉంది. హత్యా రాజకీయా లు లేవు. గొడ్డలి వేట్లు..కత్తిపోట్లు లేవు. వైఎస్ కుటుంబసభ్యులు కూడా ధైర్యంగా రాష్ట్రంలో తిరుగుతున్నారు. రాయలసీమకు రూ. 3,50 లక్షల కోట్ల పెట్టుబడులు..1.74 లక్షల ఉద్యోగాలు ఇక్కడి యువతకు రాబోతున్నాయని తెలిపారు.

**వేగంగా సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం**

తెలుగుగంగ, హంద్రీనీవా, గాలేరు నగరి వంటి అనేక ప్రాజెక్టులు టీడీపీ ప్రభుత్వం తీసుకొచ్చినవే. రూ.3,780 కోట్లు ఖర్చు చేసి కర్నూలు నుంచి కృష్ణా నీటిని 738 కి.మీ దూరంలో ఉన్న కుప్పానికి తరలించిన ఘతన చంద్రబాబుది. ప్రాజెక్టులను వేగంగా నిర్మించి రాయలసీమ రైతాంగానికి సాగునీటి అందించే లక్ష్యంగా పనిచేస్తున్నారు. డ్రిప్ ఇరిగేషన్‌ను పునఃప్రారంభించాం. పుర్వోదయ పథకం ద్వారా రూ.44 వేల కోట్లు ఖర్చు చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రచించింది. ఉద్యాన వనాల హబ్‌గా రాయ లసీమను తీర్చిదిద్దేలా కూటమి ప్రభుత్వం పనిచేస్తుంది. పక్క రాష్ట్రంలో ఉంటూ నెలకు ఒకసారి వచ్చి ప్రెస్‌మీట్లు పెట్టి కూటమి ప్రభుత్వంపై విషం



చిమ్ముతూ ప్రజలను మరోసారి మోసం చేసేందుకు జగన్‌రెడ్డి ప్రయత్నిస్తున్నాడు. రాబోయే 15 ఏళ్ల కూటమి ప్రభుత్వమే అధికారంలో ఉంటుంది. స్వర్ణాంధ్ర సాకారం దిశగా చంద్రబాబు పాలన సాగిస్తున్నారని స్పష్టం చేశారు.


# అభివృద్ధికి ఆర్థిక గణాంకాలే నిదర్శనం

- విధ్వంసం నుంచి వికాసం వైపు ఏపీ ఆర్థిక వ్యవస్థ
- స్వర్ణాంధ్రకు బాటలు వేస్తున్న సీఎం చంద్రబాబు
- పీ-4 ఫౌండేషన్ వైస్ చైర్మన్ సి.కుటుంబరావు

మంగళగిరి (చైతన్యరథం): రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ మళ్లీ వేగం పుంజుకుంది..గత ఐదేళ్ల ఘోర విధ్వంసం నుంచి బయటపడి మళ్లీ అభివృద్ధి బాట పట్టిందనడానికి నిన్న చంద్రబాబు వెల్లడించిన ఆర్థిక గణాంకాలే నిదర్శనమని స్వర్ణాంధ్ర పీ-4 ఫౌండేషన్ వైస్ చైర్మన్ సి.కుటుంబరావు అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. 2019-2024 మధ్య జగన్ పాలనలో రాష్ట్ర జీఎస్ డీపీ రూ.7 లక్షల కోట్లకు పైగా నష్టపోయింది. ప్రతి సంవత్సరం లక్ష..లక్షన్నర కోట్లు పెరగాల్సిన జీఎస్డీపీ తగ్గిపోవడంతో రాష్ట్ర సొంత ఆదాయం లో రూ.70 వేల కోట్లకు పైగా నష్టం వాటిల్లింది. గత ప్రభుత్వం సక్రమంగా పనిచేసి ఉంటే ఈ ఐదేళ్లలో అదనంగా రూ.72 వేల కోట్లు రాష్ట్ర ఖజానాకు వచ్చేవని పేర్కొన్నారు.

**తులనాత్మకంగా ఆర్థిక పరిస్థితులు**

పక్కనే ఉన్న తెలంగాణతో పోల్చితే తేడా మరింత స్పష్టమ వుతుంది. 2014-19 మధ్య ఏపీ జీఎస్డీపీ వృద్ధి రేటు 13.21 శాతం కాగా,



తెలంగాణది 13.5 శాతం. అయితే జగన్ పాలన రాగానే 2019-24 మధ్య ఏపీ జీఎస్డీపీ వృద్ధి రేటు 9.1 శాతానికి పడిపోయింది. తెలంగాణ 11 శాతం వృద్ధితో దూసుకెళ్లింది. ఫలి తంగా తలసరి ఆదాయంలో ఏపీ రూ.2.66 లక్షల వద్దే ఉండగా, తెలంగాణ రూ.3.87 లక్షలకు చేరింది. 2014లో టీడీపీ ప్రభు త్వం రూపొందించిన 'స్వర్ణాంధ్ర విజన్-2047' ప్రకారం 2047 నాటికి రాష్ట్ర జీఎస్డీపీ 18 రెట్లు పెరిగి రూ.292 లక్షల కోట్లకు, తలసరి ఆదాయం రూ.49 లక్షలకు చేరాల్సి ఉండగా, ఐదేళ్ల జగన్ దుర్మార్గ పాలన వల్ల ఆ కల నెరవేరే అవకాశమే లేకుండా పోయిందని పేర్కొన్నారు.

**చంద్రబాబు నేతృత్వంలో ఆర్థిక పురోగతి**

చంద్రబాబు మళ్లీ అధికారంలోకి వచ్చి 18 నెలల్లోనే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టారు. వ్యవసాయ రంగంలో 34-35 శాతం జీఎస్డీపీ లక్ష్యానికి ఇప్పటికే 65 శాతం చేరుకున్నాం. మిగతా 35 శాతం రెండు క్వార్టర్లలోనే పూర్తవుతుంది. పరిశ్రమల రంగంలో 45 శాతం టార్గెట్ సాధించాం..మిగిలిన లక్ష్యాన్ని త్వరలో సాధిస్తాం. సేవల రంగం (ముఖ్యంగా ఐటీ, టూరిజం, లాజిస్టిక్స్) టార్గెట్‌ను మించి రాబోతోంది. విశాఖను ఐటీ హబ్‌గా అభివృద్ధి చేయడం, ఏపీ లాజిస్టిక్ కార్పొరేషన్‌ను స్ట్రీమ్‌లైన్ చేయడం, దేశంలోనే అతి తక్కువ లాజిస్టిక్ ఖర్చుతో పాయింట్-టు-పాయింట్ సేవలు అందించేలా ప్రణాళికలు రచిం చడం జరుగుతుందని తెలిపారు. గత ప్రభుత్వం రాష్ట్రానికి తీవ్ర నష్టం చేసింది. జల్ జీవన్ మిషన్, అమృత్, స్మార్ట్ సిటీ, పీఎం ఆవాస్, పీఎం కిసాన్, ఆయుష్మాన్ భారత్ వంటి కేంద్ర పథకా లకు రాష్ట్ర వాటా ఇవ్వకపోవడం, రెన్యూబుల్ ఎనర్జీ కంపెనీలను బ్లాక్‌మెయి ల్ చేసి పీపీఏలు రద్దు చేయడం, పారిశ్రామికవేత్తలను బెదిరించి పెట్టుబడులు పారిపోయేలా చేయడం జరిగింది. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, పాలసీ స్టెబిలిటీ పూర్తిగా కుప్పకూలాయి. కానీ చంద్రబాబు రాగానే ఆ దుస్థితి మారిపోయింది. రూ.10 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు ఆకర్షణ, గ్రీన్ ఎనర్జీలో దేశం లోనే అగ్రస్థానం, విమానయాన రంగంలో దేశంలోనే అత్యధిక వృద్ధి రేటు, గ్రానైట్ ఉత్పత్తి 50 శాతం, మైనింగ్ 12 శాతం పెరుగుదల..ఇవన్నీ కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలే. అప్పుల ఊబిలో మునిగిన రాష్ట్రాన్ని బయటపడేసి, యువతకు లక్షలాది ఉద్యోగ అవకాశాలు సృష్టిస్తూ, మూడు రంగాల్లోనూ (వ్యవసాయం-పరిశ్రమలు-సేవలు) సమతుల్య అభివృద్ధితో మళ్లీ సంపన్న రాష్ట్రంగా తీర్చిదిద్దుతూ చంద్రబాబు నాయకత్వంలో ఏపీ దేశంలోనే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. స్వర్ణాంధ్రప్రదేశ్ సాధన కు బాటలు వేస్తున్నారని తెలిపారు.

# ఏడాదిలో రాజధాని రైతుల ప్లాట్లలో వసతులు

- 13 జోన్లలో రూ.23,645 కోట్లతో పనులు
- కరకట్టకు స్వస్తి..రెండు నెలల్లో సీడ్ యాక్సిస్ రోడ్డు
- ప్రాజెక్టులకు అవసరం మేరకే ల్యాండ్ పూలింగ్
- రైతులు ప్లాట్ల రిజిస్ట్రేషన్‌కు ముందుకు రావాలి
- పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ



అమరావతి(చైతన్యరథం): రాజధాని రైతులకు కేటాయించిన ప్లాట్లలో మౌలిక వసతుల పనులు వేగంగా జరుగుతున్నాయని మంత్రి నారాయణ చెప్పారు..ఏడాదిలోగా మౌలిక వసతుల కల్పన పూర్తవుతుందని తెలిపారు. రాజధానిలో జరుగుతున్న రోడ్ల నిర్మా ణాలు, రైతుల ప్లాట్ల అభివృద్ధి పనులను అధికారులు, ఇంజినీర్లతో కలిసి మంత్రి నారాయణ పరిశీలించారు. సీడ్ యాక్సిస్ రోడ్డు పెండింగ్ నిర్మాణ పనులు, గుంటూరు ఛానల్‌పై మంగళగిరి రోడ్డును సీడ్ యాక్సిస్ రోడ్డుతో కలిపేలా నిర్మిస్తున్న స్టీల్ బ్రిడ్జి పనులను మంత్రి పరిశీలించారు. ఆ తర్వాత రాజధానిలోని వివిధ జోన్లలో జరుగుతున్న పనులను పరిశీలించి అనంతరం మీడియా తో మాట్లాడారు. రాజధాని కోసం భూములిచ్చిన రైతులకు ఇప్పటికే ప్లాట్ల కేటాయింపు తుది దశకు చేరుకుంది.. మొత్తం 29 గ్రామాల రైతులకు ఎల్పీఎస్ లే అవుట్లను 13 జోన్లుగా విభజిం చి అభివృద్ధి పనులు చేస్తున్నాం. ఆయా జోన్లలో ఇటీవల వర్షాలకు పెరిగిన జంగిల్‌ను క్లియర్ చేయించడంతో పాటు ఆయా ప్లాట్లలో మౌలిక వసతుల కల్పన వేగంగా జరుగుతుంది. ఏడాదిలోగా డ్రైనేజీలు, రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాల కల్పన పూర్తి అవుతుంది. ఆ తర్వాత మరో ఏడాదిన్నరలోగా రోడ్ల నిర్మాణాలు కూడా పూర్తవుతాయి. ఒక ఏడాది తర్వాత ఆయా ప్లాట్లు వినియో గించుకునేలా పనులు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. ఒక్క జోన్ మినహా మిగతా జోన్లలో రోడ్ నెట్ వర్క్, తుపాను నీటి కాలువలు, మురుగునీటి నెట్ వర్క్, డ్రింకింగ్ వాటర్, ఎస్టీపీలు, వంతెనల నిర్మాణం కోసం మొత్తం 23,4645.56 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు మంత్రి చెప్పారు. రైతులకు బ్యాంక్ లోన్ల జారీపై బ్యాంకర్లతో సీఎం మాట్లాడుతున్నారని మంత్రి చెప్పారు.

**త్వరలో అందుబాటులోకి సీడ్ యాక్సెస్ రోడ్డు**

ప్రస్తుతం విజయవాడ నుంచి అమరావతి రాజధానిలోకి వెళ్లాలంటే ప్రకాశం బ్యారేజీ దిగువన కొండవీటి వాగు పంపింగ్ స్టేషన్ నుంచి కరకట్ట మీదుగా సీడ్ యాక్సిస్ రోడ్డులోకి వెళ్లాల్సి వస్తుంది. ప్రస్తుతం సీడ్ యాక్సిస్ రోడ్డు పెండింగ్ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ నెలాఖరుకి సీడ్ యాక్సిస్ రోడ్డును మరి కొంతమేర అందుబాటులోకి తీసుకువచ్చి కరకట్ట ప్రయాణం తగ్గిస్తాం. ఇక ప్రకాశం బ్యారేజీ నుంచి ఉండవల్లి సెంటర్‌కు మధ్యలో సీడ్ యాక్సెస్ రోడ్డును కనెక్ట్ చేసేలా గుంటూరు ఛానల్ పై స్టీల్ బ్రిడ్జి నిర్మాణం వేగంగా జరుగుతుంది. వచ్చే ఫిబ్రవరి 15 నాటికి ఈ బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే అసలు కరకట్టతో సంబంధం లేకుండానే రాజధానిలోకి నేరుగా వెళ్లిపోవచ్చని చెప్పారు. అటు విజయవాడతో పాటు ఇటు తాడేపల్లి, మంగళగిరి నుంచి వచ్చే వారికి రాజధానిలోకి వెళ్లడం సులభం అవుతుందన్నారు.

**ప్లాట్ల రిజిస్ట్రేషన్‌కు చర్యలు**

రాజధానిలో ఇన్నర్ రింగ్ రోడ్డు, రైల్వే స్టేషన్, రైల్వే ట్రాక్, స్పోర్ట్ సిటీ కోసం భూసమీకరణ చేపడుతున్నాం. ఇంకా వేరే ప్రాజెక్టులు చేపట్టే సమయంలో అవసరమైన భూసమీకరణ చేస్తా మని స్పష్టం చేశారు. రాజధానికి భూములిచ్చిన 29,233 మంది రైతులకు 69,421 ప్లాట్లు కేటాయించాం. వీటిలో ఇప్పటివరకు 27,105 మంది రైతులకు కేటాయించిన 61,753 ప్లాట్ల రిజిస్ట్రేష న్ పూర్తయింది. ఇంకా కేవలం 2128 మంది రైతులకు చెందిన 7668 ప్లాట్లు మాత్రమే రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంది. అయితే వివిధ కారణాలతో రైతులు రిజిస్ట్రేషన్‌ను పెండింగ్ పెడుతున్నట్లు తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రిజిస్ట్రేషన్ జరిగేలా చర్యలు తీసుకున్నామన్నారు. మిగిలిపోయిన లంక భూములు, అసైన్డ్ భూములకు సంబంధించిన సమస్యలపై వచ్చే కేబినెట్‌లో చర్చించి పరిష్కరిస్తామని తెలిపారు. ఈ పర్యటనలో మంత్రి నారాయణ వెంట అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్ పర్సన్ లక్ష్మీ పార్థసారథి, సీఆర్డీఏ ఇంజినీర్ ఇన్ చీఫ్ గోపాల కృష్ణారెడ్డి, ఏడీసీ చీఫ్ ఇంజినీర్ ధనుంజయ్, ఇతర ఇంజినీర్లు, కాంట్రాక్ట్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# మిర్చి పంటకు తెగుళ్లపై అత్యవసర చర్యలు

**- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశం**



అమరావతి(చైతన్యరథం): మిర్చి పంటలో నల్ల తామర పురుగు తెగుళ్లపై వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పందించారు. తెగుళ్లకు అత్యవసర చర్యలు చేపట్టాలని ఉద్యాన శాఖ అధికారులను ఆదేశించారు. విజయవాడ క్యాంపు కార్యాలయం నుంచి ఉద్యానశాఖ డైరెక్టర్ శ్రీనివాసులుతో ఫోన్‌లో మాట్లాడి ప్రస్తుత పరిస్థితిపై పూర్తి నివేదికను అందించాలని ఆదేశించారు. పురుగు ప్రభావం ఉన్న ప్రాంతాలకు తక్షణమే శాస్త్రవేత్తలను పంపాలని ఆదేశించారు. మందుల పిచికారి, సలహాలు ఇచ్చేందుకు ప్రత్యేక బృందాలను పంపాలని సూచించారు.

## 11 నూతన ఔషధ పరిపాలనా భవనాలు

- కర్నూలు, విశాఖకు అనుబంధంగా ప్రయోగశాలలు
- వర్చువల్‌గా ప్రారంభించిన మంత్రి సత్యకుమార్
- మరో మూడు నెలల్లో అందుబాటులో స్టేట్ ల్యాబ్
- ఖాళీ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటామని వెల్లడి



అమరావతి(చైతన్యరథం): రాష్ట్రంలో రూ.11.12 కోట్ల వ్యయంతో కొత్తగా నిర్మించిన 11 నూతన ఔషధ పరిపాలనా భవనాలు, టెస్టింగ్ ల్యాబ్‌లను వైద్యఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ మంగళవారం వర్చువల్‌గా ప్రారంభించారు. మంగళగిరి వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమంలో వాటిని ప్రారంభించారు. ప్రారంభించిన వాటిలో శ్రీకాకుళం, విశాఖ, అమలాపురం, ఒంగోలు, నరసరావుపేట, కావలి, నెల్లూరు, చిత్తూరు, తిరుపతి, మదనపల్లి, కర్నూలు ఉన్నాయి. విశాఖ, కర్నూలుకు అనుబంధంగా ప్రాంతీయ ప్రయోగశాలలు ఉన్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరో మూడు నెలల్లో స్టేట్ ల్యాబ్ అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. ఔషధ నియంత్రణ పరిపాలన శాఖలో ఖాళీ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# భూ వివాద రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్

- 2027 జనవరి నాటికి రీసర్వే 2.0 పూర్తి
- ఇక నుంచి ఆలస్యం లేకుండా పాస్ పుస్తకాలు
- పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఆటో మ్యూటేషన్
- రెండు నెలల్లో ఫ్రీహోల్డ్ భూములు పరిష్కరిస్తాం
- పాస్‌పోర్ట్ సేవా కేంద్రాల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయాలు
- వారం రోజుల్లో 26 జిల్లాల్లో జేసీ పోస్టుల భర్తీ
- రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్



అమరావతి(చైతన్యరథం): ఎటువంటి భూ వివాదాలు లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని చర్యలను కూటమి ప్రభుత్వం చేపట్టినట్లు రెవెన్యూ మంత్రి అనగాని సత్య ప్రసాద్ పేర్కొన్నారు. సచివాలయం ప్రచార విభా గంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లా డుతూ రెవెన్యూ శాఖలో సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేస్తున్నామన్నారు. సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో రెవెన్యూ శాఖపై సమీక్షలో పలు నిర్ణయాలు తీసుకోవడం జరిగింద న్నారు. కృత్రిమ మేధ సహకారంతో రెవెన్యూ శాఖలో జీరో ఎర్రర్ ధ్యేయంగా ముందుకు వెళు తున్నామన్నారు. గతంలో 7,600 గ్రామాల్లో చేసిన రీ సర్వేలో జరిగిన తప్పులను ఈ ఏడా దిన్నర కాలంలో సరిదిద్దామన్నారు. రీ సర్వే 2.0ను 2027 జనవరి నాటికి కల్లా పూర్తి చేయాలని నిర్ణయించడం జరిగిందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో రీ సర్వే ప్రహసనంలా మార్చారని, ఆ సమస్యలన్నీ పరిష్కరించుకుంటూ ముందుకు వెళు తున్నామన్నారు. అర్బన్, గ్రామీణ ప్రాంతాల్లో ఆటో మ్యూటేషన్ ప్రారంభించామని, గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికే 1.74 లక్షల ఆటో మ్యూటేషన్లు నమోదు అయినట్లు తెలిపా రు. భూమి రిజిస్ట్రేషన్ జరిగిన వెంటనే ఆన్‌లైన్‌లో ఆటో మ్యూటేషన్ జరిగి ఆయా డాక్యుమెంట్లు రిజిస్టర్ పోస్టులో సదరు భూ యజమానికి చేరే విధంగా కార్యాచరణ రూపకల్పన చేశా మన్నారు. కొత్త పాస్‌పుస్తకాల జారీలో టెండర్ నిబంధనల కారణంగా ఆలస్యం అవుతుందన్న ఆయన.. ఇక నుంచి త్వరగా పాస్ పుస్తకాలు జారీ చేసేలా ముఖ్యమంత్రి ఆదేశించినట్లు మంత్రి తెలిపారు.

వారంలో 26 జిల్లాల్లో జేసీ పోస్టుల భర్తీ ప్రత్యేకంగా రెవెన్యూ సమస్యల పరిష్కారానికి రాష్ట్రంలోని 26 జిల్లాల్లో ఖాళీగా ఉన్న జేసీ పోస్టులను వారంరోజుల్లో భర్తీ చేయనున్నట్లు తెలిపారు. రెవెన్యూ సమస్యలను ఏడాది కాలవ్యవధి లోగా పూర్తిగా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్లపై బాధ్యత పెడుతున్నామని చెప్పారు. ఈ ఏడాది కాలం పాటు వీరు రెవెన్యూ సమస్యల పరిష్కారంపైనే పని చేస్తారని చెప్పారు. 22ఏ జాబితాను క్లారిఫై చేసి ప్రభుత్వం, కోర్టులు జరిపిన వేలంలో కొనుకున్న భూములను ఆ జాబితా నుంచి తొలగి స్తామని చెప్పారు. ఫ్రీహోల్డ్ భూముల రాష్ట్రంలో 36 లక్షల ఎకరాలు ఉండాలని, అయితే నేడు లెక్కలోకి వస్తుంది కేవలం 11 లక్షల ఎకరాలు మాత్రమే అని అన్నారు. రెండు నెలల్లో ఫ్రీహోల్డ్ భూముల సమస్యలను ఖచ్చితంగా పరిష్కరిస్తామని తెలిపారు. పేదలకు మంచి చేసే ప్రభుత్వం కూటమి ప్రభుత్వ మని చెప్పారు. కుల ధృవీకరణ పత్రాలు ఆధార్‌తో అనుసం ధానం చేస్తున్నామన్నారు. 2.77 కోట్ల కుల ధృవీకరణ పత్రాలు ఇప్పటివరకు జారీ చేయడం జరిగిందన్నారు. పీజీఆర్ఎస్ ద్వారా వచ్చిన దరఖాస్తుల్లో 86 శాతం పరిష్కరించామని, మిగి లిన 14 శాతం త్వరలో పరిష్కరిస్తామన్నారు. ప్రతి గురువారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వ హించి భూ సమస్యల పరిష్కార దిశగా పనిచేస్తున్నామన్నారు. ఈనాం భూముల పరిష్కారానికి రెవెన్యూ, ఎండోమెంట్ శాఖలు సమన్వయంతో పనిచేసి 45 రోజుల్లోనే నివేదిక ఇవ్వాలని ఆదే శించామని తెలిపారు. రెవెన్యూ శాఖలో ప్రతి సమస్యను పరిష్క రించాలన్న ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు నిబద్ధతతో పనిచేస్తున్నామన్నారు. ఇక రిజిస్ట్రేషన్ శాఖను ప్రక్షాళన చేయా ల్సిన అవసరం ఉందన్నారు. దేశంలోని పలు రాష్ట్రాలతో పాటు ఇతర దేశాల్లో అమలు చేయబడుతున్న రిజిస్ట్రేషన్ విధానాలను అధ్యయనం చేసి అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా రిజిస్ట్రేషన్ శాఖను ప్రక్షాళన చేయనున్నామని తెలిపారు. పాస్‌పోర్ట్ సేవా కేంద్రాల వలే రిజిస్ట్రేషన్ కార్యాలయాల ఏర్పా టుపై సమాలోచన చేస్తున్నామన్నారు. భూ యజమానులందరూ జాయింట్ ఎల్పీఎమ్‌లను వెంటనే సబ్ డివిజన్ చేయించుకోవా లని కోరారు. రాష్ట్రంలో 2 లక్షల జాయింట్ ఎల్పీఎంఎస్‌లు ఉన్నాయని, వారిలో అవగాహన పెంచాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు.

# గ్రామాల అభివృద్ధికై ఐక్యంగా ప్రత్యేక కార్యాచరణ

**●ప్రతి కుటుంబానికి సుపరిపాలన అందిద్దాం**

**●వారి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక నివేదికలు సిద్ధం చేయండి**

**●పెదపాడు మండల విస్తృత స్థాయి సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్**



పెదపాడు (చైతన్యరథం): గ్రామాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికి ఉచిత ఇంటి స్థలం మంజూరు చేయటంతో పాటు సంక్షేమ పథకాల అమలులో ఎదురయ్యే సాంకేతిక సమస్యలను సత్వరమే పరిష్కరించేలా స్థానిక కూటమి నాయకులు, సంబంధిత అధికారులు ప్రత్యేక కృషి చేయాలని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సూచించారు. పెదపాడు మండలం అప్పన్న వీడులో మంగళవారం ఉదయం పెదపాడు మండల విస్తృతస్థాయి సమీక్ష సమావేశం ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పెదపాడు మండలానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెదపాడు మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సుదీర్ఘంగా చర్చించి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలంటే సంబంధిత అధికారులకు తక్షణమే ఆదేశాలు జారీ చేశారు. తల్లికి వందనం పథకం డబ్బులు ఇంకా జమ కాని తల్లుల వివరాలను ప్రత్యేక నివేదికలు సిద్ధం చేసి విద్యాశాఖ ఉన్నతాధికారులకు వెంటనే నివేదికను సమర్పించాలని, సత్వరమే ఆయా తల్లులకు కూడా తల్లికి వందనం డబ్బులు జమ అయ్యేలా చర్యలు చేపట్టాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. గ్రామాల్లో రోడ్లు, డ్రెయిన్లు మాత్రమే కాకుండా స్మశానాల అభివృద్ధికి సైతం అవసరమైన చర్యలు చేపట్టాలని కనీస మౌలిక సదుపాయాలు కూడా లేని స్మశానాలపై ప్రత్యేక నివేదికలు సిద్ధం చేసి సమర్పించాలని అధికారులకు సూచించారు. సొంత ఇల్లు లేని పేదలు ఎంతమంది ఉన్నారు వారికి కావలసిన అర్హత ప్రమాణాలను సిద్ధం చేసి ఏఏ గ్రామాల్లో ఎంతమందికి ఎన్ని ఇళ్లు అవసరం ఉందో గ్రామాల వారీగా నివేదికలను సిద్ధం చేసి సమర్పించాలని అధికారులను సూచించారు. పెదపాడు మండలంలోని పలు గ్రామాల్లో అమలవుతున్న అభివృద్ధి సంక్షేమ పనులు తీరును ఆయా శాఖల అధికారులతో స్థానిక కోటమి నాయకులతో చర్చించి సమీక్షించారు. కూటమి ప్రభుత్వంపై ఎంతో నమ్మకం పెట్టుకుని అధికారాన్ని అప్పగించిన ప్రజల సంక్షేమానికి క్షేత్రస్థాయిలోని మండల స్థాయి నాయకులు నుంచి బూత్ కన్వీనర్లు వరకు ప్రతి ఒక్కరు కూడా ప్రజలకు అండగా నిలుస్తూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, అధికారులు కూడా ప్రజా సమస్యల పరిష్కారానికి సత్వరమే చొరవ చూపాలని, ఏదైనా అపరిష్కృత సమస్యలు ఉన్నప్పుడు నేరుగా తన దృష్టి తీసుకొస్తే పరిష్కరించి అండగా నిలుస్తానని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఏఐ నైపుణ్యాలు... ఎంపీ పుట్టా మహేష్ చొరవతో రూ.2.5 కోట్ల సిఎస్ఆర్ నిధులు



ఏలూరు/ఢిల్లీ (చైతన్యరథం): ఏలూరు పార్లమెంటు నియోజకవర్గంలోని యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో జిల్లాకు పరిశ్రమలు తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్న ఎంపీ పుట్టా మహేష్ కుమార్, విద్యార్థి దశలోనే యువతకు ఏఐ నైపుణ్యాలు అందించేందుకు కూడా నడుం బిగించారు. ఏలూరు పార్లమెంట్ పరిధిలో ఎంపిక చేసిన ఉన్న 7 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, 4 ప్రభుత్వ పాఠశాలలో ఏఐ కంప్యూటర్ ల్యాబులు ఏర్పాటు చేయించే కార్యక్రమం ప్రారంభించారు. ఈ 11 కాలేజీలు/పాఠశాలల్లో ఏఐ కంప్యూటర్ ల్యాబులు ఏర్పాటు చేసేందుకు అయ్యే ఖర్చును భరించవలసిందిగా ఓఎన్జీసీ సంస్థతో మాట్లాడి ఒప్పించారు. ఎంపీ పుట్టా మహేష్ కుమార్ విజ్ఞప్తి మేరకు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (CSR) కింద ఏఐ కంప్యూటర్ ల్యాబుల ఏర్పాటు కోసం రూ. 2.5 కోట్లు ఇచ్చేందుకు ఓఎన్జీసీ సంస్థ అంగీకరించింది. దీనితో ఆర్గనైజేషన్ ఫర్ రూరల్ రీ కన్స్ట్రక్షన్ అనే స్వచ్ఛంద సంస్థ సహకారంతో 11 కాలేజీలు/పాఠశాలల్లో ఏఐ కంప్యూటర్ ల్యాబులు ఏర్పాటు ప్రక్రియను ప్రారంభించారు. ఇందులో భాగంగా ఏలూరు, జంగారెడ్డిగూడెం, కామవరపుకోట, కైకలూరు, చింతలపూడి, బుట్టాయిగూడెం, నారాయణపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, ఏలూరు, బుట్టాయిగూడెం, జంగారెడ్డిగూడెం, రాజవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో వచ్చే జనవరి నాటికి ఏఐ కంప్యూటర్ ల్యాబులు ఏర్పాటు కానున్నాయి. ఈ సందర్భంగా ఒక ప్రకటన విడుదల చేసిన ఎంపీ పుట్టా మహేష్ కుమార్.. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఐటీ విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ విజన్‌కు అనుగుణంగా, ఏలూరు పార్లమెంటు పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (AI) నైపుణ్యాలు నేర్పించి వారికి ఉన్నతమైన భవిష్యత్తు కల్పించేందుకు తన వంతు కృషి చేస్తున్నానని చెప్పారు. ఇందులో భాగంగా మొదటి దశలో 7 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, 4 ప్రభుత్వ పాఠశాలలో ఏఐ కంప్యూటర్ ల్యాబులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఏఐ కంప్యూటర్ ల్యాబ్‌ల వల్ల కళాశాల/పాఠశాలల్లో చదువుతున్న సుమారు 3000 మంది విద్యార్థులకు భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఏఐ సంబంధిత నైపుణ్యం నేర్చుకుని, తద్వారా ఉన్నతమైన ఉద్యోగాలు పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. అంతే కాకుండా అదే కళాశాల/ పాఠశాలలో చదివి, ఏఐ పట్ల ఆసక్తి ఉన్న పూర్వ విద్యార్థులకు కూడా స్కిల్ డెవలప్మెంట్‌లో భాగంగా ఏఐ నైపుణ్యాన్ని నేర్పిస్తూ వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. జిల్లా అభివృద్ధి కోసం కేవలం ప్రభుత్వ నిధులపైనే ఆధారపడకుండా వివిధ కార్పొరేట్ సంస్థలు, ప్రభుత్వరంగ సంస్థలను సంప్రదిస్తూ నిధులు తీసుకువస్తున్న ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌కు ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

# సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి



రాజమహేంద్రవరం (చైతన్యరథం): నగరంలోని 40వ డివిజన్ సీతంపేట మూలగొయ్యి ప్రాంతంలో జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకలకు రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రైస్తవులందరికి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. క్రిస్మస్ అంటే కేవలం ఒక పండుగ మాత్రమే కాదు, అది ప్రేమ, శాంతి మరియు ఆశలకు ప్రతీక అని అన్నారు. ఈ రోజు, మనం యేసుక్రీస్తు జననాన్ని జరుపుకుంటామని ఆయన మనకు శాంతిని, ప్రేమను, కరుణను చూపించారని అన్నారు. యేసుక్రీస్తు మనందరినీ రక్షించడానికి ఈ లోకంలోకి వచ్చారని... ఆయన మనకు చూపిన దయ, ప్రేమకు కృతజ్ఞతలు తెలుపుకుందామన్నారు. ఈ పవిత్రమైన సమయంలో, మనం ఒకరికొకరం సహాయం చేసుకుంటూ, ప్రేమను పంచుకుందామని పిలుపునిచ్చారు. అందరికీ మరోసారి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

# నెలరోజుల పాటు మంగళగిరి ప్రీమియర్ లీగ్

**●డిసెంబర్ 21వ తేదీ నుంచి జనవరి 21వ తేదీ వరకు క్రికెట్ ట్రోర్నమెంట్**




మంగళగిరి (చైతన్యరథం): జనవరి 23న రాష్ట్ర ఐటీ విద్యా శాఖల మంత్రి, మంగళగిరి శాసన సభ్యులు నారా లోకేష్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళగిరి పట్టణంలోని నారా లోకేష్ క్రీడా ప్రాంగణం(బోగి ఎస్టేట్స్)లో డిసెంబర్ 21 తేదీ నుంచి జనవరి 21వ తేదీ వరకు మంగళగిరి ప్రీమియర్ లీగ్-4 క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. ఈ టోర్నమెంట్ కు 128 క్రికెట్ జట్లు నమోదు చేసుకోగా ఆ జట్లకు టీడీపీ కార్యాలయం ఎమ్మెస్సెస్ భవన్ లో మంగళవారం సాయంత్రం మొదటి రౌండ్ డ్రా తీసి పోటీ పడనున్న జట్ల యొక్క వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య మాట్లాడుతూ ఈవెంట్ స్పాన్సర్లగా సాయి పావని కన్స్ట్రక్షన్స్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్, బిజ్ 51, సోనోవిజన్, హోటల్ డి దేవ్, మెడ్ స్టార్ హాస్పటల్స్ తాడేపల్లి, సిగ్నేచర్ డైన్, హైపర్ ప్యాక్ ప్రైవేట్ లిమిటెడ్, కోకోకోలా, వీ వైబ్ ఈవెంట్స్ వ్యవహరిస్తాయన్నారు. ప్రతి మ్యాచ్‌ను గోపి టీవి యూట్యూబ్ ఛానల్, వి డిజిటల్ ద్వారా ప్రత్యక్ష ప్రచారం అందించడం జరుగుతుందని చెప్పారు. ప్రీమియర్ లీగ్, సిజన్-4 పోటీలలో ప్రథమ బహుమతి కింద రూ 3 లక్షలు మంగళాద్రి డెవెలపర్స్, ద్వితీయ బహుమతి కింద రూ 2 లక్షలు మంచికలపూడి వైష్ణవి, తృతీయ బహుమతి కింద రూ. లక్ష నగదును వెలగపూడి కిషోర్ సహకారంతో బహుమతులు ప్రధానం చేస్తారన్నారు. అలాగే ప్రతి మ్యాచ్‌కి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ రూ. 3 వేలు జవ్వాది కిరణ్ చందు, ప్రతి మ్యాచ్ టాస్ విన్నర్‌కు సిల్వర్ కాయిన్ అలాగే ఫైనాల్ మ్యాచ్ టాస్ విన్నర్‌కు గోల్డ్ కాయిన్ రేవతి జ్యూయలరీ, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ కింద ఎలక్ట్రానిక్ బైక్ వల్లభనేని భార్గవ్, బ్యాట్స్ మెన్ ఆఫ్ ది సిరీస్ రూ. 25 వేలుతో పాటు బైసైకిల్ కాసరనేని జస్వంత్, బౌలర్ ఆఫ్ ది సిరీస్ రూ. 25 వేలుతో పాటు బైసైకిల్ గుత్తా కిషోర్, ఫీల్డర్ ఆఫ్ ది సిరీస్ రూ. 25 వేలతో పాటు బైసైకిల్ తాడిబోయిన మహేష్, వికెట్ కీఫర్ ఆఫ్ ది సిరీస్ రూ. 25 వేలుతో పాటు బైసైకిల్ షేక్ ఇంతియాజ్‌లు అందించనున్నట్లు తెలిపారు. మ్యాచ్‌లో పాల్గొన్న క్రీడాకారులకు టీ షర్ట్స్, ట్రాక్స్ అందించడం జరుగుతుందని చెప్పారు. నియోజకవర్గంలో క్రీడాకారులను ప్రోత్సహించాలన్న ఉద్దేశ్యంతో నారా లోకేష్ తాడేపల్లి టౌన్, మంగళగిరి టౌన్ లో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేయడంతో పాటు వాలీబాల్, క్రికెట్ టోర్నమెంట్లను నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. గెలుపు ఓటమిలతో సంబంధం లేకుండా స్నేహ పూర్వకంగా పోటీల్లో పాల్గొనాలని క్రీడాకారులకు నందం అబద్దయ్య సూచించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య నాయకులు, స్పాన్సర్లు, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కృషితో..... గుడివాడలో ప్రధాన రహదారుల సమస్యలు పరిష్కారం



గుడివాడ (చైతన్యరథం): గత 20 ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని గుడివాడలో శూన్యం నుండి కూటమి ప్రభుత్వం అభివృద్ధి పనులు చేపడుతుందని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. ముందుగా ప్రధాన సమస్యలు పరిష్కరిస్తున్నామని పేర్కొన్న ఎమ్మెల్యే రాము.... ప్రజల సమస్యలన్నిటిని పరిష్కరించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నానని అన్నారు. గుడివాడ పట్టణంలోని ప్రధాన రహదారుల్లో ఒకటైన గౌరీ శంకరపురంలోని కార్ల స్టాండ్ రోడ్డు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే రాము మంగళవారం ఉదయం ప్రారంభించారు. ఈ సందర్భంగా సి ఆర్ డి ఏ నిధులు రూ.99.09 లక్షలతో చేపట్టనున్న బీటి రోడ్డు, నూతన డ్రైనేజీ నిర్మాణ పనులకు కూటమినేతలతో కలిసి ఎమ్మెల్యే రాము పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం కార్ల స్టాండ్ వద్ద నుండి చిన్న శివాలయం వరకు పరిసరాలు పరిశీలించిన ఎమ్మెల్యే రాము.... ఆక్రమణల కారణంగా డ్రైనేజీ పూడిక పోవడాన్నీ గుర్తించారు. పూర్తి నాణ్యతతో రోడ్లు, డ్రైనేజీ పనులు చేపట్టాలని అధికారులకు ఎమ్మెల్యే రాము సూచించారు. అనంతరం ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ.... గత కొన్ని దశాబ్దాలుగా అభివృద్ధికి దూరంగా ఉన్న మేజర్ రోడ్ల పనులను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ప్రధాన రహదారులు పనులు పూర్తి అయిన తర్వాత అంతర్గత రహదారులను కూడా వేస్తామని ప్రజలు అపోహలకు పోవద్దన్నారు. గుడివాడ అభివృద్ధికి శ్రీకారం చుట్టి ప్రణాళిక బద్ధంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరి సమస్యను పరిష్కారానికి ప్రయత్నిస్తున్నామని, కానీ ఒక్కసారిగా మార్పు తీసుకురావడం సాధ్యం కాదని ఎమ్మెల్యే రాము స్పష్టం చేశారు. అందరి సహకారంతో గుడివాడలో ప్రజలందరి సమస్యలు పరిష్కరించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము పునరుద్ఘాటించారు.

## రైతులు పండించిన ధాన్యం పూర్తిగా కొనుగోలు చేస్తాం

◆రైతుల్ని ఇబ్బంది పెట్టవద్దు... అధికారులకు ఎమ్మెల్యే యార్లగడ్డ సూచన



గన్నవరం (చైతన్యరథం): రైతుల వద్ద ఉన్న ధాన్యం చివరి గింజ వరకు మద్దతు ధరకే ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు రైతులకు భరోసా ఇచ్చారు. మంగళవారం సాయంత్రం గన్నవరం మండలం పురుషోత్తపట్నం గ్రామంలోని రైతు సేవా కేంద్రాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడి రైతు సేవా కేంద్రం ద్వారా కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను, రైతులకు ధాన్యం చెల్లింపులను ఆయన పరిశీలించారు. అనంతరం గ్రామంలోని లక్ష్మీ మారుతి రైస్ మిల్లును సందర్శించి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ గత నెలలో వచ్చిన మొంథా, దిత్వా తుఫాన్ ల కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని, తుఫాన్ భారీ నుండి పంటను రక్షించుకునేందుకు యంత్రాల సాయంతో వరి కోతలు పూర్తి చేసారని యంత్రాలతో కోసిన ధాన్యంలో తేమ శాతం అధికంగా ఉంటుందన్నారు. రైతులు దాన్యాన్ని పూర్తిగా ఎండబెట్టాలని తేమశాతం 17 లోపు వచ్చే వరకు ఆరబెట్టాలని సూచించారు. 17 లోపు తేమశాతం ఉంటే ప్రభుత్వ మద్దతు ధర బస్తాకి రూ. 1777లు వస్తుందన్నారు. బాపులపాడు మండలంలో 32,693 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాల్సి ఉండగా ఇప్పటివరకు 4,855 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామన్నారు. గన్నవరం మండలంలో 31,316 మెట్రిక్ టన్నుల ధాన్యానికి గాను 6,945 మెట్రిక్ టన్నులు, ఉంగుటూరు మండలంలో 69,470 మెట్రిక్ టన్నులకు గాను 18,968 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం సేకరించినట్లు యార్లగడ్డ వివరించారు.

## పైప్ లైన్ల పునరుద్ధరణ సర్వేలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య



జగ్గయ్యపేట (చైతన్యరథం): పట్టణ ప్రజలకు భవిష్యత్తులోనూ ఎలాంటి నీటి కొరత రాకుండా, దృఢమైన కృష్ణా జలాల సరఫరాను మరింత మెరుగుపరచడానికి స్థానిక నాయకత్వం పటిష్టమైన చర్యలు చేపట్టింది. అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్ ద్వారా మంజూరైన నిధులతో పట్టణంలోని ప్రధాన పైప్‌లైన్లు మరియు నీటి పంపిణీ వ్యవస్థ పునరుద్ధరణ కోసం రూ.84 కోట్ల రూపాయలను కేటాయించడం జరిగింది. ఈ ప్రతిష్ఠాత్మక పనులు వచ్చే సంవత్సరం జనవరి రెండో వారం (సంక్రాంతి పండుగ) నుండి యుద్ధప్రాతిపదికన ప్రారంభమవుతాయని జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య తెలిపారు. మంగళవారం ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర ఇంజనీరింగ్ అధికారులు, కౌన్సిలర్లతో కలిసి పట్టణంలోని మంచినీటి హెడ్ వాటర్ వర్క్స్, అలాగే దాదాపు 60 సంవత్సరాల కిందటి శిథిలమైన పైప్‌లైన్లు మార్చాల్సిన మార్గాలు, కొత్త ట్యాంకులు నిర్మించాల్సిన స్థలాలను పరిశీలించారు. ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య మాట్లాడుతూ... ప్రజల ఆరోగ్యం, దాహార్తిని తీర్చడమే మా ప్రధాన లక్ష్యమని, జగ్గయ్యపేట పట్టణంలో ఇప్పటివరకు ప్రజలకు నిరంతరాయంగా మంచినీటి సరఫరా అందుతూనే ఉంది. అయితే, రాబోయే 50 ఏళ్లకు సరిపడా నీటి సరఫరా వ్యవస్థను పటిష్టం చేయాలనే లక్ష్యంతో తాము ఈ చారిత్రక ప్రాజెక్టును మొదలుపెడుతున్నామని తెలిపారు. ఇంజనీర్లు నాణ్యత విషయంలో రాజీ పడకూడదని, పారదర్శకత, వేగం ఈ ప్రాజెక్టులో కీలకమన్నారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా, నిర్దేశించిన గడువులోగా పనులను పూర్తి చేయాలని, ఎక్కడ లోపం వచ్చినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హెచ్చరించారు.

## వచ్చే మూడేళ్లలో ప్రతిగ్రామానికి తారు రోడ్ల నిర్మాణం: జీవీ ఆంజనేయులు



వినుకొండ (చైతన్యరథం): రాష్ట్రంలో వచ్చే అయిదేళ్లలో ప్రతి పల్లెకు తారు రోడ్ల నిర్మాణమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తోందన్నారు వినుకొండ ఎమ్మెల్యే, చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు. అలానే ప్రతిఊరిలో సీసీ రోడ్లు, డ్రైయినేజీల నిర్మాణం పూర్తి చేస్తామని, విజన్ 2047లో భాగంగా రాష్ట్ర ప్రజల తలసరి ఆదాయం రూ.55లక్షలకు, జీఎస్డీపీ వృద్ధిని 17.11శాతానికి పెంచడంలో అది ఎంతో కీలకమన్నారు. వినుకొండ నియోజకవర్గంలో అందుగుల కొత్తపాలెం వద్ద రూ.15.83 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. పనుల పురోగతిని, నిర్మాణ నాణ్యతను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ గ్రామాల ఆర్థిక స్థితిగతులు పెంచాలంటే రోడ్లు, బ్రిడ్జిలు చాలా అవసరం అన్నారు. అవి వస్తే పండిన పంటలు మార్కెట్కు తీసుకుని వెళ్లి, గిట్టుబాటు ధరలు తెచ్చుకునేందుకు అవకాశం లభిస్తుందని, ప్రయాణ దూరాలు కూడా తగ్గుతాయన్నారు. అందుగుల కొత్తపాలెం, పాత నాగిరెడ్డిపల్లె మధ్య ఉన్న బ్రిడ్జితో పాటు పువ్వాడ వద్ద నిర్మిస్తున్న మరో బ్రిడ్జితో ప్రకాశం, పల్నాడు జిల్లా అనుసంధానం పెరుగుతుందన్నారు. అరాచకం, దోపిడీ తప్ప అభివృద్ధి పట్టని గత ప్రభుత్వంలో అడుగుకో గుంత, గజానికో గొయ్యి ఉండేదని, కూటమి ప్రభుత్వంలో ఆ దుస్థితి మార్చుతున్నామన్నారు. ఇప్పటికే 20వేల కి.మీ. గుంతలు పూడ్చి రోడ్లు బాగు చేశామని, గ్రామాలకు కొత్తరోడ్లు కూడా వేస్తున్నామన్నారు. పల్లెపండుగ పేరుతో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రూ.4,500కోట్ల తో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నారని తెలిపా రు. అదికాక రూ. 2,123కోట్లతో 12999గ్రామాలను కలపడానికి 4,700 కిమీ పొడవైన రోడ్లు అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. కేంద్రప్రభుత్వం ఇచ్చిన సాస్కీ పథకం ద్వారా తొలిసారి నిధులు తీసుకుని వస్తున్నట్లు వెల్లడించారు. జగన్ చేసిన రూ.10లక్షల కోట్ల అప్పుల్లోనూ చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలు సూపర్ సిక్స్ చేశారని, ఇలాంటి ప్రభుత్వం మరో 20–25 ఏళ్లు ఉంటే ఆంధ్రప్రదేశ్ కూడా గుజరాత్ తరహాలో అభివృద్ధిలో దూసుకు వెళ్తుందన్నారు.

# నిబంధనల పేరిట రైతుల్ని నష్టపరిస్తే ఎలా?

◆సీసీఐ కొనుగోలు కేంద్రాన్నితనిఖీ చేసి, రైతులతో మాట్లాడిన మాజీమంత్రి ప్రత్తిపాటి



చిలకలూరిపేట (చైతన్యరథం): సీసీఐ కొనుగోళ్లపై పత్తి రైతులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, ఎంతో కష్టపడి పత్తిని తీసుకొస్తే నిబంధనల పేరిట వెనక్కి పంపడం న్యాయం కాదని, నాణ్యత తక్కువ ఉన్న పత్తికి కూగా తగిన ధర నిర్ణయించి కొనుగోలు జరిపి రైతులకు న్యాయం చేయాలని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు సీసీఐ, మార్కెటింగ్ అధికారులకు సూచించారు. నాదెండ్ల మండలం గణపవరంలోని వెంకటకృష్ణ ఎంటర్ ప్రైజెస్‌లో ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ప్రత్తిపాటి తనిఖీచేశారు. రైతులతో మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకున్న ప్రత్తిపాటి.. అనంతరం సీసీఐ, వ్యవసాయ అధికారులతో మాట్లాడారు. రైతులకు న్యాయం జరిగేలా చూడాలని, పట్టువిడుపులతో వ్యవహరించి వారిని ఆదుకోవాలని ప్రత్తిపాటి సీసీఐ అధికారుల్ని కోరారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు.

**కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన పత్తిని వెనక్కు తీసుకెళ్లడం ఎంత కష్టమో ఆలోచించాలి**

మొంథా తుపాన్ వల్ల, అధికవర్షాల వల్ల పత్తి నాణ్యతలో 5 శాతం తేడా వచ్చిందని, దాంతో గుడ్డికాయ ఎక్కువగా ఉన్నపత్తిని తీసేసి, మంచి పత్తికి తగిన ధర ఇవ్వాలని రైతులు కోరుతున్నారని, కానీ సీసీఐ ఆదేశాలు అలా లేవని అధికారులు చెబుతున్నారని ప్రత్తిపాటి తెలిపారు. దూరాభారం నుంచి కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన పత్తిని మరలా వెనక్కు తీసుకెళ్లాలంటే ఏ రైతుకైనా ఇబ్బందేనన్న ప్రత్తిపాటి.. ధర తగ్గించి,.. నాణ్యతలేని సరుకును మినహాయించి అయినా రైతులకు న్యాయం చేయాలన్నారు. రైతులు కూడా ఇదే అభిప్రాయంతో ఉన్నారని ప్రత్తిపాటి చెప్పారు.

**జీఎంతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని కలెక్టర్ చెప్పారు**

సమస్య తీవ్రత.. రైతాంగం ఇబ్బందుల దృష్ట్యా వెంటనే కలెక్టర్‌తో మాట్లాడగా, వారు కూడా గుడ్డికాయ ఉన్న పత్తిని మినహాయించి మిగిలిన దాన్ని మంచి ధరకు తీసుకోవాలని బయ్యర్లకు సూచించారని ప్రత్తిపాటి చెప్పారు. స్లాట్ రిజర్వేషన్ సమస్యను పరిష్కరించాలని కలెక్టర్ ను కోరినట్టు ప్రత్తిపాటి చెప్పారు. రైతుల కష్టాలు, తన సూచనలపై సీసీఐ జీఎంతో మాట్లాడతానని, నిబంధనలు సడలించేలా చూస్తానని కలెక్టర్ తెలిపినట్టు ప్రత్తిపాటి చెప్పారు.

**పత్తి కొనుగోళ్లలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యల్ని ముఖ్యమంత్రి, వ్యవసాయ మంత్రి దృష్టికి తీసుకెళతానన్న**

ఎంత పత్తిని కొనుగోలు చేసినా రైతు కష్టం.. నష్టం భరించలేనిది..ఎవరూ పూడ్చలేనిదన్న ప్రత్తిపాటి.. స్లాట్ రిజర్వేషన్ పరిమితిని పెంచాలని అధికారులకు సూచించామన్నారు.30 శాతం కొనుగోళ్ల పరిమితి పెంచితే 1200 క్వింటాళ్ల వరకు కొనుగోలు చేయవచ్చన్నారు. ఒక క్వింటాల్ కు ఎంత గుడ్డికాయ ఉంటుం దో లెక్కించి, దానికి అనుగుణంగా కొనుగోళ్లు చేపట్టేలా చూడాలని సీసీఐ అధికారుల్ని, బయ్యర్లను కోరడం జరిగిందన్నారు. సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడుల దృష్టికి తీసుకెళ్లి, సీసీఐ అధికారులతో సమావేశం ఏర్పాటు చేయించి.. రైతుల సమస్యలకు పరిష్కారం లభించేలా చూస్తామని ప్రత్తిపాటి హామీ ఇచ్చారు.

## కార్యకర్తలే పార్టీకి అసలైన అస్తి : ఎమ్మెల్యే నసీర్

గుంటూరు (చైతన్యరథం): టీడీపీకి కార్యకర్తలే నిధి అని వారి కుటుంబాలకు తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. మంగళవారం గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని టీడీపీ కార్యకర్తల కుటుంబాలను వారి నివాసాలకు వెళ్లి ఎమ్మెల్యే నసీర్ స్వయంగా పరామర్శించారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో 51వ డివిజన్ కు చెందిన షేక్ రఫీ తల్లి మరణించడంతో వారి నివాసానికి వెళ్లి నివాళులర్పించారు. అనంతరం అనారోగ్యానికి గురైన తెలుగుదేశం పార్టీకి చెందిన పాటిబండ్ల బలరాం తల్లి, లోకేష్ తండ్రిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే సైనికులని చెప్పారు. తెలుగుదేశం పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు కార్యకర్తలు తమ భుజస్కందాలపై నిలుపుకొని పార్టీని కాపాడారని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేష్ ఆధ్వర్యంలో కార్యకర్తలకు ప్రత్యేక గుర్తింపు ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నందిగామ అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు

◆వెల్లడించిన ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



నందిగామ (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ శాఖ నుంచి నందిగామ నియోజకవర్గంలో రహదారి నిర్మాణానికి రూ.8 కోట్ల 70 లక్షల రూపాయల నిధులు మంజూరు చేసినట్లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మంగళవారం నాడు తమ కార్యాలయంలో ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నిధుల మంజూరుకు సంబంధించిన జీవో విడుదల కావడంతో నియోజకవర్గ అభివృద్ధికి మరొక పెద్ద అడుగు పడిందని ఆమె అన్నారు. చందర్లపాడు – తుర్లపాడు రోడ్ అభివృద్ధికి రూ.3.84 కోట్లు, CAD R&B నుండి చెరువుకొమ్ముపాలెం గ్రామం వరకు రహదారి నిర్మాణానికి రూ.3.71 కోట్లు, నరసింహారావుపాలెం రోడ్డుకు రూ. 1.15 కోట్లు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. ఈ నిధుల మంజూరు ద్వారా మూడు మండలాల్లో ప్రయాణ సౌకర్యాలు మెరుగుపడటమే కాకుండా, ప్రజలకు రవాణా సౌకర్యాలు, వ్యవసాయ, వ్యాపార వాణిజ్యానికి కూడా మరింత ఊతం లభించనున్నట్లు ఎమ్మెల్యే సౌమ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడికి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కి, మంత్రి నారా లోకేష్‌కి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఆర్థిక సంక్షోభం ఉన్నప్పటికీ ప్రజల అభివృద్ధికే ప్రాధాన్యతనిస్తూ కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, అభివృద్ధి పరంగా ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా ప్రభుత్వం నిబద్ధతతో ముందుకు సాగుతోందని ఆమె పునరుద్ఘాటించారు.

# అమరావతి బాలోత్సవంలో అదరగొట్టిన పిల్లలు

**• విద్యార్థుల కేరింతలతో దద్దరిల్లిన సిద్ధార్థ ప్రాంగణం... ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి కందుల**

విజయవాడలో 'అమరావతి బాలోత్సవం' అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. చదువుల ఒత్తిడిని పక్కనపెట్టి చిన్నారులు పండగ చేసుకున్నారు. సిద్ధార్థ కళాశాల ప్రాంగణం వేలాది మంది విద్యార్థుల కేరింతలతో కిక్కిరిసిపోయింది. 'మేము కేవలం చదువులకే పరిమితం కాదు, ఏ రంగంలోనైనా తగ్గేదే లేదు' అంటూ విద్యార్థులు తమ ప్రతిభను చాటిచెప్పారు. మొదటి రోజు పదుల సంఖ్యలో ప్రదర్శనలు జరిగాయి. ఈ ఏడాది 'పర్యావరణాన్ని కాపాడుకుందాం' అనే ప్రత్యేక థీమ్‌తో ఈ వేడుకలను నిర్వహిస్తున్నారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ హాజరయ్యారు. చిన్నారుల ఉత్సాహాన్ని చూసి ఆయన మురిసిపోయారు. పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు బాలోత్సవం ఎంతో ఉపయోగపడుతుందని మంత్రి కొనియాడారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విద్యా విధానంలో విప్లవాత్మక మార్పులు తెస్తున్నారని ప్రశంసించారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంచేందుకు త్వరలోనే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి జిల్లాలో పిల్లలతో 'మాక్ అసెంబ్లీ' నిర్వహించేలా కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

**'చదువులోనే కాదు-ఏ రంగంలోనైనా తగ్గేదేలే' - బాలోత్సవంలో**



**అదరగొట్టిన పిల్లలు**

రంగస్థలంపై అడుగుపెట్టిన చిన్నారులు తమ వేషధారణలతో అందరినీ ఆశ్చర్యపరిచారు. 'కాంతార' వేషధారణతో ఒకరు, రైతు గెటప్‌లో మరొకరు అలరించారు. వెంకటేశ్వర స్వామి రూపంలో వచ్చిన చిన్నారి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పర్యావరణం థీమ్‌కు తగ్గట్టుగా ఓ విద్యార్థి 'కొబ్బరికాయ' వేషధారణలో వచ్చి సందడి చేశారు. వారి ప్రదర్శనలు చూసి ఆడిటోరియం మొత్తం చప్పట్లతో మారుమోగింది. వనజీవి రామయ్య స్ఫూర్తితో... ప్రతి ఏటా ఒక ప్రముఖుడిని స్మరించుకోవడం బాలోత్సవం ఆనవాయితీ. ఈసారి ప్రముఖ పర్యావరణవేత్త 'వనజీవి రామయ్య' పేరిట ప్రధాన వేదికకు నామకరణం చేశారు. పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను చాటిచెప్పేలా ఈ నిర్ణయం తీసుకున్నారు. విద్యార్థులు కూడా ఇదే అంశంపై అనేక ప్రదర్శనలు ఇచ్చారు.

**సామాజిక స్పృహతో నాటికలు:** కేవలం వినోదమే కాదు, విజ్ఞానాన్ని కూడా పిల్లలు పంచుకున్నారు. సామాజిక సమస్యలపై వారు చేసిన ప్రదర్శనలు ఆలోచింపజేశాయి. మొబైల్ ఫోన్ల అధిక వినియోగం వల్ల కలిగే అనర్థాలను కళ్లకు కట్టారు. చిన్నపిల్లలు ఫోన్లకు బానిసలైతే జరిగే నష్టాలపై లఘు నాటికలు ప్రదర్శించారు. పరిశ్రమల కాలుష్యం వల్ల ప్రకృతికి జరుగుతున్న నష్టంపై విద్యార్థులు అర్థవంతంగా వివరించారు.

**పోటీల్లో హోరాహోరీ:** సాంస్కృతిక, అకడమిక్ విభాగాలుగా వేరువేరుగా పోటీలు నిర్వహించారు. ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, పల్నాడు, ఏలూరు జిల్లాల నుంచి విద్యార్థులు భారీగా తరలివచ్చారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి వేలాది మంది హాజరయ్యారు. జానపద పాటలకు విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కూచిపూడి, భరతనాట్యం వంటి శాస్త్రీయ నృత్యాలతో పాటు సినిమా పాటలకు కూడా చిన్నారులు ఉత్సాహంగా స్టెప్పులేశారు.

**బహుముఖ ప్రజ్ఞ:** విద్యార్థుల్లోని అన్ని రకాల నైపుణ్యాలకు ఇక్కడ వేదిక దొరికింది. మట్టితో బొమ్మలు చేసే పోటీల్లో చిన్నారులు తమ ప్రతిభను చూపించారు. వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లో తమ ఆలోచనలకు రంగులు అద్దారు. మెమరీ టెస్ట్, దేశభక్తి గీతాలాపన పోటీల్లో విద్యార్థులు ఆసక్తిగా పాల్గొన్నారు.

**ఆత్మవిశ్వాసమే లక్ష్యం:** విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం నింపడమే ఈ ఉత్సవాల ప్రధాన ఉద్దేశం అని నిర్వాహకులు తెలిపారు. అన్ని రంగాల్లో రాణించడం ద్వారా వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పేర్కొన్నారు. తమకు నచ్చిన రంగంలో పోటీపడే అవకాశం దక్కడంపై విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. పిల్లల సందడి, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో సిద్ధార్థ కళాశాల ప్రాంగణం ఒక పర్యాటక కేంద్రంలా మారింది. మూడు రోజుల పాటు ఈ సందడి కొనసాగనుంది.



# అభివృద్ధి పనులు పరిశీలించిన ఎమ్మెల్యే దామచర్ల



ఒంగోలు (చైతన్యరథం): ఒంగోలు నగరంలో ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ సుడిగాలి పర్యటన చేపట్టారు. నగరంలోని కర్నూల్ రోడ్డు ఫ్లైఓవర్ నందు రూ.80 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులు పరిశీలించారు. ఫ్లైఓవర్ క్రింద బిటి రోడ్డు వల్ల ఎప్పుడు గుంతలు పడటం గమనించి సీసీ రోడ్డుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు తెలియజేశారు. తదుపరి సౌత్ బైపాస్ క్విస్ కాలేజీ జంక్షన్ నందు మాజీ ప్రధాని వాజపేయి విగ్రహానికి బీజేపీ నాయకులతో కలిసి భూమిపూజ కార్యక్రమం చేపట్టడం జరిగింది. తదుపరి కొప్పోలు ఫ్లైఓవర్ క్రింద 40 లక్షలతో నిర్మించనున్న ఆర్వోబీ కల్వర్ట్ పనులు పరిశీలించారు. ఫ్లైఓవర్ వద్ద నుండి కొప్పోలు వరకు రోడ్డుకు రెండు వైపుల సీసీ డ్రైనేజ్‌కు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వెంకటేశ్వరావు, టీడీపీ నాయకులు మరియు అధికారులు పాల్గొన్నారు.

# యువతకు ఉపాధి కల్పించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయం : కోటంరెడ్డిగిరిధర్‌రెడ్డి




నెల్లూరు రూరల్ (చైతన్యరథం): నియోజకవర్గ పరిధిలో వి.ఆర్. ఇన్స్టిట్యూట్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ కళాశాల నందు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు, పారిశ్రామికవేత్తల ద్వారా పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు అన్ని విధాల ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం మెగాడీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీ చేయడం జరిగిందని, రాబోయే మూడేళ్లలో పెద్దఎత్తున ఉద్యోగాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని గిరిధర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. జాబ్ మేళాలో ఉద్యోగ ప్రయత్నాల కోసం వచ్చిన 171 మంది అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వివిధ కంపెనీలలో ఉద్యోగాలకు ఎంపికైన 96 మందికి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# డ్రగ్స్ నిర్మూలన అవగాహన కార్యక్రమంలో ప్రభుత్వ విప్ తోయక



పార్వతీపురం (చైతన్యరథం): పార్వతీపురం మన్యం జిల్లాలోని గురుగుబిల్లి మండలం ఖడ్గవలస జంక్షన్ వద్ద నిర్వహించిన అభ్యుదయ సైకిల్ యాత్రకు స్వాగతం పలుకుతూ జరిగిన మాదకద్రవ్యాల నిర్మూలన అవగాహన కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి మంగళవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... జిల్లాను పూర్తిగా డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చే దిశగా జిల్లా పోలీసు శాఖ పలు అవగాహన కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తున్నారని అన్నారు. డ్రగ్స్ వినియోగం యువత భవిష్యత్తును తీవ్రంగా దెబ్బతీస్తుందని హెచ్చరించారు. డ్రగ్స్ వాడకం వలన మెదడు నియంత్రణ కోల్పోతుందని, సమాజంలో పేరు ప్రతిష్టలు దెబ్బతింటాయని, చదువుపై ఆసక్తి తగ్గిపోతుందని, మత్తు ప్రభావంతో డబ్బుల కోసం తెలియక నేరాలకు పాల్పడే పరిస్థితి వస్తుందని, చివరకు జీవితాన్ని సర్వనాశనం చేసుకునే స్థితికి చేరుకుంటారని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. యువత భవిష్యత్తు కోసం అందరూ కలిసికట్టుగా ముందుకు రావాలని ఆమె పిలుపునిచ్చారు. డ్రగ్స్ వాడకంతో బాధపడుతున్న వారికి సహాయం చేసి, వారిని సమాజంలో తిరిగి నిలబెట్టడం ప్రతి వ్యక్తి బాధ్యత అని పేర్కొన్నారు. "మన యువతను రక్షిద్దాం... మన కుటుంబాలను కాపాడుకుందాం.. డ్రగ్స్ లేని ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మిద్దాం" అని పిలుపునిచ్చారు. ఇలాంటి కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ చురుకుగా పాల్గొంటేనే రాబోయే తరాలకు సురక్షితమైన, ఆరోగ్యవంతమైన భవిష్యత్తును అందించగలమని అన్నారు. పాయకరావుపేట నుండి మదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన పరుస్తూ సైకిల్ యాత్ర చేస్తూ వచ్చిన బృందానికి చెందిన లీడర్ మనోజ్‌కి ఎమ్మెల్యే సన్మానం చేశారు. కార్యక్రమంలో డిఎస్పి రాంబాబు, నాయకులు అక్కేన మధుసూదన్ రావు, అంబటి రాంబాబు, డొంకాడ రామకృష్ణ, విజయాకుంశం, మర్రాపు పురుషోత్తం నాయుడు, మరడాన తవిటి నాయుడు, మరడాన నారాయణస్వామి, కోట సుమన్, పోలీస్ శాఖ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పట్టణ ప్రజలకు మెరుగైన ఆరోగ్యసేవలు

**•కావలిలో ఔషధ తనిఖీ కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి**



కావలి (చైతన్యరథం): కావలి పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఔషధ తనిఖీ అధికారి కార్యాలయంను శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి రిబ్బన్ కట్ చేసి కార్యాలయాన్ని ప్రజలకు అంకితం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి... "కావలి ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు చేరేందుకు, నకిలీ మందుల నియంత్రణకు, ఫార్మసీలపై పర్యవేక్షణ మరింత బలపడేందుకు ఈ కార్యాలయం పెద్ద సహాయం చేస్తుంది. ప్రజల ఆరోగ్య భద్రత మా ప్రభుత్వానికి ప్రథమ ప్రాధాన్యం" అని అన్నారు. కొత్త కార్యాలయం ద్వారా ఔషధాల నాణ్యత నియంత్రణ, ఫార్మసీల తనిఖీలు, లైసెన్సులు, ఫిర్యాదుల పరిష్కారం వేగంగా జరుగుతాయని తెలిపారు. కావలిలో ఆరోగ్య పరిపాలనకు కొత్త దిక్సూచిగా నిలిచే ఈ కార్యాలయ ప్రారంభోత్సవం ప్రజల్లో హర్షం వ్యక్తం చేసింది.

# జాతీయ అథ్లెటిక్స్ పోటీలకు కావలి విద్యార్థుల ఎంపిక... సత్కరించిన కళాశాల అధ్యాపకులు

కావలి (చైతన్యరథం): పల్నాడు జిల్లా వినుకొండలో నవంబరు 25 న జరిగిన ఎస్‌జిఎఫ్ అండర్- 17 రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీల్లో పాల్గొన్న శ్రీ చైతన్య జూనియర్ కళాశాల విద్యార్థులు జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. బాలికల విభాగంలో టి. అశ్విని హేమర్ త్రోలో గోల్డ్ మెడల్ సాధించి లఖ్నవూలో జరగనున్న జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. బాలుర విభాగంలో కె. లోకేశ్ హేమర్ త్రోలో తృతీయ స్థానం సాధించారు. ఈ సందర్భంగా మంగళవారం కళాశాలలో విద్యార్థులను పుష్పగుచ్ఛాలతో అభినందించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ తదితరులు పాల్గొన్నారు.



## ఇది మాటల ప్రభుత్వం కాదు.. పేదల్ని ఆదుకునే ప్రభుత్వం

**●సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీత**

**●19మందికి రూ.11.23లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ**



రాప్తాడు (చైతన్యరథం): అధికారం ఉన్నన్ని రోజులు మాటలు చెబుతూ.. అధికారం పోయాక విమర్శలు చేసే ప్రభుత్వం మాది కాదని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. రామగిరి మండలం వెంకటాపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆమె పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని చెన్నేకొత్తపల్లి, కనగానపల్లి, రామగిరి మండలాలకు చెందిన 19మంది లబ్ధిదారులకు, 11లక్షల 23వేల రూపాయల విలువైన చెక్కులను అందజేశారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ఎమ్మెల్యే సునీతతో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ ఎన్టీఆర్ వైద్య సేవల ద్వారా ప్రజలకు ఎలాంటి జబ్బులు వచ్చినా వైద్యం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. కొన్నిసార్లు ఎన్టీఆర్ వైద్య సేవలు అందక, ఇతర ఆసుపత్రుల్లో చికిత్సలు పొంది ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారిని సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆదుకుంటున్నట్లు చెప్పారు. సీఎంఆర్ఎఫ్ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతో ఉదారంగా స్పందిస్తున్నారన్నారు. అంతేకాకుండా గతం కంటే మెరుగ్గా ఎన్టీఆర్ వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నారన్నారు. వైసీపీ నాయకులు అధికారంలో ఉండగా మెడికల్ కళాశాలలు నిర్మించకుండా.. ఇప్పుడు ఆందోళనలు చేస్తున్నారన్నారు. పీపీపీ మోడల్లో ప్రభుత్వం నిర్మిస్తుంటే.. ఎక్కడ మంచి పేరు వస్తుందోనన్న ఆందోళనతో వారు ఇష్టమొచ్చినట్లు ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి వాటిని ప్రజలు నమ్మబోరని ఎమ్మెల్యే సునీత స్పష్టం చేశారు.

## రామగిరి ఎంపీపీ ఎన్నిక వేళ కీలక పరిణామం

**●కుంటిమద్ది ఎంపీటీసీ సాయిలీల టీడీపీలో చేరుతున్నట్లు ప్రకటన**

**●టీడీపీతోనే అభివృద్ధి సాధ్యం... అందుకే పార్టీలో చేరుతున్నా.. సాయిలీల**



రామగిరి (చైతన్యరథం): రామగిరి ఎంపీపీ ఎన్నిక వేళ కీలక పరిణామం చోటు చేసుకుంది. గత నాలుగు సార్లు వాయిదా పడ్డ రామగిరి ఎంపీపీ ఎన్నిక ఈనెల 11న నిర్వహిస్తున్నట్లు నోటిఫికేషన్ విడుదలైంది. అయితే గురువారం ఎంపీపీ ఎన్నిక జరుగుతున్న నేపథ్యంలో కుంటిమద్దికి చెందిన వైసీపీ ఎంపీటీసీ సాయిలీల ఆ పార్టీకి షాక్ ఇచ్చారు. తాను టీడీపీలో చేరుతున్నట్లు ఆమె ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. గత ఐదేళ్లుగా మండలంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని.. తాము ప్రజాప్రతినిధులుగా గెలిచినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. ప్రస్తుతం ఎమ్మెల్యే పరిటాల సునీత నాయకత్వంలో గతంలో ఎప్పుడూ లేని విధంగా మండల అభివృద్ధి జరుగుతోందన్నారు. అందుకే వైకాపాను వీడి తెలుగుదేశం పార్టీలో చేరుతున్నట్లు సాయిలీల తెలిపారు.

## కదిరి ప్రాంతాన్ని టూరిజం సర్క్యూట్ కేంద్రంగా అభివృద్ధి చేస్తాం

కదిరి (చైతన్యరథం): కదిరి పట్టణం మున్సిపల్ కార్యాలయం నందు జరిగిన కేంద్ర ప్రభుత్వ PRASHAD SCHEME కింద ఆగమ శాస్త్రం ప్రకారం శ్రీమత్ ఖాద్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయం సుందరీకరణకు, భృగతీర్థం (కోనేరు), సుందరీకరణకు చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై పుర ప్రజల పెద్దలతో సమీక్ష సమావేశం ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కదిరి రూరల్ మండలం ఎర్రదొడ్డి గంగమ్మ గుడిలో ఆభరణాలు కాజేస్తూ దొరికిన ఈవో మురళీకృష్ణ, తోపాటు వైసీపీ నేత పై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈవో దొంగతనం చేసిన వ్యవహారంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ సీఎం ఆదేశాలు మేరకు ఈవోపై సస్పెన్షన్ వేటు వేశారన్నారు. ఎర్రదొడ్డి గంగమ్మ ఆలయం వద్ద దొంగతనం చేసే రెండు రోజులు ముందు



ఈవో మురళీకృష్ణ కదిరి సాక్షి రిపోర్టర్ ఆంధ్రప్రభ ఇన్‌ఛార్జ్ మాజీ రిపోర్టర్ వైసీపీ నేత అందరూ కలిసి మద్యం సేవిస్తూ ప్రభుత్వంపై బురద చల్లేందుకు ప్రయత్నాలు చేశారన్నారు. ఈవో కార్యాలయం పైన వీరందరూ ముఠాగా ఏర్పడి మద్యం సేవిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారు. అన్నదానానికి భక్తుడు లక్ష రూపాయలు విరాళం ఇస్తే ఆ సొమ్మును వైసీపీ నేత కాజేసారని తెలిపారు. పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు చేపడతామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

## 20 లక్షల ఉద్యోగాల కల్పనే ప్రభుత్వ లక్ష్యం : టీజీ భరత్

కర్నూలు (చైతన్యరథం): ఎన్నిల్లో ఇచ్చిన హామీ మేరకు 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే తన లక్ష్యమని పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో నేషనల్ కెరీర్ సర్వీసు, ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళాను మంత్రి ప్రారంభించారు. విద్య, ఐటీ మంత్రి లోకేష్ ఆదేశాల మేరకు జిల్లాలో ఏర్పాటు కానున్న కంపెనీలకు తగ్గట్టుగా యువతకు శిక్షణ ఇస్తున్నామన్నారు. 1,550 మందికి ఉద్యోగాలు ఉన్నాయని, 21 కంపెనీలు జాబ్ మేళాలో పాల్గొన్నాయ న్నారు. జిల్లా ఉపాధికల్పనాధికారి పి. దీప్తి మాట్లా డుతూ జిల్లాలోని నిరుద్యోగులంతా అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్కిల్ డెవలప్ మెంట్ అధికారి ఆనంద్ రాజ్ కుమార్, కోఆర్డినేటర్ డాక్టర్ జజి. గిరిజారాణి, ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి, ఓవర్సీస్ ఎస్ఎం బాషా, ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ సి. చంద్రకళ, కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## చిత్తూరు జిల్లాలో రెండు కార్లు ఢీ: ముగ్గురు మృతి




నగరి (చైతన్యరథం): ఏపీలోని నగరి మండలం తడుకుపేట వద్ద జరిగిన భయానక రోడ్డు ప్రమాదం ప్రాంతమంతా విషాదంలో ముంచేసింది. తిరుచానూరు నుండి తిరుత్తణి దిశగా వెళ్తున్న కారు... చెన్నై నుండి తిరుమల వైపు వస్తున్న మరో కారు మధ్య ఎదురెదురుగా జరిగిన భీకర ఢీకొన్న ఘటనలో ముగ్గురు అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. రెండు వాహనాలు తీవ్రంగా దెబ్బతిని పూర్తిగా పాడైపోయాయి. ఈ సంఘటన స్థానికంగా హాట్ టాపిక్‌గా మారింది.

**ప్రమాదం ఎలా జరిగింది?**

పోలీసుల ప్రాథమిక వివరాల ప్రకారం తిరుచానూరుకు చెందిన పోటు కార్మికులు శంకర్, సంతానం కారు ద్వారా మరో ప్రాంతానికి బయలుదేరారు. వారు తడుకుపేట వద్దకు చేరుకునే సరికి ఎదురుగా వచ్చిన కారు అదుపుతప్పి బలంగా ఢీకొట్టింది. ఢీకొట్టిన ప్రభావం అంత తీవ్రంగా ఉండడంతో రెండు వాహనాలూ నుజ్జునుజ్జయ్యాయి. వెంటనే పోలీసుల బృందం చేరుకుని పరిస్థితిని పరిశీలించింది. ప్రత్యక్ష సాక్షులను విచారించిన అధికారులు అతివేగమే ప్రమాదానికి ప్రధాన కారణమని భావిస్తున్నారు. ఈ ప్రమాదంలో పద్మావతి అమ్మవారి ఆలయంలో పోటు కార్మికులుగా పనిచేస్తున్న శంకర్, సంతానం అక్కడికక్కడే మృతి చెందారు. అలాగే చెన్నైకి చెందిన అరుణ్ అనే వ్యక్తి కూడా ఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయాడు. మరో ముగ్గురు తమిళనాడు వ్యక్తులు తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

ఇటీవల రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ సంఘటన మరోసారి రోడ్డు భద్రతపై ప్రశ్నలు లేవనెత్తింది. ప్రభుత్వ చర్యలు ఉన్నప్పటికీ అతివేగం, నిర్లక్ష్యంగా ఓవర్‌టేకింగ్, జాగ్రత్తలేమి వంటి కారణాలు ప్రాణాలను బలితీస్తూనే ఉన్నాయి. ఈ సంఘటనతో తిరుచానూరు దేవస్థానంలో పనిచేసే పోటు కార్మికులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఒక్కసారిగా సహచరులను కోల్పోవడం కుటుంబ సభ్యులు, స్థానికులను కన్నీరు మున్నీరుగా మిగిల్చింది. ప్రమాదంపై కేసు నమోదు చేసిన పోలీసులు రెండు వాహనాల వేగం, రహదారి పరిస్థితులు, డ్రైవింగ్ లో నిర్లక్ష్యం వంటి అంశాలపై విచారణ కొనసాగిస్తున్నారు. అవసరమైతే సీసీ కెమెరా ఫుటేజీని సైతం పరిశీలించనున్నట్లు తెలిపారు.

## తిరుపతి ఎన్ఎస్‌యూ కేసులో ఆ ఇద్దరు ప్రొఫెసర్ల అరెస్ట్

తిరుపతి (చైతన్యరథం): జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో విద్యార్థినిపై లైంగిక వేధింపుల కేసులో కొత్త విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఒడిశాలోని బాధితురాలి ఇంటి వద్ద విచారణ చేపట్టిన తిరుపతి వెస్ట్ పోలీసులు.. యువతి ఇచ్చిన వీడియో స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేశారు. ఈ విచారణలో పోలీసులు కీలక వివరాలను రాబట్టినట్లు సమాచారం. ప్రొఫెసర్ లక్ష్మణ్ కుమార్ తనను పలుమార్లు లైంగికంగా వేధించారంటూ.. స్టేట్‌మెంట్‌లో కీలక విషయాలను బాధితురాలు వెల్లడించింది. ఆ వేధింపులు తాళలేక ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమైనట్లు చెప్పారు. అయితే.. 'ప్రొఫెసర్ శేఖర్ రెడ్డి వద్ద మన ఇద్దరి వీడియోలు ఉన్నాయి. ఆ వీడియో ఎలా వెళ్లింది' అని ప్రశ్నిస్తూ వేధింపులకు పాల్పడ్డాడని తెలిపింది. కానీ, ప్రొ.శేఖర్ రెడ్డి తనతో ఎప్పుడూ మాట్లాడలేదని పోలీసుల విచారణలో పేర్కొంది బాధితురాలు. బాధిత యువతి ఫిర్యాదు మేరకు వెస్ట్ పోలీసులు తదుపరి చర్యలు చేపట్టారు. విద్యార్థినిపై లైంగిక వేధింపుల కేసులో ప్రధాన నిందితుడైన ప్రొ.లక్ష్మణ్ కుమార్ సహా మరో ప్రొ.శేఖర్ రెడ్డిలను అదుపులోకి తీసుకున్నారు. విచారణ నిమిత్తం తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లోని డీఎస్పీ కార్యాలయానికి తరలించారు.




## 50ఏళ్ల సమస్యకు పరిష్కారం చూపిన పరిటాల శ్రీరామ్

**●పొదరాళ్లపల్లిలో 14మంది దళితులకు దక్కిన భూమి**

**●దీర్ఘకాలికంగా ఉన్న సమస్యను రాజీ మార్గంలో పరిష్కరించిన శ్రీరామ్**

**●యజమానుల సమ్మతంతో 14మందికి ఇంటి పట్టాలు**



ధర్మవరం (చైతన్యరథం): 50ఏళ్లుగా భూమి కోసం జరుగుతున్న వివాదానికి ధర్మవరం నియోజకవర్గ తెదేపా ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ శాశ్వత పరిష్కారం చూపారు. ముదిగుబ్బ మండలం పొదరాళ్లపల్లి గ్రామంలో కొందరు దళితులు 51సెంట్లలో గుడిసెలు వేసుకున్నారు. అయితే దీనిపై భూ యజమానులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో సుమారు 50ఏళ్లుగా వివాదం నడుస్తోంది. భూమి కోసం ఇరు పక్షాల వారు కోర్టుకు వెళ్లినా పరిష్కారం కాలేదు. ఈ విషయాన్ని దళితులు ధర్మవరం తెదేపా ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ దృష్టికి తీసుకెళ్లారు. 50ఏళ్లుగా ఎవరికీ చెందకుండా ఇబ్బందులు పడుతున్నామని ఇరు పక్షాల వారు శ్రీరామ్ వద్ద వాపోయారు. దీంతో వారితో సుదీర్ఘంగా చర్చించి.. ఇద్దరి మధ్య రాజీ కుదిర్చారు. భూ యజమానులకు 20సెంట్లు, దళితులకు 31సెంట్లు ఇచ్చేలా ఒప్పందం కుదిర్చారు. దీనికి ఇరు పక్షాల వారు ఒప్పుకున్నారు. 31సెంట్లలో 10సెంట్లు రోడ్లు, డ్రైనేజీలకు పోనూ మిగిలిన 21సెంట్లలో 14మందికి ఇంటి పట్టాలు అందజేశారు. దళితులకు సంబంధించిన భూమిపై తమకు భవిష్యత్‌లో ఎలాంటి హక్కు లేదని యజమానులు కూడా సంతకాలు చేశారు. అనంతపురంలోని తన నివాసంలో ఇంటి పట్టాలు అందజేయగా.. ఇటు దళితులు, యజమానులు శ్రీరామ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. 50ఏళ్ల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపారన్నారు. గ్రామాల్లో ఉన్న సమస్యలపై కోర్టులకు వెళ్లి.. ఏళ్ల తరబడి ఇబ్బందులు పడవద్దని.. రాజీ మార్గంలో పరిష్కరించుకుంటే ఇరువురికి మేలు జరుగుతుందని ఈ సందర్భంగా శ్రీరామ్ సూచించారు. ఇలాంటి విషయాల్లో గ్రామంలో పెద్ద మనుషులు చొరవ తీసుకుంటే బాగుంటుందని శ్రీరామ్ అభిప్రాయపడ్డారు.



## నిబంధనలు ప్రజలను వేధించడానికి కాదు

**- ఇండిగో సంక్షోభంపై ప్రధాని మోదీ**

ఇండిగో సంక్షోభంపై ప్రధాని నరేంద్ర మోదీ తొలిసారి స్పందించారు. వ్యవస్థలను మెరుగుపర్చేందుకే నిబంధనలని.. ప్రజలను వేధించడానికి కాదని స్పష్టం చేశారు. ఈ మేరకు ఎన్డీయే పక్ష సమావేశంలో ఆయన మాట్లాడారని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు. ప్రభుత్వం వల్ల ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చూసుకోవాలి. నియమనిబంధనలు మంచివే అయితే వ్యవస్థను మెరుగుపర్చేందుకు వాటిని రూపొందించాలి. అవి ప్రజలను వేధించకూడదు" అని ప్రధాని మాటలను కేంద్ర మంత్రి గుర్తుచేసుకున్నారు. "సామాన్య పౌరుల్ని ఇబ్బందిపెట్టే చట్టం, నిబంధన ఉండకూడదని ప్రధాని మోదీ స్పష్టంగా చెప్పారు. చట్టాలు ప్రజలపై భారంగా పరిణమించకూడదు" అని వెల్లడించారు. వారం రోజులకు పైగా దేశీయ విమానయాన సంస్థ ఇండిగో తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. దాంతో రోజుకు వందల సంఖ్యలో సర్వీసులు రద్దు, ఆలస్యమవుతున్నాయి. దాంతో ప్రయాణికులు విమానాశ్రయాల్లోనే పడిగాపులు కాస్తూ ఇబ్బందిపడుతోన్న దృశ్యాలు వైరల్ అయ్యాయి. సమస్య పరిష్కారం దిశగా ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ.. ఇప్పటికీ అంతరాయాలు కొనసాగుతున్నాయి. ఈ పరిణామాలను కేంద్రం ఇప్పటికే సీరియస్‌గా తీసుకుంది. దీనిపై విచారణ కమిటీని వేసింది. ఇక ఈ అవాంతరాలకు ప్రధానంగా ఐదు అంశాలు కారణమని ఇండిగో ప్రాథమికంగా వెల్లడించింది. స్వల్ప సాంకేతిక లోపాలు, విమానాల షెడ్యూళ్లను మార్చడం, ప్రతికూల వాతావరణ పరిస్థితులు, విమానయాన వ్యవస్థలో పెరిగిన రద్దీ దీనికి కారణం అని తెలిపింది. కొత్తగా అమల్లోకి వచ్చిన 'ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్స్ ఫేజ్ 2 (ఎఫ్‌డీటీఎల్ ఫేజ్ 2) రోస్టరింగ్ నియమాలు కూడా ఒక కారణంగా పేర్కొంది. ఇప్పటికే ఈ కొత్త నియమాలను కేంద్రం తాత్కాలికంగా పక్కన పెట్టిన సంగతి తెలిసిందే.

## సోనియా గాంధీకి కోర్టు నోటీసులు

కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు, ఎంపీ సోనియా గాంధీకి ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు నోటీసులు జారీ చేసింది. సోనియా గాంధీ నకిలీ పత్రాల ద్వారా ఓటు హక్కు పొందారని ఢిల్లీకి చెందిన న్యాయవాది వికాస్ త్రిపాఠి రౌస్ అవెన్యూ కోర్టులో పిటిషన్ వేశారు. ఆ పిటిషన్‌ను విచారించిన కోర్టు సోనియా గాంధీకి నోటీసులు జారీ చేసి సమాధానం చెప్పాలని ఆదేశించింది. ఈ కేసులో సోనియా గాంధీతో పాటు ఢిల్లీ పోలీసులకు కూడా న్యాయస్థానం సమన్లు జారీ చేసింది. సోనియా గాంధీ పేరును 1980 ఓటర్ల జాబితాలో చేర్చారు. అయితే సోనియా గాంధీ 1983లో భారత పౌరసత్వం తీసుకు న్నారు. అంటే సోనియా గాంధీ భారత పౌరసత్వం తీసుకోక ముందే నకిలీ పత్రాలు సమర్పించి ఓటు హక్కు పొందారనేది ఆమెపై ఆరోపణ. ఢిల్లీ న్యాయవాది వికాస్ త్రిపాఠి సోనియాపై పిటిషన్ వేశారు. అయితే సరైన ఆధారాలు లేవనే కారణంతో ఈ కేసును ఈ ఏడాది సెప్టెంబర్‌లో అదనపు చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కొట్టేశారు. మెజిస్టీరియల్ కోర్టు ఆదేశాన్ని వికాస్ త్రిపాఠి రౌస్ అవెన్యూ కోర్టులో సవాలు చేశారు. రివిజన్ పిటిషన్ వేశారు. ఈ రివిజన్ పిటిషన్‌ను తాజాగా విచారించిన రౌస్ అవెన్యూ కోర్టుల ప్రత్యేక న్యాయమూర్తి విశాల్ గోగ్నే.. సోనియా గాంధీ, ఢిల్లీ పోలీసులకు నోటీసులు జారీ చేశారు. వివరణ ఇవ్వాలని ఆదేశించారు. ఈ కేసులో తదుపరి విచార ణను జనవరి 6, 2026కు వాయిదా వేశారు.

## అనిల్ అంబానీ కుమారుడిపై కేసు

ఢిల్లీ: వ్యాపారవేత్త అనిల్ అంబానీ కుమారుడు జై అన్మోల్ అనిల్ అంబానీపై సీబీఐ కేసు నమోదు చేసింది. యూనియన్ బ్యాంక్కు రూ.228 కోట్ల మేర నష్టం వాటిల్లేలా చేసిన వ్యవహారంలో ఈ కేసు పెట్టింది. యూనియన్ బ్యాంక్ ఫిర్యాదు మేరకు చర్యలు చేపట్టింది. రిలయన్స్ హోం ఫైనాన్స్ లిమిటెడ్కు డైరెక్టర్గా ఉన్న జై అన్మోల్ అంబానీతో పాటు రవీంద్ర శరద్ సుధాకర్పైనా కేసు నమోదు చేసినట్లు సీబీఐ అధికార వర్గాలు తెలిపాయి. ముంబయిలోని బ్రాంచ్ నుంచి రిలయన్స్ హోం ఫైనాన్స్ కంపెనీ రూ.450 కోట్లు రుణంగా తీసుకుంది. తిరిగి చెల్లించడంలో కంపెనీ విఫలమైంది. ఈ ఖాతాలపై గ్రాంట్ థోర్నంటన్ ఆడిట్ సంస్థ నిర్వహించిన ఫోరెన్సిక్ పరిశీలనలో నిధులు మళ్లించినట్లు తేలింది. 2016 ఏప్రిల్ 1 నుంచి 2019 జూన్ 30 వరకు మధ్య జరిగిన లావాదేవీలను జల్లెడ పట్టడంతో రుణంగా తీసుకున్న మొత్తాన్ని ఇతర అవసరాలకు వినియోగించినట్టు గుర్తించింది. ఈ వ్యవహారంపై బ్యాంక్ ఫిర్యాదు చేయడంతో సీబీఐ తాజాగా చర్యలు చేపట్టింది.

# ఎస్ఐఆర్‌పై లోక్‌సభలో ఘాటుగా చర్చ

**◆ఆర్ఎస్ఎస్ ఎజెండాను ప్రభుత్వం అమలు చేస్తోంది**

**◆అన్ని వ్యవస్థలపైనా ఆధిపత్యం: రాహుల్‌గాంధీ**



న్యూఢిల్లీ: రాజ్యాంగ వ్యవస్థలను చేతుల్లోకి తీసుకోవడమే రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఎజెండా అని, ఆ ఎజెండానే ప్రభుత్వం అమలు చేస్తోందని కాంగ్రెస్ ఎంపీ రాహుల్‌గాంధీ అన్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై మంగళవారం నాడు లోక్‌సభలో జరిగిన చర్చలో రాహుల్‌గాంధీ మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ వాదులకు సమానత్వంపై నమ్మకం లేదని, అన్ని వ్యవస్థలపైనా ఆధిపత్యం చూపుతున్నారని విమర్శించారు. ఎన్నికల వ్యవస్థను సైతం ఆర్ఎస్ఎస్ తన గుప్పిట్లో ఉంచుకుందని ఆరోపించారు. ఇప్పటికే దేశంలోని విద్యావ్యవస్థను మార్చేశారని, దేశంలోని వైవిధ్యాన్ని నాశనం చేస్తున్నారని అన్నారు. ఆర్ఎస్ఎస్ వ్యతిరేకులను ప్రభుత్వం టార్గెట్ చేస్తోందని ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసేందుకే ఈసీని వాడుకుంటున్నారని, క్షేత్ర స్థాయిలో ఎన్నికల సంస్కరణలు అమలు కావడం లేదని రాహుల్ ఆరోపించారు. ఈసీ నియామకంలో మోదీ, అమిత్‌షాకు ఎందుకంత ఆసక్తి అని ప్రశ్నించారు. ఎన్నికల కమిషనర్లకు మోదీ, అమిత్‌షా బహుమతులిస్తున్నారని, సీబీఐ, ఈడీలను ప్రభుత్వం తన గుప్పిట్లో ఉంచుకుందని ఆరోపణలు గుప్పించారు. కేంద్రం, ఎన్నికల సంఘం కుమ్మక్కయ్యాయని, తాను నిజాలు మాట్లాడుతుంటే బీజేపీ జీర్ణించుకోలేక పోతోందని అన్నారు. తాను ఏదీ తప్పుగా మాట్లాడలేదని, పూర్తి ఆధారాలతోనే మాట్లాడుతున్నానని చెప్పారు. ఎన్నికల సంస్కరణలపై కేంద్రం గొప్పలు చెప్పుకుంటోందని రాహుల్ విమర్శించారు. ఉత్తరప్రదేశ్, హరియాణాలో పలు చోట్ల 'ఓట్ చోరీ' జరిగిందన్నారు. ఎన్నికల సీసీ ఫుటేజ్‌ను ధ్వంసం చేశారని, ఫేక్ ఓట్లపై ఈసీ క్లారిటీ ఇవ్వలేదని చెప్పారు. తాను అడిగిన ప్రశ్నలకు ఇప్పటికీ ఈసీ సమాధానం ఇవ్వలేదని అన్నారు.

## ఎస్ఐఆర్ కొనసాగించాల్సిందే..రాష్ట్రాలకు సుప్రీంకోర్టు స్పష్టం


ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను పశ్చిమబెంగాల్ వంటి రాష్ట్రాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఆ సవరణను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్లపై మంగళవారం విచారణ జరిగింది. ఈ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలకు వెళ్లనున్న బెంగాల్లో ఎస్ఐఆర్ జరుగుతోంది. ఈ ప్రక్రియలో భాగమైన బీఎల్ ఓలు (బూత్ లెవెల్ అధికారులు), ఇతర అధికారులకు బెదిరింపులు రావడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా పరిగణించింది. ఈ ఘటనలను తమ దృష్టికి తీసుకురావాలని లేకపోతే గందరగోళ పరిస్థి తులు ఎదురుకావొచ్చని హెచ్చరించింది. బీఎల్ఓలకు బెదిరింపులు, ఎస్ఐఆర్ ప్రక్రియలో అంతరాయాల గురించి తమ దృష్టికి తీసుకువస్తే.. వారి భద్రతకు సంబంధించి తగిన ఆదేశాలు జారీ చేస్తామని వెల్లడించింది. బీఎల్ఓలు ఒత్తిడికి గురైతే వారి స్థానంలో వేరే వారిని తీసుకోవడం వంటి పరిష్కార మార్గా లను అనుసరిస్తూ.. ఎస్ఐఆర్ జరిగేలా చూడాలని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను ఆదేశించింది. ఈ ప్రక్రియ నిర్వహణలో ఏవైనా అవాంతరాలు ఏర్పడితే.. అధికారులను రక్షించడానికి పోలీసుల సహకారం తీసుకుంటున్నామని ఎన్నికల సంఘం కోర్టుకు వెల్లడించింది.

# ఇండిగోకు షాక్..5 శాతం విమానాల తగ్గింపు



ఢిల్లీ: భారత దేశంలో అతి పెద్ద విమానయాన సంస్థ ఇండిగో ఎయిర్ లైన్స్. 20 సంవత్సరాల చరిత్రలో ఇండిగో మంచి పేరు సంపాదించినా.. డిసెంబర్ 2 నుంచి తీవ్ర సంక్షోభం ఎదుర్కొంటోంది. ఎక్కువ సంఖ్యలో విమాన షెడ్యూల్స్ కారణంగా సకాలంలో సేవలు అందించలేక ఇబ్బందులు పడుతుంది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇండిగో వింటర్ షెడ్యూల్‌లో కొన్ని విమాన స్లాట్స్‌ని తగ్గించి.. వాటి ప్లేస్‌లో ఇతర ఎయిర్ లైన్స్‌ని కేటాయిస్తున్నట్లు కేంద్ర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఈ నేపథ్యంలోనే డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ ఇండిగోకి షాక్ ఇచ్చింది. ఇండిగో విమాన షెడ్యూల్‌ను 5 శాతం తగ్గించినట్లు ప్రకటించింది. ఇండిగో రోజుకు దాదాపు 2,200 దేశీయ, అంతర్జాతీయ విమానాలను నడుపుతుంది. డీజీసీఏ ఉత్తర్వుల ప్రకారం రోజుకు 110 విమానాల సర్వీస్ తగ్గించనట్లవుతుంది. బుధవారం సాయంత్రం వరకు సవరించిన షెడ్యూల్‌ని డీజీసీఏకి సమర్పించాలని ఇండిగోను ఆదేశించింది. ఈ మేరకు మంగళవారం ఉదయం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇటీవల ఇండిగోలో ఏర్పడిన సంక్షేమం దృష్ట్యా మంగళవారం నాడు రాజీవ్ భవన్‌లో కీలక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఇండిగో తీసుకుంటున్న నిర్ణయాలు.. రీఫండ్, కస్టమర్ కేర్ ఇతర అంశాలపై చర్చించారు. భవిష్యత్‌లో ఇలాంటి సంక్షోభం పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి సారించనున్నట్లు తెలుస్తుంది.

## థాయ్‌లాండ్‌కు లూథ్రా బ్రదర్స్ పరార్



పనాజి: గోవా నైట్‌క్లబ్‌లో శనివారం రాత్రి భారీ అగ్నిప్రమాదం జరిగి 25 మంది ప్రాణాలు కోల్పోయిన గంటల్లోనే ఇండియా విడిచి పారిపోయారు. వారి కోసం వేట మొదలైంది. 'బిర్చ్ బై రోమియా లేన్' యజమానులైన గౌరవ్ లూథ్రా, సౌరబ్ లూథ్రాలపై ఇంటర్‌పోల్ తాజాగా బ్లూకార్నర్ నోటీసులు జారీ చేసింది. పరారీలో ఉన్న సోదరుల జాడను తెలుసుకునేందుకు గోవా పోలీసులు ఇంటర్‌పోల్ సాయం కోరడంతో ఈ నోటీసులు జారీ అయ్యాయి. డిసెంబర్ 7వ తేదీ తెల్లవారుజామున 5.30 గంటలకు పుకెట్ (థాయి లాండ్) వెళ్లే ఇండిగో ఎయిర్‌లైన్స్ విమానం ఎక్కినట్టు చెబుతున్నారు. పరారైన క్లబ్ యజమానుల్లో ఒకరైన గౌరవ్ లూథ్రా ఆచూకీ తెలిసింది. థాయ్‌లాండ్‌లోని పుకెట్ ఎయిర్‌పోర్ట్‌లో ఇమిగ్రేషన్ చెక్ సమయంలో ఆయన కనిపించారు. ఆ తర్వాత సోదరులిద్దరూ పుకెట్ రిసార్ట్‌కు చేరుకున్నారని, అయితే అధికారులు అక్కడకు చేరుకునే లోపే ఆ ప్రదేశాన్ని వదిలిపెట్టారని తెలుస్తోంది.

# జాతీయ గేయం బెంగాల్‌కు పరిమితం కాదు



న్యూఢిల్లీ: పశ్చిమబెంగాల్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకే ప్రభుత్వం వందేమాతరంపై చర్చను చేపట్టిందంటూ కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ చేసిన వ్యాఖ్యలను కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తిప్పికొట్టారు. జాతీయ గేయం బెంగాల్‌కు మాత్రమే పరిమితం కాదన్నారు. జాతీయ గేయాన్ని రాజకీయాలతో ముడిపెట్టడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. 'వందేమాతరం' 150 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా రాజ్యసభలో మంగళవారం జరిగిన చర్చలో అమిత్‌షా పాల్గొన్నారు. 'వందేమాతరం' 150 ఏళ్లు పూర్తి చేసుకోవడంపై చర్చ ఎందుకని కొందరు సభ్యులు ప్రశ్నిస్తున్నారని, అయితే కాలంతో సంబంధం లేకుండా దేశప్రజల్లో వందేమాతరం ఎప్పటికీ స్ఫూర్తి నింపుతూనే ఉందని అమిత్‌షా అన్నారు. ఆ గేయానికి గతంలోనూ ఎంతో ఔన్నత్యం ఉందని, 2047లోనూ ఉంటుందని చెప్పారు. వందేమాతర గేయాన్ని ఎందుకు చర్చించాలని ప్రశ్నించే వారు ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. ఎన్నికలకు ముడిపెట్టి వందేమాతరం కీర్తిని తక్కువచేసి చూపాలని కొందరు అనుకుంటున్నారని విమర్శించారు. వందేమాతరం గేయాన్ని రచించిన బంకిం బాబు బెంగాల్‌లో పుట్టడం నిజమని, కానీ వందేమాతరం బెంగాల్‌కో, ఇండియాకో మాత్రమే పరిమితమైంది కాదని అన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన భారతీయ వీరులు ప్రపంచంలో అజ్ఞాతంగా ఎక్కడ కలిసినా వందేమాతరం అని నినదించేవారని అన్నారు. నేటికీ మన సరిహద్దుల్లో

### ప్రియాంకగాంధీకి అమిత్‌షా కౌంటర్

దేశ అంతర్గత భద్రత కోసం ప్రాణత్యాగాలు చేస్తున్న మన బలగాల నోట నిరంతరం వందేమాతరం మారుమోగుతోందని అన్నారు. తరతరాలకు వందేమాతరం స్ఫూర్తినిస్తోందని చెప్పారు.

**కాంగ్రెస్ వల్లే..**

బుజ్జగింపు రాజకీయాల కోసం వందేమాతర గేయాన్ని కాంగ్రెస్ విడగొట్టి ఉండకపోతే దేశ విభజన జరిగి ఉండేది కాదని అమిత్‌షా విమర్శించారు. వందేమాతరం 100 ఏళ్లు పూర్తి చేసుకున్నప్పుడు దేశంలో ఎమర్జెన్సీ విధించారని, దీంతో జాతీయ గేయం కీర్తిని చాటేందుకు అవకాశం లేకుండా పోయిందని అన్నారు. వందేమాతరం అంటూ నినదించిన వారిని ఇందిరాగాంధీ జైళ్లలో పెట్టించారని చెప్పారు. జవహర్ లాల్ నెహ్రూ నుంచి ఇవాళ్టి నాయకత్వం వరకూ వందేమాతర గేయాన్ని వ్యతిరేకిస్తూనే ఉన్నారని విమర్శించారు.

# భారత్‌కు.. మళ్లీ ట్రంప్ షాక్?

**బియ్యంపై అదనపు సుంకాలు వేసే యోచన**

ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందానికి సంబంధించి భారత్– అమెరికా చర్చలకు సిద్ధమవుతుండగా ఓ కీలక పరిణామం చోటుచేసుకుంది. భారత్‌నుంచి దిగుమతయ్యే బియ్యంపై అదనపు సుంకాలు విధించాలనే యోచనలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఉన్నట్లు తెలుస్తోంది. చౌకైన విదేశీ వస్తువులు అమెరికా ఉత్పత్తిదారులను దెబ్బతీస్తున్నాయని అక్కడి రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో ట్రంప్ అదనపు సుంకాల గురించి యోచిస్తున్నట్లు మీడియాలో కథనాలు వస్తున్నాయి. అమెరికా రైతుల కోసం 12 బిలియన్ డాలర్ల బెయిల్ అవుట్ ప్యాకేజీ ప్రారంభానికి వైట్‌హౌస్‌లో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఇందులో పాల్గొన్న ట్రంప్ మాట్లాడుతూ.. పలు దేశాలు చౌక ధరలకే బియ్యాన్ని అమెరికా మార్కెట్లోకి డంప్ చేస్తున్నాయంటూ వస్తున్న వాదనలను తమ ప్రభుత్వం పరిశీలిస్తుందన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న కొందరు రైతులు సబ్సిడీ బియ్యం దిగుమతులు అమెరికా మార్కెట్లను దెబ్బతీస్తున్నాయని, దేశీయ ధరలను తగ్గిస్తున్నాయని వాదించారు. దీనిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ట్రంప్ మాట్లాడుతూ.. వారు (పలు దేశాలను ఉద్దేశిస్తూ) మోసం చేస్తున్నారని.. సుంకాల విధింపు మార్గాన్ని అనుసరించవచ్చని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా కెనడానుంచి ఎరువుల దిగుమతుల పైనా ఆయన ప్రస్తావించారు.



ఓ రైస్ మిల్ సీఈఓ మెరిల్ కెన్నెడీ మాట్లాడుతూ.. అగ్రరాజ్యానికి తమ ఉత్పత్తులను డంప్ చేస్తున్న దేశాల్లో భారత్, థాయిలాండ్, చైనాలు ప్రధానంగా ఉన్నాయన్నారు. చైనా వస్తువులు ఏకంగా ప్యూర్టోరికోలోకి కూడా వెళ్తున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. అనేక సంవత్సరాలుగా తామే ప్యూర్టోరికోకు బియ్యం ఎగుమతులు చేయడం లేదని వెల్లడించారు. వీటన్నింటివల్ల దక్షిణాదిలో తాము అనేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు విధించిన సుంకాలు పని చేస్తున్నాయని.. అయితే, వాటిని రెట్టింపు చేయాలని వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో ట్రంప్ మాట్లాడుతూ.. వివిధ దేశాలపై విధించిన సుంకాలను పెంచాలా? అని అడిగారు. ఇందుకు రైతులు బదులిస్తూ ఇతర దేశాల నుంచి వచ్చే ఉత్పత్తులను నియంత్రించాలని కోరారు.

అమెరికా రైతుల ఉత్పత్తులను దెబ్బతీసేలా ఉన్న దేశాల జాబితాను సమర్పించాలని వాణిజ్య కార్యదర్శి స్కాట్ బెసెంటును ట్రంప్ ఆదేశించారు. స్కాట్ బెసెంట్ మాట్లాడుతూ.. వీటిలో భారత్, థాయిలాండ్, చైనాలు ముందున్నాయన్నారు. మరిన్ని దేశాలు కూడా ఉన్నాయని, దీనికి సంబంధించి పూర్తి జాబితా అందిస్తామని తెలిపారు. వీటిపై సత్వరం చర్యలు తీసుకుంటామని ట్రంప్ హామీ ఇచ్చారు. భారత్‌తో వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన చర్చల ప్రారంభానికి ముందే ట్రంప్ అదనపు సుంకాల గురించి ఆలోచనలు చేయడం గమనార్హం. ఇక, భారత్– అమెరికాల మధ్య ట్రేడ్ డీల్‌కు సంబంధించిన చర్చలు ఈనెల 10 నుంచి ఢిల్లీలో జరగనున్నాయి. ఇందులో పాల్గొనేందుకు అమెరికా డిప్యూటీ వాణిజ్య ప్రతినిధి రిక్ స్విట్జర్ నేతృత్వంలోని ప్రతినిధుల బృందం మన దేశంలో పర్యటించనున్నారు. ఈ చర్చల్లో భారత్ తరపున వాణిజ్య కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ పాల్గొనున్నారు.

# -మొబిలిటీ ప్యాక్ట్ ఇంపాక్ట్-

**వృత్తినిపుణులకు రష్యా వీసాలు - మూడేళ్ల తాత్కాలిక నివాసానికి అవకాశం**



విదేశీ వృత్తి నిపుణులను ఆకర్షించేందుకు రష్యా సరికొత్త వీసాలను ప్రకటించింది. ఈ కొత్త వీసాకింద పలురంగాల నిపుణులకు ఆ దేశంలో మూడేళ్లపాటు తాత్కాలిక లేదా శాశ్వత నివాసం పొందే అవకాశాన్ని కల్పిస్తోంది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఇటీవల భారత్‌లో పర్యటించిన సంగతి తెలిసిందే. ఈ పర్యటనకు ముందే పుతిన్ ఈ కార్యక్రమానికి సంబంధించిన ఉత్తర్వులపై సంతకాలు చేసినట్లు అధికార వర్గాలు వెల్లడించాయని మీడియాలో కథనాలు వస్తున్నాయి. భారత్– రష్యా మొబిలిటీ ఒప్పందాన్ని బలోపేతం చేసేందుకు ఆ దేశ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ కొత్త వీసా కార్యక్రమం వచ్చే ఏడాది ఏప్రిల్ 15నుంచి అందుబాటులోకి రానున్నట్లు ఓ అధికారి తెలిపారు. విదేశీయులు, వారి కుటుంబసభ్యులకు సైన్స్, ఆర్థిక, పారిశ్రామిక, విద్యా, సాంస్కృతిక, వ్యాపార, క్రీడలువంటి పలు కీలకరంగాల్లో నిపుణులైన వారికి ఈ వీసాలు జారీ చేస్తామన్నారు. ఇమిగ్రేషన్ కోటాతో సంబంధం లేకుండా రష్యా భాషకు సంబంధించిన పరీక్షలో ఉత్తీర్ణత సాధించకపోయినా మూడేళ్లు తమ దేశంలో తాత్కాలిక నివాసం కోసం దరఖాస్తు చేసుకోవడానికి వీలు కల్పిస్తామన్నారు.

ఈ వీసా కార్యక్రమం రెండు దశల్లో ఉండనున్నట్లు అధికారులు తెలిపారు. మొదట వీసా కోసం అభ్యర్థులు ఏజెన్సీల్లో అప్లై చేసుకోవాలి. ఆ తర్వాత వారు ఈ వీసా పొందేందుకు అర్హులో, కాదో అధికారులు గుర్తిస్తారు. అర్హులుగా నిర్ణయించిన వారికి మూడేళ్లపాటు రష్యాలో తాత్కాలిక, శాశ్వత నివాసం కోసం వారు దరఖాస్తు చేసుకునే అవకాశం ఇస్తారు. ఏజెన్సీల ఆమోదం ఏడాదిపాటు చెల్లుబాటు అవుతుంది. ఈ క్రమంలో విదేశీయులు ఇమిగ్రేషన్ అధికారులకు తమ దరఖాస్తులు సమర్పించాలి. స్వదేశాల్లో ఉన్న అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా ఏజెన్సీల్లో దరఖాస్తులు సమర్పించవచ్చు. వారికి ఆమోదం లభిస్తే.. అభ్యర్థులు, వారి కుటుంబసభ్యులు రష్యాలోకి వచ్చేందుకు ఒక ఏడాదికిగాను బిజినెస్ వీసాను మంజూరుచేస్తారు. ఈ క్రమంలో వారు ఈ కొత్త వీసా కార్యక్రమానికి దరఖాస్తులు సమర్పించాలి. తాత్కాలిక, శాశ్వత నివాసం కోసం అభ్యర్థులు చేసుకున్న దరఖాస్తు పెండింగులో ఉంటే. అలాంటి విదేశీయులకు, వారి కుటుంబసభ్యులకు వర్క్ పర్మిట్ పొందేందుకు అర్హులుగా గుర్తిస్తామని అధికారి తెలిపారు. వీరి దరఖాస్తులను ఇమిగ్రేషన్ అధికారులు 30 రోజుల్లోపు ప్రాసెస్ చేస్తారన్నారు.

# యూఎన్ జెండా పీకేశారు..!

**యూఎన్‌ఆర్‌డబ్ల్యు ప్రధాన కార్యాలయంపై ఇజ్రాయెల్ దళాల దాడి**



ఆక్రమిత తూర్పు జెరూసలేంలోని పాలస్తీనా శరణార్థుల కోసం ఏర్పాటుచేసిన యునైటెడ్ నేషన్స్ రిలీఫ్ అండ్ వర్క్స్ ఏజెన్సీ ప్రధాన కార్యాలయంపై ఇజ్రాయెల్ దళాలు దాడి చేశాయి. ఈ క్రమంలో అక్కడి వస్తువులను స్వాధీనం చేసుకోవడంతో పాటు.. కార్యాలయంపై ఉన్న ఐరాస జెండాను తీసేసి ఇజ్రాయెల్ జెండాను ఉంచాయి. సంస్థకు చెందిన కమిషనర్ జనరల్ ఫిలిప్ లజారిని ఎక్స్ ద్వారా ఈ విషయాన్ని వెల్లడించారు. షేక్ జర్రాలోని సంస్థ ప్రాంగణంలోకి ఇజ్రాయెల్ దళాలు, మున్సిపల్ అధికారులు బలవంతంగా ప్రవేశించారని తెలిపారు. అన్ని కమ్యూనికేషన్లను నిలిపివేసి.. ఫర్నిచర్, ఐటీ పరికరాలతో సహా ఇతర వస్తువులన్నింటినీ స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. కార్యాలయంపై ఉన్న యూఎన్ జెండాను తీసేసి.. దాని స్థానంలో ఇజ్రాయెల్ జెండాను ఉంచారాన్నారు. ఈ ఘటనను ఆయన తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. అంతర్జాతీయ చట్టాలను ఇజ్రాయెల్ ప్రత్యక్షంగా ఉల్లంఘించిందని మండిపడ్డారు. ఐరాసలో సభ్యదేశమైన ఇజ్రాయెల్ తన బాధ్యతను విస్మరించిందన్నారు. ఐరాస సంస్థ తమ దేశంలో ఎలాంటి కార్యకలాపాలు నిర్వహించకూడదని టెల్అవీవ్ అధికారులు ఆదేశించినప్పటి నుంచి యూఎన్‌ఆర్‌డబ్ల్యూఏ తన భవనాన్ని ఉపయోగించడం లేదు. 2023 అక్టోబరు 7న హమాస్ జరిపిన దాడుల్లో ఆ సంస్థ ఉద్యోగులు పాల్గొన్నారని ఇజ్రాయెల్ ఆరోపించింది. ఈ క్రమంలో తమ దేశంలో యూఎన్‌ఆర్డబ్ల్యూఏ కార్యకలాపాలను నిలిపివేసింది. అయితే, టెల్అవీవ్ ఆరోపణలను ఇది ఖండించింది. అంతర్జాతీయ న్యాయస్థానం కూడా ఈ ఆరోపణలు నిరాధారమైనవిగా పేర్కొంది. యూఎన్‌ఆర్డబ్ల్యూఏ గాజా, వెస్ట్ బ్యాంక్‌లో పనిచేస్తున్న అతిపెద్ద మానవతా సహాయ సంస్థ. ఇజ్రాయెల్ దాడుల్లో నిరాశ్రయులైన పాలస్తీనియన్లకు ఆశ్రయం కల్పించడం, పాఠశాల విద్య అందించడంతోపాటు వైద్య సేవలు అందిస్తుంది.

# ఇండోనేషియాలో ఘోరం

**అగ్ని ప్రమాదంలో 20మంది మృతి - మృతుల సంఖ్య మరింత పెరగొచ్చని అంచనా**



ఇండోనేషియా రాజధాని జకార్తాలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఏరియల్ సర్వే కోసం ఉపయోగించే డ్రోన్లు తయారు చేసే ఏడంతస్తుల కార్యాలయంలో మంగళవారం ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో అనేకమంది అందులో చిక్కుకున్నట్లు స్థానిక అధికారులు పేర్కొన్నారు. ఇప్పటివరకు ఈ ఘటనలో 20మంది ప్రాణాలు కోల్పోగా.. అనేకమంది మంటల్లో చిక్కుకున్నట్లు తెలుస్తోంది. అగ్నికీలలు సమీపంలోని భవనాలకు వ్యాపించడంతో అక్కడి ప్రజలను ఇళ్లు ఖాళీ చేయించి.. సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు అధికారులు వెల్లడించారు. కార్యాలయ భవనంలోని మొదటి అంతస్తులో ఉన్న గోదాంలోని బ్యాటరీ పేలడంతో మంటలు అంటుకున్నట్లు అధికారులు అనుమానం వ్యక్తం చేశారు. మంటలు పైఅంతస్తులకు వ్యాపించడంతో భవనంలో అనేకమంది చిక్కుకున్నారని.. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్నామని తెలిపారు. ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక బృందాలు మంటలు ఆర్పడానికి శ్రమిస్తున్నాయన్నారు.

# అది భారత్ ఇష్టం!

**- లాభసాటి చోటునుంచే చమురు కొనుగోలు**

**- రష్యా అధ్యక్ష భవనం వ్యాఖ్య**

భారత్ ఒక సార్వభౌమ దేశమని, ఎక్కడ లాభదాయకంగా ఉందనుకుంటే అక్కడినుంచి చమురు కొనుగోలు చేసే స్వేచ్ఛ ఆ దేశానికి ఉందని రష్యా అధ్యక్ష భవనం క్రెమ్లిన్ పేర్కొంది. భారత్ తన ఆర్థిక ప్రయోజనాలను కాపాడుకునే విధానానికి కట్టుబడి ఉంటుందని ఆశాభావం వ్యక్తంచేసింది. రష్యానుంచి చమురు కొంటోందన్న అక్కసుతో అమెరికా.. ఇండియా నుంచి వస్తున్న ఎగుమతులపై అదనంగా 25 శాతం సుంకాలను విధించిన సంగతి తెలిసిందే. ఆ నెల చివరినాటికి దాన్ని 50 శాతానికి పెంచింది. ఇటీవల భారత్‌లో పర్యటించిన రష్యా అధ్యక్షుడు పుతిన్.. ప్రధాని మోదీతో చర్చల అనంతరం విలేకరులతో మాట్లాడుతూ చమురు అంశాన్ని కూడా ప్రస్తావించారు. భారత్‌కు నమ్మకమైన ఇంధన సరఫరాదారుగా రష్యా కొనసాగుతుందని పేర్కొన్నారు. "నాకు తెలిసినంతవరకూ భారత్.. తన ఆర్థిక ప్రయోజనాలకు అనుగుణంగా నడుచుకుంటుంది" అని క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రీ పెస్కోవ్ సోమవారం పేర్కొన్నారు.



# హార్దిక్ మెరుపులు..
# వణికించిన బౌలర్లు

**తొలి టీ 20లో భారత్ ఘన విజయం - 101 పరుగుల తేడాతో ఓడిన సౌతాఫ్రికా**





బ్యాటింగ్‌లో ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య విధ్వంసానికి తరువాత బౌలర్ల మెరుపులు తోడు కావటంతో సౌతాఫ్రికాతో జరిగిన మొదటి టీ 20 మ్యాచ్‌లో టీమిండియా ఘన విజయం సాధించి 5 మ్యాచ్‌ల సిరీస్‌లో శుభారంభం చేసింది. కటక్‌లో మంగళవారం జరిగిన తొలి టీ 20లో దక్షిణాఫ్రికాను భారత్ 101 పరుగుల తేడాతో చిత్తు చేసింది. భారత్ విధించిన 176 పరుగుల లక్ష్య ఛేదనలో సౌతాఫ్రికా 12.3 ఓవర్లలో 74 పరుగులకే కుప్పకూలింది. టీ 20ల్లో సౌతాఫ్రికాకు ఇదే అత్యల్ప స్కోరు. భారత్ బౌలర్లు సమష్టిగా రాణించి సౌతాఫ్రికా బ్యాటింగ్‌ను చుట్టేశారు. అర్షదీప్ సింగ్, జస్‌ప్రీత్ బుమ్రా, వరుణ్ చక్రవర్తి, అక్షర్ పటేల్ తలా రెండు వికెట్లు తీయగా.. హార్దిక్ పాండ్య, శివమ్ దూబె చెరో వికెట్ పడగొట్టారు. ఆల్‌రౌండ్ ప్రదర్శన చేసిన హార్దిక్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. సిరీస్‌లో రెండో టీ 20 గురువారం ముల్లాన్‌పూర్‌లో జరగనుంది.

ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 175 పరుగులు చేసింది. హార్దిక్ పాండ్యా(28 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్సలతో 59 నాటౌట్) అజేయ హాఫ్ సెంచరీతో రాణించాడు. సౌతాఫ్రికా బౌలర్లలో లుంగి ఎంగిడి(3/31) మూడు వికెట్లు తీయగా.. లుతో సిపమ్లా(2/38) రెండు వికెట్లు పడగొట్టాడు. డోనోవన్ ఫెర్రెరియా ఒక వికెట్ పడగొట్టాడు.అనంతరం సౌతాఫ్రికా 12.3 ఓవర్లలో 74 పరుగులకు ఆలౌటయింది. డెవాల్డ్ బ్రెవిస్(14 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 22) టాప్ స్కోరర్‌గా నిలవగా.. మిగతా బ్యాటర్లు దారుణంగా విఫలమయ్యారు. భారత బౌలర్లలో అర్షదీప్ సింగ్ (2/14), జస్‌ప్రీత్ బుమ్రా (2/17), వరుణ్ చక్రవర్తి (2/19), అక్షర్ పటేల్ (2/7) రెండేసి వికెట్లు తీయగా.. హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే చెరో వికెట్ పడగొట్టారు. 176 పరుగుల లక్ష్య ఛేదనలో సౌతాఫ్రికాకు ఆశించిన ఆరంభం దక్కలేదు. ఒక్క పరుగు కూడా చేయకుండానే ఓపెనర్ క్వింటన్ డికాక్(0) డకౌటయ్యాడు. అర్షదీప్ సింగ్ బౌలింగ్‌లో క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. తన మరుసటి ఓవర్‌లో ట్రిస్టన్ స్టబ్స్(14)ను అర్షదీప్ సింగ్ క్లీన్ బౌల్డ్ చేశాడు. అక్షర్ పటేల్ తన తొలి బంతికే మార్క్‌రమ్(14)ను క్లీన్ బౌల్డ్ చేశాడు. దాంతో పవర్ ప్లేలో సౌతాఫ్రికా 3 వికెట్లకు 45 పరుగులు చేసింది. పవర్ ప్లే ముగిసిన వెంటనే డేవిడ్ మిల్లర్(1)ను హార్దిక్ పాండ్యా కీపర్ క్యాచ్‌గా పెవిలియన్ చేర్చాడు.ఆ తర్వాత వచ్చిన డోనోవన్ ఫెర్రెరియా(5)ను వరుణ్ చక్రవర్తి ఔట్ చేయగా.. దూకుడుగా ఆడిన డెవాల్డ్ బ్రెవిస్(22)ను జస్‌ప్రీత్ బుమ్రా క్యాచ్ ఔట్ చేశాడు. ఈ వికెట్‌తో టీ20ల్లో బుమ్రా 100 వికెట్ల మైలురాయిని అందుకున్నాడు. భారీ సిక్సర్ బాదిన మార్కో యాన్సెన్(12)ను మరుసటి బంతికే వరుణ్ చక్రవర్తి క్లీన్ బౌల్డ్ చేశాడు. అదే ఓవర్‌లో కేశవ్ మహరాజ్(0)ను బుమ్రా క్యాచ్ ఔట్ చేయగా.. అన్రిచ్ నోకియా(1)ను అక్షర్ పటేల్ క్లీన్ బౌల్డ్ చేశాడు. లుతో సిప్లమా(2)ను దూబే ఆఖరి వికెట్‌గా పెవిలియన్ చేర్చడంతో సౌతాఫ్రికా ఇన్నింగ్స్ ముగిసింది. టీ20 క్రికెట్ చరిత్రలోనే సౌతాఫ్రికాకు ఇదే అత్యల్ప స్కోర్.



## బుమ్రాకు అరుదైన ఘనత

భారత్ స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా అరుదైన ఘనత సాధించాడు. మంగళవారం కటక్ వేదికగా సౌతాఫ్రికాతో జరిగిన తొలి టీ 20 మ్యాచ్‌లో బుమ్రా ఈ ఫీట్ అందుకున్నాడు. ఈ మ్యాచ్‌కు ముందు 99 వికెట్లతో ఉన్న బుమ్రా.. డెవాల్డ్ బ్రెవిస్ వికెట్ తీయడం ద్వారా 100 వికెట్ల మైలురాయి చేరుకున్నాడు. తద్వారా అంతర్జాతీయ క్రికెట్‌లోని మూడు ఫార్మాట్ల(టెస్ట్, వన్డే, టీ20)లో వంద వికెట్లు తీసిన తొలి భారతీయ బౌలర్‌గా, అంతర్జాతీయంగా ఐదో బౌలర్‌గా బుమ్రా చరిత్ర సృష్టించాడు. అయితే అర్షదీప్ సింగ్ టీ20లో ఇప్పటికే 100 వికెట్లు తీసినప్పటికీ.. మిగతా రెండు ఫార్మాట్లలో అతడికి ఈ రికార్డు లేదు. ఇప్పటి వరకు లసిత్ మలింగ (శ్రీలంక), టిమ్ సౌథీ (న్యూజీలాండ్), షకీబుల్ హసన్ (బంగ్లాదేశ్), షహీన్ అఫ్రిది (పాకిస్థాన్) మాత్రమే ఈ ఘనత సాధించారు.

బుమ్రా తన కెరీర్‌లో ఇప్పటికే సుదీర్ఘ ఫార్మాట్లలో 100 వికెట్ల మార్క్‌ను దాటేశాడు. టెస్ట్ క్రికెట్‌లో 52 మ్యాచులు ఆడిన బుమ్రా 234 వికెట్లు తీసుకున్నాడు. వన్డేల్లో 89 మ్యాచుల్లో 149 వికెట్లు పడగొట్టాడు. టీ20ల్లో 81 మ్యాచ్‌ల్లో 101 వికెట్లు తీశాడు.

# ఆడవారికి గౌరవం ఇవ్వరా?

**- ఫొటోగ్రాఫర్లపై హార్దిక్ అసహనం**



టీమ్‌ఇండియా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యకు కోపమొచ్చింది. తన గర్ల్‌ఫ్రెండ్ మహికాశర్మను ఇబ్బందిపడే కోణంలో ఫొటోలు తీసిన ఫొటోగ్రాఫర్లపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. ముంబయిలో ఓ యాడ్ షూట్‌లో పాల్గొనేందుకు మహిక వెళ్లినప్పుడు ఈ సంఘటన ఎదురైంది. ఆమె రెస్టారెంట్ మెట్లు దిగివస్తుండగా తీయకూడని యాంగిల్‌లో కొందరు ఫొటోలు తీశారు.. ఇది ఎంత మాత్రం అమోదయోగ్యం కాదని హార్దిక్ అసహనం వ్యక్తం చేశాడు. ఈ మేరకు మంగళవారం ఇన్‌స్టాగ్రాంలో హార్దిక్ స్టోరీ పోస్ట్ చేశాడు.

సెలబ్రిటీలను నిత్యం ఉత్సుకతతో పరిశీలిస్తుంటారు. ఈ విషయాన్ని నేను అర్థం చేసుకోగలను. కానీ కొందరు హద్దులు దాటారు. మహికా శర్మ.. బాంద్రాలో ఓ రెస్టారెంట్ దగ్గర నడుచుకుంటూ వెళ్తుండగా ఫొటోగ్రాఫర్లు.. ఆమె ఫొటోలను తీశాడు. అయితే ఆడవాళ్లు ఇబ్బంది పడేలా ఉన్న కోణంలో వాటిని తీశారు. ఫొటోగ్రాఫర్లు సెన్సేషనలిజం కోసం వ్యక్తిగత గోప్యతకు గౌరవం ఇవ్వడం లేదు. ఆడవాళ్లకు మనం కనీస మర్యాద ఇవ్వాలి. ప్రతి ఒక్కరికీ హద్దులుంటాయని హార్దిక్ పాండ్య పేర్కొన్నాడు..

అదే సమయంలో మీడియా వ్యక్తులు పడే కష్టం గురించి కూడా ప్రస్తావించాడు. ప్రతి రోజూ కష్టించి పనిచేసే మీడియా సోదరులకు ఓ విజ్ఞప్తి. మీ వృత్తిని నేను గౌరవిస్తాను. మీకు నిత్యం సహకరిస్తాను. కానీ మీ అందరినీ ఒకటే కోరుతున్నా. కాస్త విజ్ఞతతో వ్యవహరించండి. ప్రతి అంశాన్నీ ఫొటోలు తీయాల్సిన అవసరం లేదు. ప్రతి కోణాన్నీ మీ కెమెరాల్లో బంధించాల్సిన అవసరం లేదు. కాస్త మానవత్వం చూపించండి. థ్యాంక్యూ.. అని హార్దిక్ పాండ్య రాసుకొచ్చాడు.

భార్య నటాషా స్టాంకోవిక్‌కు విడాకులు ఇచ్చిన తర్వాత హార్దిక్ పాండ్యా మళ్లీ ప్రేమలో పడిన విషయం తెలిసిందే. మోడల్, యోగా ట్రైనర్ మహీక శర్మతో అతడు కొన్నాళ్లుగా డేటింగ్ చేస్తున్నాడు. తన పుట్టినరోజు (అక్టోబరు 11) సందర్భంగా మహీకతో అత్యంత సన్నిహితంగా దిగిన ఫొటోలను షేర్ చేస్తూ తమ బంధాన్ని ధ్రువీకరించాడు. ఇక అప్పటి నుంచి జిమ్ మొదలు బీచ్ వరకు ఇద్దరూ కలిసి చెట్టాపట్టాలేసుకుని విహరిస్తున్నారు.

# 16న ఐపీఎల్ వేలం



ఐపీఎల్ -2026 లీగ్ వేలం ఈ నెల 16న ప్రారంభం కానుండగా.. 350 మంది ఆటగాళ్లు వేలంలోకి రానున్నారు. నమోదు చేసుకున్న ప్లేయర్ల జాబితా నుంచి బీసీసీఐ అనూహ్యంగా 1,005 మంది పేర్లను తొలగించింది. అలాగే 35 మంది కొత్త ఆటగాళ్ల పేర్లను చేర్చింది. 350 మంది ఆటగాళ్లకు సంబంధించిన వేలం డిసెంబర్ 16 మధ్యాహ్నం 2:30 గంటల సమయంలో అబుదాబీలో జరగనుందని ఐపీఎల్ ఫ్రాంచైజీలకు పంపిన మెయిళ్లలో బీసీసీఐ తెలిపింది. మొదట బిడ్డింగ్ ప్రక్రియ.. బ్యాటర్లు, ఆల్ రౌండర్లు, వికెట్-కీపర్/బ్యాటర్లు, ఫాస్ట్ బౌలర్లు, స్పిన్ బౌలర్లు అనే విభాగాల వారీగా క్యాప్డ్ ఆటగాళ్లతో ప్రారంభమవుతుంది. తరువాత, అన్‌క్యాప్డ్ ఆటగాళ్లకు కూడా ఇదే వరుస క్రమంలో జరిగే అవకాశముంది.

### డికాక్ విషయంలో...

ఇలాఉంటే ఓ ఫ్రాంచైజీ సౌతాఫ్రికా స్టార్ ప్లేయర్ క్వింటన్ డికాక్ పేరును జాబితాలో చేర్చమని కోరడంతో అతడికి జాబితాలో స్థానం దక్కిన్నట్లు తెలుస్తోంది. డికాక్ గతంలో అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్‌మెంట్ ప్రకటించి.. మళ్లీ తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్న విషయం తెలిసిందే. కాగా ఇటీవల వైజాగ్ వేదికగా టీమిండియాతో జరిగిన వన్డే సిరీస్‌లో సెంచరీతో చెలరేగాడు. అయితే రానున్న ఆక్షన్‌లో క్వింటన్ డికాక్ కనీస ధర రూ.కోటి ఉండనున్నట్లు సమాచారం. గత వేలంతో పోల్చుకుంటే అతడి ధర 50 శాతం తగ్గింది. గతంలో కేకేఆర్ అతడిని రూ.2 కోట్లకు దక్కించుకుంది.

# నా పాత్ర.. కత్తితో సావాసమే



విభిన్న కథల్లో నటిస్తూ తెలుగు ప్రేక్షకుల్లోనూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు కోలీవుడ్ హీరో కార్తి. ఆయన నటించిన కొత్త సినిమా 'వా వాతియార్'. తెలుగు టైటిల్ 'అన్నగారు వస్తారు'. ఈనెల 12న విడుదల కానుంది. ఈ సందర్భంగా చెన్నైలో నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో పలు విశేషాలు పంచుకున్నారు కార్తి. ఓ నటుడిగా తనకు 'వా వాతియార్' రిస్కీ సబ్జెక్ట్ అని అభిప్రాయపడ్డారు. ఈ సినిమా కత్తితో సావాసం చేయడం లాంటిదన్నారు. ఈ చిత్రంలో.. తమిళ నటుడు దివంగత ఎంజీఆర్‌ను అనుకరించడాన్ని ఉద్దేశించి కార్తి వ్యాఖ్యానించారు. దర్శకుడు నలన్ కుమారస్వామి ఈ కథ చెప్పినప్పుడు.. నటించేందుకు తొలుత సందేహించానని, తర్వాత ఓకే చేశానని తెలిపారు. "ఈ కథ గురించి ఆలోచిస్తూ నిద్ర పోయేవాడిని కాదు. నా నటనతో ఎంజీఆర్ అభిమానులు ఇబ్బంది పడతారేమోనన్న భయం ఉండేది. కానీ, భయాన్ని వీడితేనే ఎదుగుదల ఉంటుంది. అందుకే కొన్ని రోజుల తర్వాత నలన్‌కు ఫోన్ చేసి, సినిమాలో నటిస్తానని చెప్పా. ఎంజీఆర్ గురించి రోజూ కొత్త విషయాలు తెలుసుకునేవాడిని. ఇది ఎంటర్టైనింగ్ మూవీ" అని తెలిపారు. ఈ సినిమాలో పోలీసు అధికారిగా నటించారు కార్తి. కృతిశెట్టి హీరోయిన్.

## రెండో సాంగుతో రోషన్..



'ఛాంపియన్'గా తెరపై సందడి చేయడానికి సిద్ధమవుతున్నారు శ్రీకాంత్ కుమారుడు రోషన్. ప్రదీప్ అద్వైతం తెరకెక్కిస్తున్న చిత్రమిది. అనస్వర రాజన్ కథానాయిక. ఈ సినిమా డిసెంబరు 25న రాబోతుంది. ఈ నేపథ్యంలో ప్రచారం జోరు పెంచారు. తాజాగా సినిమాలోని రెండో పాటను విడుదల చేశారు. 'సల్లంగుండాలే..' అంటూ సాగే ఈ సాంగుకు చంద్రబోస్ లిరిక్స్ రాయగా.. రితేశ్, మనీషా ఆలపించారు. ఇప్పటికే ఇందులోని 'గిర గిర గింగిరాగిరే..' పాట సోషల్ మీడియాలో ట్రెండింగులో ఉన్న విషయం తెలిసిందే.

## 'నేను వేస్ట్.. నాదే బ్యాడ్‌లక్'

బాలకృష్ణ 'అఖండ 2'కొత్త విడుదలతేదీపై ఇంకా స్పష్టత రాకపోవడంతో చిన్నచిత్రాల రిలీజ్‌పై సందిగ్ధత నెలకొంది. ఒకవేళ 'అఖండ-2' డిసెంబరు 12న బాక్సాఫీసు ముందుకొస్తే.. ఆరోజు విడుదలయ్యేందుకు సిద్ధమైన పలు సినిమాలు వాయిదా పడే అవకాశాలున్నాయి. తన కొత్త చిత్రం 'మోగ్లీ'పై దర్శకుడు సందీప్ రాజ్ పెట్టి పోస్టు దానికి నిదర్శనమనిపిస్తోంది. తాను తెరకెక్కించిన తొలి సినిమా 'కలర్ ఫోటో' విషయంలోనూ ఇలాంటి పరిణామాలే ఎదురైనట్టు తెలిపారు. సందీప్ ట్వీట్‌పై నటుడు సాయి దుర్గాతేజ్, నిర్మాత ఎస్కేఎన్ తదితరులు స్పందించారు. "సందీప్.. మీ కష్టానికి తగ్గ ప్రతిఫలం ఊహించని విధంగా దక్కుతుంది.ధైర్యంగా ఉండండి. మీవిషయంలో మీరు గర్వపడండి.చివరకు సినిమా గెలుస్తుంది" అని సాయి దుర్గాతేజ్ భరోసా ఇచ్చారు. "డియర్ సందీప్.. జాతీయ అవార్డు చిత్రం 'కలర్ ఫోటో'లో మీరు ఒక భాగం. ఈ అడ్డంకులన్నీ తాత్కాలికం. దిగులు పడొద్దు. మీ కష్టాన్ని ప్రేక్షకులు గుర్తిస్తారు. మద్దతు ఇస్తారు. ఆల్ ది బెస్ట్" అని ఎస్కేఎన్ పేర్కొన్నారు.



### ఇంతకీ సందీప్‌రాజ్ ఏమన్నారంటే?

"కలర్ ఫోటో", 'మోగ్లీ'కి నాకన్నా వేరే దర్శకుడు అర్హుడని అనుకుంటున్నా.సినిమాపై ఎంతో ప్యాషన్‌ఉన్న వ్యక్తులు వీటిలో భాగమయ్యారు.ఈరెండు సినిమాలకు సంబంధించి రెండు కామన్ పాయింట్స్ ఏంటంటే.. 1 అంతా సవ్యంగానే జరుగుతోందని అనుకుంటే, విడుదల విషయంలో దురదృష్టం ఎదురవడం. 2. నేను. నాదే 'బ్యాడ్లక్' అనుకుంటున్నా. డైరెక్టెడ్ బై సందీప్ అని వెండితెరపై నా పేరు చూసుకోవాలన్న కల రోజురోజుకూ కష్టతరమవుతోంది. సిల్వర్ నన్ను ద్వేషిస్తుందేమో. రోషన్, సరోజ్, సాక్షి, హర్ష, డీవోపీ మారుతి, మ్యూజిక్ డైరెక్టర్ కాల భైరవ.. ఇలా అంకిత భావం ఉన్న ఎంతోమంది కష్టంతో 'మోగ్లీ' రూపొందింది. వారి కోసమైనా ఈ సినిమా విషయంలో మంచి జరగాలని ఆశిస్తున్నా" అని అన్నారు. రోషన్ కనకాల హీరోగా సందీప్ తెరకెక్కించిన ఈ సినిమా డిసెంబరు 12న విడుదలకు సిద్ధమైంది. తాజా పరిణామాల నేపథ్యంలో పోస్టుపోన్ అయ్యే అవకాశాలున్నట్టు ప్రచారం జరుగుతోంది. సందీప్ తొలి సినిమా 'కలర్ ఫోటో'.. లాక్డౌన్ కారణంగా నేరుగా ఓటీటీలోనే విడుదల కావడం గమనార్హం.

## డార్లింగ్ సేఫ్ అన్న మారుతి

ప్రస్తుతం ప్రభాస్ జపాన్‌లో ఉన్న విషయం తెలిసిందే. అయితే, తాజాగా జపాన్ ఉత్తర తీరంలో భారీ భూకంపం సంభవించడంతో ఆయన అభిమానులు ఆందోళన చెందుతూ పోస్టులు పెడుతున్నారు. వారికి దర్శకుడు మారుతి రిప్లై ఇచ్చారు. ప్రభాస్ క్షేమంగా ఉన్నారని తెలిపారు.



'జపాన్‌లో భూకంపం వచ్చింది. సునామీ హెచ్చరికలు జారీ చేశారు. మా హీరో ఎక్కడఉన్నారు. ఈరోజు సాయంత్రం రిటర్న్ అవుతాడా?' అని ఓ అభిమాని మారుతిని అడుగుతూ పోస్ట్ పెట్టాడు. దీనికి ఆయన స్పందిస్తూ.. 'ప్రభాస్‌తో ఇప్పుడే మాట్లాడాను. భూకంపం వచ్చిన ప్రాంతంలో ఆయన లేరు. ఆయన క్షేమంగా ఉన్నారు. ఆందోళన చెందకండి' అని రిప్లై మారుతి పెట్టారు. దీంతో అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు. 'బాహుబలి: ది ఎపిక్' డిసెంబర్ 12న జపాన్‌లో విడుదల కానున్న సందర్భంగా ప్రచారంలో భాగంగా ప్రభాస్ అక్కడికి వెళ్లారు. అక్కడి అభిమానులతో కలిసి సందడి చేస్తున్నారు. ఇక మరోవైపు మారుతి- ప్రభాస్ కాంబోలో రానున్న 'ది రాజాసాబ్' ప్రచార పనులను షురూ చేసింది. ఈ మూవీ జనవరి 9న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో దీనిలోని రెండో త్వరలోనే రిలీజ్ చేయనున్నట్టు సమాచారం.

## 'టాక్సిక్' కథనాలకు చెక్

కన్నడ స్టార్ యశ్ నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'టాక్సిక్' ఇప్పటికే ప్రేక్షకుల్లో ఎలాంటి బజ్ క్రియేట్ చేసిందో అందరికీ తెలిసిందే. ఈ సినిమాను గీతూదాస్ డైరెక్ట్ చేస్తుండగా పీరియాడిక్ గ్యాంగ్‌స్టర్ డ్రామాగా సినిమా ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. కాగా, ఈ సినిమా నుండి తాజాగా ఇంటెన్స్ పోస్టర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. గతకొద్ది రోజులుగా ఈ చిత్ర రిలీజ్ డేట్ వాయిదా అంటూ వచ్చిన వార్తలకు చెక్ పెడుతూ యశ్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. 2026 మార్చి 19న 'టాక్సిక్' చిత్రాన్ని రిలీజ్ చేస్తున్నట్టు మరో సారి పోస్టర్ ద్వారా కన్ఫర్మ్ చేశారు. ఇక టాక్సిక్ గ్యాంగ్‌స్టర్ రాకకు మరో 100రోజులు మాత్రమేఉందని ఆయన కౌంట్‌డౌన్ షురూ చేశారు. ఈ సినిమాలో కియారా అద్వానీ, నయనతార, తారా సుతారియా, రుక్మిణి వసంత్, హుమా ఖురేషీ తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాను కెవిఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ బ్యానర్లు సంయుక్తంగా ప్రొడ్యూస్ చేస్తున్నాయి.




## రజనీ హిట్టుకు సీక్వెల్

కెఎస్ రవికుమార్ దర్శకత్వంలో రజనీకాంత్ హీరోగా వచ్చిన చిత్రం 'నరసింహ'. రమ్యకృష్ణ, సౌందర్య పాత్రలు హైలైట్‌గా నిలిచిన ఈ చిత్రానికి ఇప్పుడు సీక్వెల్ రానుంది. ఈ విషయాన్ని రజనీకాంత్ అధికారికంగా ప్రకటించారు. టైటిల్ కూడా వెల్లడించడంతో అభిమానులు సంబరపడుతున్నారు. డిసెంబర్ 12న ఈ సూపర్‌స్టార్ 75 ఏళ్లు పూర్తి చేసుకోనున్నారు. ఈ సందర్భంగా ఆయన సూపర్ హిట్ చిత్రం 'నరసింహ'ను రీరిలీజ్ చేయనున్నారు. ఈ రీరిలీజ్ ప్రచారంలో భాగంగా రజనీ ప్రత్యేక వీడియో విడుదల చేశారు.అందులో సీక్వెల్‌ను ప్రకటించారు. "ఆడవాళ్లందరూ గేట్లు బద్దలుకొట్టి థియేటర్లలోకి వచ్చిన సినిమా 'నరసింహ'. అలాంటి ఈ చిత్రానికి సీక్వెల్ తీయనున్నాం. ఎన్నో సినిమాలు రెండు భాగాలుగా వస్తున్నాయి. అలాంటప్పుడు ఇంత సూపర్ హిట్ సినిమాకు సీక్వెల్ ఎందుకు తీయకూడదు అనిపించింది. 2.0 (రోబో సీక్వెల్), జైలర్-2 చేసేటప్పుడు ఈ ఆలోచన వచ్చింది. నరసింహ రెండో భాగాన్ని 'నీలాంబరి' టైటిల్‌తో మీకు అందిస్తాం. ప్రస్తుతం దీని స్టోరీపై చర్చలు నడుస్తున్నాయి"అని రజనీకాంత్ చెప్పారు.

### నీలాంబరి పాత్రకోసం ఐశ్వర్యారాయ్..

ఈ సినిమాలో నీలాంబరి పాత్ర కోసం మొదట ఐశ్వర్యారాయ్‌ని సంప్రదించినట్టు రజనీకాంత్ తెలిపారు. "ఈ నరసింహ కథను నేను రాశాను. నా స్నేహితుల పేర్లతో నిర్మించాను. ఇందులో ఎంతో పవర్‌ఫుల్ పాత్ర నీలాంబరి కోసం ఐశ్వర్యారాయ్‌ని సంప్రదించాం. కానీ, ఆమె ఆసక్తి లేదని తెలిపారు. ఆ తర్వాత శ్రీదేవి, మాధురీదీక్షిత్ పేర్లను కూడా పరిశీలించాం. అలా చాలామంది పేర్లు చర్చించుకున్న తర్వాత దర్శకుడు రమ్యకృష్ణ అయితే న్యాయం చేయగలరని చెప్పారు. దీంతో రమ్యను ఎంపిక చేశాం" అని రజనీ తెలిపారు. 1999లో విడుదలైన 'నరసింహ' రజనీ కెరీర్‌లోనే బ్లాక్‌బస్టర్ హిట్లలో ఒకటిగా నిలిచింది. రజనీకాంత్ టైటిల్ పాత్ర పోషించగా ఆయన భార్య వసుంధర పాత్రలో సౌందర్య నటించారు. రమ్యకృష్ణ నటించిన నీలాంబరి పాత్ర చిత్రానికే ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇప్పటికి 26 ఏళ్లవుతున్నా ఈ పాత్ర నేటికీ సోషల్ మీడియా రీల్స్‌లో ట్రెండింగ్‌లో ఉంది. ప్రస్తుతం రజనీకాంత్, రమ్యకృష్ణ 'జైలర్-2'లో నటిస్తోన్న విషయం తెలిసిందే.



## ఎన్‌బీకే 111.. సెట్స్‌పైకి సన్నాహాలు

గోపీచంద్ మలినేని దర్శకత్వంలో వచ్చే ఎన్‌బీకే 111 గురించి వరుస అప్‌డేట్లు వస్తున్నాయి.ప్రస్తుతం సినిమా ప్రీ-ప్రొడక్షన్ చివరి దశలో ఉంది. త్వరలోనే సెట్స్‌పైకి తీసుకెళ్లేందుకు సన్నాహాలు చేస్తున్నారు. మ్యూజిక్ డైరెక్టర్ థమన్ ఇన్‌స్టాగ్రామ్‌లో చిన్న అప్‌డేట్ ఇస్తూ ఈ సినిమా మ్యూజిక్ వర్క్ ప్రారంభమైందని తెలిపాడు. అలాంటి ఒక చిన్న పోస్ట్‌తోనే అభిమానుల్లో కొత్తగా హైప్ మొదలైంది. ఈ చిత్రం పీరియడ్ డ్రామాగా తెరకెక్కుతోంది. ఇందులో బాలకృష్ణ ద్విపాత్రాభినయం చేస్తున్నారని సమాచారం. నయనతార ఈ చిత్రంతో మళ్లీ బాలయ్యతో జతకట్టడం కూడా ప్రాజెక్ట్‌పై మరింత ఆసక్తి పెంచుతోంది. వృద్ధి సినిమాస్ నిర్మిస్తున్న ఈ ప్రాజెక్ట్ షూటింగ్ ప్రారంభమైన తర్వాత వరుస అప్‌డేట్లు వచ్చే అవకాశాలు ఉన్నాయి.

